
ప్రభాత
వెలుగు
08.01.2019
www.v6velugu.com
మంగళవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 323 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి



3,030 'సర్పంచ్' నామినేషన్లు

తొలిదశ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ..

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో తొలి దశ ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీల్లో మొదటి రోజు సర్పంచ్ పదవికి 3,030 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ దశలో మొత్తంగా 4,479 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. 4,337 పంచాయతీలకు రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. సర్పంచ్ పదవికి అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో 257 నామినేషన్లు రాగా, అత్యల్పంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిదశలో 39,822 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా.. తొలిరోజు 39,100 వార్డులకు ఆర్వోలు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ వార్డు మెంబర్ పదవుల కోసం 3,827 నామినేషన్లు వచ్చాయి. ఇందులో అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 492 నామినేషన్లురాగా, అత్యల్పంగా ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 23 చొప్పున దాఖలయ్యాయి.

పండుగ సెలవుల్లేవ్..

పంచాయతీ ఎలక్షన్ల విధుల్లో ఉన్న సిబ్బంది ఆన్‌డ్యూటీలోనే..

భోగి, సంక్రాంతి, కనుమ, రిపబ్లిక్ డేల్లో పని చేయాల్సిందే

ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

02

పెద్ద కులాలకు కోటా



ఎవరు అర్హులు

- వార్షికాదాయం రూ.8 లక్షలలోపు ఉన్నవారు
- ఐదెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్నవారు
- వెయ్యి చదరపు అడుగులలోపు నివాస స్థలం ఉన్నవారు
- నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో 100 గజాలలోపు జాగా ఉన్నవారు
- నోటిఫై కాని మున్సిపాలిటీల్లో 200 గజాలలోపు జాగా ఉన్నవారు

ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు

కేంద్ర కేబినెట్ ఆమోదం.. రాజ్యాంగ సవరణకు సిద్ధం

నేడు లోక్‌సభలో.. రేపు రాజ్యసభలో బిల్లు

ఎలక్షన్ గిమ్మిక్కు.. అయినా మద్దతిస్తాం: కాంగ్రెస్

రాజ్యసభ సమావేశాలు రేపటిదాకా పొడిగింపు

న్యూఢిల్లీ, వెలుగు:
లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పచ్చ జెండా ఊపింది. ఈ మేరకు సోమవారం ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ ఓకే చెప్పింది. రూ.8 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి రిజర్వేషన్లకు అర్హులుగా ప్రతిపాదించింది. దీంతోపాటు మరికొన్ని నిబంధనలను పొందుపరిచింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కలిపి 49.5 శాతంగా ఉన్న రిజర్వేషన్లు తాజా ప్రతిపాదనతో 59.5 శాతానికి చేరనున్నాయి. 10 శాతం అదనపు కోటా కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16కు సవరణ చేయాల్సి ఉంటుంది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును కూడా మంగళవారమే కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. వాస్తవానికి మంగళవారంతో సమావేశాలు ముగియాల్సి ఉంది. 10 శాతం కోటాతో ముఖ్యంగా అగ్రవర్ణాల్లోని బ్రాహ్మణులు, రాజ్‌పుత్, జాట్, మరాఠా, భూమిహార్లు, కాపు, కమ్మ తదితర వర్గాల్లోని పేదలకు లబ్ధి చేకూరనుంది. ఎన్నికల ముందు కేంద్రం ఈ సంచలన నిర్ణయం తీసుకోవడంపై రాజకీయ పార్టీల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కొన్నిపార్టీలు స్వాగతించగా.. మరికొన్ని పార్టీలు కేంద్రానిది ఎన్నికల గిమ్మిక్కు అని దుయ్యబట్టాయి. కాంగ్రెస్ ఈ బిల్లుకు మద్దతు పలుకుతామని చెబుతూనే.. కేంద్రం ఉద్దేశాన్ని మాత్రం తప్పుపట్టింది. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ఈ టైంలో కోటాను తెరపైకి తెచ్చిందని విమర్శించింది.


ఇప్పుడేం జరగనుంది?
ఏ వర్గానికైనా ఆర్థిక ప్రాతిపదికగా రిజర్వేషన్లు కల్పించరాదని రాజ్యాంగం చెబుతోంది. అందుకే ప్రస్తుతం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకే రిజర్వేషన్లు అందుతున్నాయి. జనరల్ కేటగిరీలో ఉండి ఆర్థికంగా వెనుకబడి ఉన్నా ఆ వర్గాలకు రిజర్వేషన్లు లేవు. వారికి కూడా ఆర్థిక ప్రాతిపదికన

మిగతా 3లో

ఈబీసీ కోటా నిలిచేనా?

న్యాయవివాదాలు తలెత్తే అవకాశం.. ఎన్నికల కోసమే హడావుడి నిర్ణయం

03




02

జనరల్

నేడు, రేపు సార్వత్రిక సమ్మె

కనీస వేతనాల పెంపు డిమాండ్‌తో దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగుల సమ్మె.



12

జనరల్

సోలార్ రోడ్లు

కాలుష్యం రహిత విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రపంచవ్యాప్తంగా రోడ్లు 'సోలార్'గా మారుతున్నాయి.




06

తెలంగాణం

ఎటు చూసినా విషాదమే..

శబరిమల వెళ్లొస్తూ మరణించినవారి కుటుంబాలు ఆవేదనలో మునిగిపోయాయి.



10

బిజినెస్

రుణమాఫీలతో ఇబ్బందే

రాష్ట్రాలు పంట రుణాలను మాఫీ చేయడం సరికాదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు.

రామగుండంలో మెడికల్ కాలేజీ




సీఎం హామీలను త్వరలోనే నెరవేరుస్తాం

కొత్త పంచాయతీలను ఏకగ్రీవం చేయండి

ఏ ఎన్నికలొచ్చినా గులాబీ జెండా ఎగరాలి

టీఆర్ఎస్‌లో చేరికల సందర్భంగా కేటీఆర్

04



నేటి నుంచి జేఈఈ మెయిన్స్

రాష్ట్రంలో 34 పరీక్షా కేంద్రాలు

పాస్‌పోర్టు ఫొటో, గుర్తింపుకార్డు తప్పనిసరి

హైదరాబాద్, వెలుగు: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ సహా ఏడు పట్టణాల్లో ఏర్పాటు చేసిన 34 కేంద్రాల్లో ఈనెల 12 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఆయా తేదీల్లోఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, అడ్మిట్ కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఏదైనా అధికారిక గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు చెప్పారు. అభ్యర్థులు పరీక్ష హాల్‌లోకి ఎలాంటి వస్తువులను తీసుకురావొద్దని.. పెన్ను, పెన్సిల్, బ్లాంక్ పేపర్లను అధికారులే అందుబాటులో ఉంచుతారని వెల్లడించారు.

వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
87.00	87.00	87.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
87.00	87.00	86.00

నిధులున్నయ్.. నీళ్లు పారాలె!

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలె: సీఎం కేసీఆర్

రాష్ట్రంలో కోటి ఎకరాలకు నీరందించాలె

ప్రాజెక్టుల నీళ్లతో ముందు చెరువులు నింపాలె



మనకు ఐదేళ్ల సమయముంది. రాజకీయ సుస్థిరత ఉంది. నిధులకు కొరతలేదు. రైతులకు నీళ్లివ్వడమే ధ్యేయంగా పనిచేయాలి. టీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి నీళ్లిస్తారన్న నమ్మకంతో ప్రజలు అవకాశం ఇచ్చారు. దాన్ని నిలబెట్టుకోవాలి.

"హైదరాబాద్‌కు మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు మల్లన్నసాగర్ నుంచి 10 టీఎంసీల నీళ్లు పంపాలి. హల్దీవాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు నీరందించాలి. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులు నింపాలి. వాటి ద్వారా నీటిని విడుదల చేస్తూ మూసీ మురికిని వదిలించాలి"

దేవాదులతో పాత వరంగల్ జిల్లా మొత్తానికి నీరందాలి. ఇందుకు ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారు చేయండి. సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలి.

02



టీమిండియా కొత్త చరిత్ర

ఆసీస్ గడ్డపై తొలి టెస్ట్ సిరీస్ విజయం

వర్షంతో డ్రా అయిన నాలుగో టెస్ట్

2–1తో సిరీస్ నెగ్గిన కోహ్లీసేన

టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్ నెగ్గింది. 71 ఏళ్ల కలను నిజం చేసి అదరహో అనిపించింది. ఆసీస్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి అదిరిపోయే ఆటతీరుతో అలరిస్తున్న కోహ్లీ సేన, నాలుగు టెస్టుల బోర్డర్-గావస్కర్ సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. మూడో మ్యాచ్‌లో గెలుపుతోనే ట్రోఫీని ఖాయం చేసుకున్న ఇండియా.. వర్షం కారణంగా చివరి టెస్ట్ సోమవారం డ్రాగా ముగియడంతో మరో విజయాన్ని త్రుటిలో కోల్పోయింది. సిరీస్‌లో మూడు సెంచరీలతో ఏకంగా 521 పరుగులు చేసిన చటేశ్వర్ పుజారా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు అందుకున్నాడు. ఈ విజయంతో ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్‌గా కూడా కోహ్లీ రికార్డు సృష్టించాడు. ఓవరాల్‌గా ఆసీస్‌లో టెస్ట్ సిరీస్ నెగ్గిన ఐదో టీమ్‌గా ఇండియా నిలిచింది.

11



సోమవారం ప్రగతి భవన్‌లో పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నిధులున్నయ్.. నీళ్లు పారాలె

ఈ టర్మ్‌లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలె: సీఎం కేసీఆర్

- కోటి ఎకరాలకు నీరందించాలె
- ప్రాజెక్టు నీళ్లతో ముందు చెరువులు నింపాలె
- సాగునీటి ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ సమీక్ష

హైదరాబాద్, వెలుగు:

''సాగునీటి ప్రాజెక్టుల పనులు ఈ టర్మ్‌లోనే నూటికి నూరు శాతం పూర్తి కావాలె. కోటి ఎకరాల్లో నీరు పారాలె. ఐదేళ్ల సమయముంది. రాజకీయ సుస్థిరత ఉంది. నిధులకు కొరతలేదు. రైతులకు నీళ్లివ్వడమే ధ్యేయంగా పనిచేయాలె'' అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్ర వాటాను సంపూర్ణంగా వినియోగించుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి నీళ్లిస్తారన్న నమ్మకంతో ప్రజలు అవకాశం ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవలే పలు ప్రాజెక్టు పనులను పరిశీలించి వచ్చిన సీఎం సోమవారం ప్రగతిభవన్‌లో సాగునీటి ప్రాజెక్టులపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇందులో ఉన్నతాధికారులు, రిటైర్డు ఇంజనీర్లు, ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల పురోగతిని రిటైర్డు ఇంజనీర్ల బృందం సీఎంకు వివరించింది. పనుల్లో నిర్లక్ష్యం వహించే వర్క్ ఏజెన్సీలను మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాళేశ్వరం మాదిరిగానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టుల కోసం బడ్జెట్ నిధులతోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. వాటి నిర్వహణ నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తామన్నారు. రైతులకు, పరిశ్రమలకు, మంచినీటికి ఎంత నీరు అవసరమో లెక్కకట్టి, ప్రాజెక్టులవారీగా వాటాలు ఖరారు చేయాలన్నారు. ప్రాజెక్టుల నీటితో మొదట చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

మోడీ పైసలియ్యలె

''తెలంగాణలో ఒక ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని ప్రధాని మోడీకి అనేకసార్లు చెప్పా. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 20, 30 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా మోడీ డబ్బులివ్వలేదు'' అని సీఎం అన్నారు. ''మిషన్ కాకతీయను దేశమంతా మెచ్చుకున్నది. వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ వరంగల్ జిల్లా నెక్కొండలో చెరువులో పుట్టిన రోజు చేసుకుని మిషన్ కాకతీయ పనులను మెచ్చుకున్నారు. నీతి ఆయోగ్ కూడా ఇది గొప్ప పథకమని చెప్పింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు రూ.24 వేల కోట్లివ్వాలని కేంద్రానికి సిఫారసు చేసింది. కానీ మోడీ ప్రభుత్వం 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఈ సారి కేంద్రంలో మనదే క్రియాశీల పాత్ర. కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుంది'' అని చెప్పారు.

వానాకాలంలో కాళేశ్వరం నీళ్లందాలె

''ఈ ఏడాది ఎండాకాలంలోనే పనులన్నీ పూర్తి చేసి.. వానాకాలం నాటికి కాళేశ్వరం నీళ్లను రైతులకు అందించాలి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపుహౌజుల నిర్మాణం పూర్తి కావాలి. ఎల్లంపల్లి, మిడ్ మానేరు దాకా నీళ్లు రావాలి. మేడిగడ్డ నుంచి ప్రతీరోజూ 2 టీఎంసీల చొప్పున నీరు తీసుకోవాలి. మూడు బ్యారేజీల ద్వారా 36 టీఎంసీల నీళ్లు, ఎల్లంపల్లిలో 20 టీఎంసీల నీళ్లు నదిలోనే అందుబాటులో ఉంటాయి. వచ్చిన నీటిని వచ్చినట్లు పంప్ చేసి చెరువులకు మళ్లించాలి. ఎల్లంపల్లి దాకా వచ్చిన నీటిలో ఒక టీఎంసీని మిడ్ మానేరు ద్వారా శ్రీరాంసాగర్ కాల్వలకు పంపాలి. మరో టీఎంసీని మల్లన్న సాగర్ వైపు మళ్లించాలి. అక్కడ్నుంచి ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్మించే బస్వాపురం, గంధమల్ల రిజర్వాయర్‌కు తరలించాలి'' అని సూచించారు. ''మల్లన్న సాగర్ ద్వారానే హైదరాబాద్‌కు మంచినీళ్ల కోసం నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు 10 టీఎంసీల నీళ్లు పంపాలి. హల్దివాగు ద్వారా నిజాంసాగర్, ఘనపురం ఆయకట్టుకు సాగునీరు అందించాలి. గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులు నింపాలి. క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ మూసీ మురికిని వదిలించాలి'' అని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అహ్మదాబాద్‌లో సబర్మతిలాగా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు.

దేవాదులను మళ్లీ సమీక్షించాలె

గోదావరి నదిపై నిర్మించిన దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ''ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత తుపాకుల గూడెం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని ఉపయోగించుకోవడానికి బ్యారేజీ కడుతున్నాం. ఏడాదికి 75 టీఎంసీలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా నీరందాలి. పాకాల, రామప్ప, గణపురం, లక్నవరం చెరువులను నింపాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలి. దీనికోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలి'' అని ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలన్నారు. మే నెలలో కూడా దుమ్ముగూడెం వద్ద ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీరివ్వాలన్నారు. బయ్యారం వరకు నీటిని తేవాలన్నారు.

పాలమూరు వేగం పెరగాలె

''పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వేగం పెరగాలి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చింది. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలి. శ్రీశైలం నుంచి 70 టీఎంసీల వరకు తీసుకునే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసే పాలమూరును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. దాంతో కొంత జాప్యం జరిగింది. కాళేశ్వరం అంత వేగంగా పాలమూరు కూడా నిర్మాణం సాగాలి. ఈ బడ్జెట్‌లోనే ఇందుకు నిధులను కేటాయిస్తాం'' అని సీఎం చెప్పారు.

ఎన్నికల సంఘం భేష్

- తొలి కేబినెట్ భేటీలో ఈసీకి ప్రశంసలు
- నామినేటెడ్ ఎమ్మెల్యేగా స్టీఫెన్‌సన్

ప్రశాంత వాతావరణంలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారని కేంద్ర ఎన్నికల సంఘాన్ని రాష్ట్ర కేబినెట్ అభినందించింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్‌ను, ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశంసించింది. సోమవారం ప్రగతి భవన్‌లో కేబినెట్ భేటీ జరిగింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఆంగ్లో ఇండియన్ స్టీఫెన్‌సన్‌కే మరోసారి అవకాశమిస్తూ భేటీలో నిర్ణయించారు. రాజ్యాంగం, అసెంబ్లీ నిబంధనల ప్రతులను శాసనసభ్యులకు అందజేయాలని తీర్మానం చేశారు. అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు సంబంధిత ప్రతులను ప్రగతిభవన్‌కు తీసుకురాగా.. సీఎం కేసీఆర్ పరిశీలించారు. కేబినెట్ కార్యదర్శుల నియామక ప్రక్రియపైనా చర్చించినట్టు సమాచారం. కాగా స్టీఫెన్‌సన్ నియామకానికి సంబంధించి వెంటనే గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఆయన ఆమోద ముద్ర వేయడంతో.. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో 17న స్టీఫెన్‌సన్ కూడా ప్రమాణ స్వీకారం చేస్తారు.

కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం

రాష్ట్రంలో కలప అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అటవీ, పోలీసు అధికారులు సంయుక్త కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. స్మగ్లర్లు ఎంతటి వారైనా వెనక్కి తగ్గొద్దని సూచించారు. తరచూ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ పెట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై కేసీఆర్ సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఓ వైపు అడవులు నశించిపోతుంటే.. హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్ని చెట్లు పెంచినా ప్రయోజనం ఉండదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మొక్కల పెంపకం, అడవుల పునరుద్ధరణ, హైదరాబాద్ నగరం లోపలా, బయటా పచ్చదనం పెంచడం, కలప స్మగ్లింగ్ అరికట్టడం అనే నాలుగు విభాగాలుగా కార్యాచరణ రూపొందించుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కువగా కలప స్మగ్లింగ్ జరిగేచోట నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలన్నారు. స్మగ్లింగ్‌కు సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, టీఆర్ఎస్ నాయకులెవరికైనా ఈ వ్యవహారంలో సంబంధముంటే ముందు వారిపైనే చర్యలు చేపట్టాలని చెప్పారు. హరితహారం కింద నాటే మొక్కల సంఖ్యను ఈ ఏడాది వంద కోట్లకు పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలోని లక్షా 50 వేల ఎకరాల అటవీ బ్లాకుల్లో ఎక్కడా చెట్లు లేవని, ఆ భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలు పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

నేడు, రేపు సార్వత్రిక సమ్మె

- దేశవ్యాప్తంగా కొనసాగనున్న స్ట్రైక్
- పాల్గొంటున్న కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు
- టీచర్లు, ఆర్టీసీ సంఘాలు, ఆటోవాలాల మద్దతు
- కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని డిమాండ్
- నేడు ఇందిరాపార్క్ వద్ద కార్మిక సంఘాల ధర్నా

హైదరాబాద్, న్యూఢిల్లీ, వెలుగు:

'సమ్మె'ట పడింది. మంగళ, బుధవారాల్లో సార్వత్రిక సమ్మె జరగనుంది. దీంతో రెండు రోజులు దేశం స్తంభించనుంది. దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు, టీచర్లు, బ్యాంకు, ఎల్ఐసీ, ఆర్బీఐ ఉద్యోగులు, ఆర్టీసీ, ఆటో కార్మికులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందంటూ కార్మిక, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ధరలు తగ్గించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఇందిరాపార్క్ వద్ద ధర్నా

అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మంగళవారం ఉదయం11.30 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు తెలిపారు. బీజేపీ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ తప్ప అన్నీ సంఘాలు సమ్మెలో పాల్గొంటాయని చెప్పారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన చేపడుతామని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీసీ) ప్రకటించింది. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.భుజంగరావు, సదానందంగౌడ్ కూడా సమ్మెకు మద్దతు తెలిపారు. కేంద్ర వైఖరికి వ్యతిరేకంగా, ఆర్టీసీని కాపాడుకునేందుకు సమ్మెలో పాల్గొంటున్నామని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు. టీఆర్ఎస్ అనుబంధ ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ మద్దతు తెలిపింది. 8, 9 తేదీల్లో ఎర్ర రిబ్బన్ ధరించి నిరసన తెలపాలని కార్మికులకు టీఎంయూ కార్యనిర్వాహక అధ్యక్షుడు థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కార్మికుల ఐక్యత చూపుతాం

ప్రధాని నరేంద్ర మోడీకి కార్మికుల ఐక్యత అంటే ఏంటో చూపిస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌కుమార్ సేన్ చెప్పారు. కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఇంటికి సాగనంపాలన్నారు. సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొంటున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో భారీ ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

బ్యాంకు ఉద్యోగులు కూడా..

బ్యాంకు ఉద్యోగ సంఘాలు కూడా రెండు రోజులు సమ్మెలో పాల్గొంటున్నాయి. మొత్తం 12 డిమాండ్లతో 10 ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆలిండియా బ్యాంక్ఎంప్లాయిస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్‌ఫెడరేషన్‌ఆఫ్‌ఇండియా మద్దతు ప్రకటించాయి. దీంతో మంగళ, బుధవారాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ప్రభావం ప్రైవేటు బ్యాంకుల సేవలపైనా పడే అవకాశం ఉంది. సమ్మె కారణంగా కొన్ని బ్యాంకులు పనిచేయకపోవచ్చని, ఫైలింగ్‌లో ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఐడీబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా సహా అన్నీ ప్రభుత్వ రంగ బ్యాంకులు స్టాక్ ఎక్స్‌చేంజ్‌కు సమాచారం అందించాయి. ఘజియాబాద్‌లోని ఇన్‌కంట్యాక్స్‌ఎంప్లాయిస్‌ఫెడరేషన్‌కూడా సమ్మెలో పాల్గొననుంది.

ఎంపీలో ప్రతిపక్ష నేతగా గోపాల్ భార్గవ

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా బీజేపీ నేత గోపాల్ భార్గవ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన బీజేపీఎల్పీ సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ కు ప్రతిపక్ష నాయకుడి హోదా దక్కకపోవడం ఆశ్చర్యపరచింది. బీజేపీ ఎల్పీ సమావేశానికి కేంద్ర పరిశీలకుడిగా రాజ్ నాథ్ సింగ్ హాజరయ్యారు. ప్రతిపక్ష నేత పదవికి సీనియర్ లీడర్ గోపాల్ భార్గవ, శివరాజ్ సింగ్ చౌహాన్, మాజీ మంత్రి నరోత్తమ్ మిశ్రా, సీనియర్ నేత రాజేంద్ర శుక్లా పోటీ పడ్డారు. పలువురు బీజేపీ నేతలు, శివరాజ్‌కు మద్దతు ఇవ్వగా సంఘ్ పరివార్ లీడర్లు మాత్రం నరోత్తమ్ మిశ్రా లేదా గోపాల్ భార్గవకు ఛాన్స్ ఇవ్వాలన్నారు. దీంతో శివరాజ్‌సింగ్ వెనక్కి తగ్గారు.

ఎవరీ గోపాల్ భార్గవ ?

గోపాల్ భార్గవ సీనియర్ ఎమ్మెల్యే. తాజాగా జరిగిన ఎన్నికల్లో సాగర్ జిల్లా రెహ్లీ సెగ్మెంట్ నుంచి ఎనిమిదోసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2003లో తొలిసారి మంత్రి అయ్యారు. గ్రామీణాభివృద్ధి మంత్రిగా పని చేశారు. ఆరెస్సెస్ ఆశీస్సులు ఉన్న నేతగా బీజేపీలో ఆయనకు పేరుంది.

మళ్లీ 'ఆపరేషన్ స్మైల్'

హైదరాబాద్, వెలుగు: వీధి బాలలు, బాలకార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చే కార్యక్రమం 'ఆపరేషన్ స్మైల్'ను పోలీస్ శాఖ మళ్లీ ప్రారంభించింది. సోమవారం డీజీపీ కార్యాలయంలో ఐదో దశ ఆపరేషన్ స్మైల్‌ను అడిషనల్ డీజీ సీఐడీ గోవింద్ సింగ్ ప్రారంభించారు. అనంతరం ఇందులో పాల్గొంటున్న 170 మందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐజీ స్వాతి లక్రా, డీసీపీ సుమతి, శిశు, మహిళ, ఆరోగ్య, కార్మిక శాఖల జేడీలు, యూనిసెఫ్ డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఏటా జనవరి, జూలై నెలల్లో రాష్ట్ర పోలీసు, శిశు, మహిళా సంక్షేమ శాఖలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు దీన్ని చేపడుతున్నాయి. ఇప్పటివరకు 22 వేల మంది వీధి బాలలు, బాల కార్మికులను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

సైబరాబాద్‌లో తొలి డ్రైవ్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని హైదర్‌నగర్, మియాపూర్ ప్రాంతాల్లో సోమవారం సోదాలు నిర్వహించిన పోలీసులు 8 మంది బాలికలు, 10 మంది బాలురను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. బాలికలను నింబోలిఅడ్డ హోమ్‌కు, బాలురను సైదాబాద్ హోంకు తరలించారు. ఈ క్రమంలోనే అనాథలు, పేద కుటుంబాల పిల్లలతో ఓ ముఠా అసాంఘిక కార్యకలాపాలు చేయిస్తున్నట్టు గుర్తించారు.

ప్రభుత్వోద్యోగులకు పండుగ లేదు

- భోగి, సంక్రాంతి, కనుమ, రిపబ్లిక్ డేల్లో పని చేయాల్సిందే
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాలు

హైదరాబాద్, వెలుగు:

పంచాయతీ ఎన్నికల కారణంగా సర్కారీ ఉద్యోగులకు పెద్ద పండుగ సెలవులు ఎగిరిపోయాయ్. ఎన్నికల విధుల్లో ఉండే ప్రభుత్వ యంత్రాంగానికి భోగి, సంక్రాంతి, కనుమ, రిపబ్లిక్ డే సందర్భంగా సెలవులు ఉండవని రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఎన్నికల బాధ్యతలు నిర్వహించే ఆఫీసర్లందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీఓసీ) ప్రకారం జనవరి చివరి వరకూ ఆన్ డ్యూటీలో ఉండాల్సిందేనని ఈసీ వి.నాగిరెడ్డి చెప్పారు. సోమవారం తొలి విడత పోలింగ్ మొదలైంది. ఈ నెల 21న ముగుస్తుంది. రెండో విడత ఈ నెల 11న ప్రారంభమై 25తో, మూడో విడత 16న ప్రారంభమై 30తో ముగియనుంది. తొలి దశలో భాగంగా ఈ నెల 15, 16 తేదీల్లో ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు అప్పీళ్లను స్వీకరించి, వాటిని పరిష్కరిస్తారని అన్నారు. స్టేజ్ 1 రిటర్నింగ్ ఆఫీసర్స్ రెండో దశ, మూడో దశ నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ తదితర బాధ్యతలు నిర్వర్తిస్తారని వెల్లడించారు.

17న అసెంబ్లీ, 19 నుంచి మండలి సమావేశాలు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్ర అసెంబ్లీ, మండలి సమావేశాలపై సోమవారం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నోటిఫికేషన్లు జారీ చేశారు. తెలంగాణ రెండో శాసనసభ తొలి సమావేశాలు ఈనెల 17న ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతాయి. శాసనమండలి 11వ సమావేశాలు ఈనెల 19న ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానున్నాయి.



ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరిస్తున్న కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు, టీఈఈఏ అధ్యక్షుడు శివాజీ

ఫార్మసిస్టు ఫలితాలపై ఆందోళన వద్దు

వెయిటేజీ మార్కులతో రెండో మెరిట్‌లిస్ట్: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, వెలుగు: గ్రేడ్-2 ఫార్మసిస్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నెలకొన్న గందరగోళానికి టీఎస్‌పీఎస్సీతెరదించింది. అభ్యర్థుల అనుభవానికి సంబంధించిన వెయిటేజీ మార్కులు కలపకుండానే మెరిట్ లిస్ట్ ప్రకటించినట్లు ప్రకటించింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అనుభవ ధృవీకరణ పత్రాల ఆధారంగా వెయిటేజీ మార్కులు కలిపి ఈ నెల 3న మరోసారి మెరిట్ లిస్ట్‌విడుదల చేసినట్లు తెలిపింది. ప్రభుత్వ సర్వీసులో అనుభవం ఉన్నవారికే అదనపు మార్కులు కలిపినట్లు తెలిపింది. ఈ విషయంలో అభ్యర్థులు ఆందోళన చెందనక్కర్లేదని, సందేహాలేవైనా ఉంటే ఈ నెల 11లోగా తమ దృష్టికి తీసుకురావాలని టీఎస్‌పీఎస్సీ అధికారులు చెప్పారు.

విద్యుత్ రంగానికి పెను సవాళ్లు

- మున్ముందు దేశాలతో పోటీ పడాలి
- టీఈఈఏ ఆవిర్భావ సభలో కేటీఆర్

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో కరెంటు వెలుగులు నింపడంలో విద్యుత్ ఇంజనీర్ల పాత్ర కీలకమని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం హైదరాబాద్ మింట్‌కాంపౌండ్‌లోని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ఇంజనీర్స్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ''ఉమ్మడి ఏపీలో వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేవి. పరిశ్రమలు నడపలేక, కార్మికులకు జీతాలివ్వలేక యాజమన్యాలు ధర్నా చేసేవి. ఊళ్లలో కరెంటు లేక రైతులు సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేసి, అధికారులను గదుల్లో వేసి తాళం వేసిన ఫొటోలు పత్రికల్లో వచ్చేవి. విద్యుత్ ఉద్యోగుల సమర్థత, సీఎండీ కార్యదక్షత, సీఎం దార్శనికత వల్ల రాష్ట్రంలో ఇప్పుడు 24 గంటలూ కరెంటు ఉంటున్నదని గర్వంగా కాలర్ ఎగరేసుకునే పరిస్థితి ఉంది'' అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సాగుకు ఉచితంగా 24గంటల విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. ''విద్యుత్ రంగంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది. 13 శాతం తలసరి విద్యుత్ వాడకంతో దేశంలోనే టాప్‌లో ఉంది. సౌర విద్యుదుత్పత్తి 34 మెగావాట్ల నుంచి 3,600 మెగావాట్లకు పెరిగింది. కాళేశ్వరం తదితర సాగునీటి ప్రాజెక్టులతో 1,200 టీఎంసీల నీరు అందుబాటులోకి వచ్చి రాష్ట్రం కోటి ఎకరాల మాగాణం కాబోతోంది. అందుకనుగుణంగా విద్యుదుత్పత్తి పెరగనుంది. అయితే మున్ముందు విద్యుత్ రంగం పెనుసవాళ్లను ఎదుర్కోనుంది. వాటిని తట్టుకుని అధిగమించాలి. ప్రైవేటు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలతో పోటీ పడి పని చేయాలి'' అని విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు విద్యుత్ రంగంలో 50ఏళ్ల అనుభవముందని కేటీఆర్ ప్రశంసించారు. అది తన వయసు కంటే ఎక్కువని చమత్కరించారు. ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న ఘనత సీఎం కేసీఆర్‌ది అని ప్రభాకర్ రావు అన్నారు. ఆయనిచ్చిన బాధ్యతలు పూర్తిస్థాయిలో నెరవేర్చానన్నారు. కొత్తగూడెం పవర్ ప్లాంటును 41 నెలల్లో అందుబాటులోకి తేవడంలో ఉద్యోగుల పాత్ర అభినందనీయమన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ టీఈఈఏ సంఘం అధ్యక్షుడు శివాజీ తదితరులు పాల్గొన్నారు.



మోడీగా వివేక్ ఒబెరాయ్

సోమవారం ముంబైలో జరిగిన పీఎం నరేద్ర మోడీ బయోపిక్ పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, హీరో వివేక్ ఒబెరాయ్

ఈబీసీ కోటా నిలిచేదేనా?

రాజ్యాంగ సూత్రాలు అనుమతిస్తాయా? | పార్లమెంటులో సవరణ సాధ్యమేనా? | న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం | అమలుపైనా ముందే అనుమానాలు | రాష్ట్రాల్లో ఇలాంటివి కొట్టేసిన కోర్టులు | ఎన్నికల కోసమే హడావుడి నిర్ణయం | అధ్యయనం లేకుండానే ప్రతిపాదన

వెలుగు డెస్క్:

అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయం సంచలనం రేపింది. ఊహించనంత వేగంగా నిర్ణయం తీసుకోవడం, వెంటనే లోక్ సభలో రాజ్యాంగ సవరణ బిల్లు పెడతామని ప్రకటించడంతో దీనిపై అన్ని వర్గాల్లో చర్చ మొదలైంది. కోటాలు ఇవ్వడం, పెంచడం లాంటి వివాదాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. అసలు ఈ కోటా అమలు సాధ్యమేనా అన్న చర్చ మొదలైంది. రాజ్యాంగ నిబంధనలు అనుమతిస్తాయా అన్నదే కీలకంగా మారుతోంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చదువు, కొలువుల్లో కోటా ఇవ్వాలని రాజ్యాంగం చెబుతోంది. ఆర్థికంగా వెనుకబాటుతనం అనే అంశం లేదు. ఎస్సీ, ఎస్టీలకు కచ్చితంగా కోటా ఇవ్వాలని రాజ్యాంగం చెబితే, అందులోని సూత్రాల ఆధారంగా తర్వాత కాలంలో బీసీలకు కోటా కల్పించారు. ఇప్పుడు ఆర్థికంగా వెనుకబాటుతనం అనే అంశం ఆధారంగా అగ్రకులాలకు కోటా కల్పిస్తామని కేంద్రం చెబుతోంది. రాజ్యాంగంలో లేని ఈ అంశాన్ని సవరణ ద్వారా చేర్చి, కోటా కల్పించే ఆలోచనలో ఉంది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించాల్సి ఉంటుంది. లోక్ సభలో ప్రభుత్వానికి ఉన్న బలానికి, ఈ ప్రతిపాదనను సమర్థిస్తున్న కొన్ని విపక్షాలు తోడైతే బిల్లు పాసయ్యే అవకాశం ఉంది. అయితే రాజ్యసభలో విపక్షాల పట్టు ఉండడంతో బిల్లు నెగ్గడంపైనే సందేహాలున్నాయి. ఇప్పటికే లోక్ సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభలో పెండింగ్ లో ఉంది.

కోర్టుకు ఏం చెబుతారు?

కీలకమైన అంశం కావడంతో కచ్చితంగా న్యాయవివాదాలు తలెత్తే అవకాశం ఉంది. అదే జరిగితే కోర్టులో మూడు రకాల అడ్డంకులు ఉన్నాయంటున్నారు న్యాయనిపుణులు. మొదటిది అసలు ఏ ప్రాతిపదికన అగ్రకులాలకు కోటా కల్పించాలనుకుంటున్నారన్నది కేంద్రం వివరించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ అంశంపై అధ్యయనానికి కేంద్రం ఎలాంటి కమిటీగానీ, కమిషన్ గానీ వేయలేదు. 2017 అక్టోబర్లో ఓబీసీల్లో ఉపకులాల వర్గీకరణపై అధ్యయనానికి ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కమిషన్ వేసింది. అయితే అగ్రకులాల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, ఎవరికి కోటా కల్పించాలి లాంటి అంశాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసిన దాఖలాలు లేవు. రెండో అడ్డంకి.. ఆర్థికపరమైన వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం. రాజ్యాంగపరంగా ఇలాంటి అంశం ఇప్పటివరకు లేదు. పార్లమెంటు సవరణతో ఈ అంశాన్ని చేర్చినా ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రకారమే ఉందా లేదా అన్నది కోర్టు పరిశీలించే అవకాశం ఉంది. గతంలో పార్లమెంటు చేసిన రాజ్యాంగ సవరణలను కోర్టులు కొట్టేసిన సందర్భాలు ఉన్నాయి. కోటా కోసం ఆర్థిక వెనుకబాటుతనం అనే ప్రాతిపదిక రాజ్యాంగ విరుద్ధమని గతంలోనే గుజరాత్ హైకోర్టు తేల్చిచెప్పింది. ఇక కోటా బిల్లుకు ఉన్న మూడో అడ్డంకి, అన్ని రకాల కోటాలు కలిపి 50 శాతం దాటిపోవడం. ప్రస్తుతం బీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు కలిపి 49.5 శాతం ఉన్నాయి. గతంలో ఇందిరా సాహ్ని కేసులో అన్ని కోటాలు కలిపి 50 శాతం దాటొద్దని 8 మంది సభ్యుల సుప్రీంకోర్టు బెంచ్ తేల్చిచెప్పింది. ఇప్పుడు కేంద్రం నిర్ణయంతో కోటా 59.5 శాతానికి చేరుతుంది. దీంతో గతంలో తాను ఇచ్చిన తీర్పు ఆధారంగానే సుప్రీంకోర్టు కొత్త కోటాను పరిశీలించే అవకాశం ఉంది. లేదంటే ఈ కేసును పరిశీలించడానికి మరింత పెద్ద రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తుంది.

రాష్ట్రాలు అడిగితే ఇవ్వరా?

కేంద్రం నిర్ణయంపై రాష్ట్రాల స్థాయిలో వస్తున్న పెద్ద విమర్శ ఒకటుంది. ఇలాంటి నిర్ణయాలను రాష్ట్రాలు ప్రతిపాదిస్తే కేంద్రం ఆమోదించడం లేదు. నానా కొర్రీలు పెట్టి, ఆ వివరాలు కావాలి, ఈ వివరాలు కావాలంటూ పెండింగ్ లో పెడుతోంది. మన రాష్ట్రానికి సంబంధించి ఇప్పటికే కేంద్రం దగ్గర రెండు ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయి. వాటిలో గిరిజనుల కోటాను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచడం, పేద ముస్లింలకు 4 నుంచి 12 శాతానికి పెంచాలని ప్రతిపాదిస్తూ అసెంబ్లీ తీర్మానాలు ఉన్నాయి. గిరిజన కోటాపై చెల్లప్ప కమిటీ, ముస్లిం కోటాపై సుధీర్ కుమార్ కమిటీలతో అధ్యయనం చేయించి వాటి నివేదికల ఆధారంగా తీర్మానాలు చేశారు. రెండేళ్లవుతున్నా దీనిపై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు. మతప్రాతిపదికన రిజర్వేషన్లకు వ్యతిరేకమని కేంద్ర నేతలు చెబుతున్నా గిరిజన కోటా బిల్లును కూడా ఆమోదించలేదు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కాపులను బీసీల్లో చేర్చాలన్న డిమాండ్ పై జస్టిస్ మంజునాథ కమిషన్ వేసింది. కమిషన్ నివేదిక తర్వాత బీసీ కోటాకు అదనంగా కాపులకు 5 శాతం కోటా కల్పించాలని ఏడాది కింద ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఇది కూడా కేంద్రం దగ్గర పెండింగ్ లో ఉంది. రెండు నెలల కిందే మహారాష్ట్రలో మరాఠాలకు 16 శాతం కోటా కల్పిస్తూ అక్కడి అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ, ఏపీ ప్రతిపాదనలు పెండింగ్ లో ఉండగా మహారాష్ట్ర నిర్ణయంపై కేంద్రం ఏం చెబుతుందా అన్న సందేహాలు కూడా వచ్చాయి. దీనిపైనా కేంద్రం నిర్ణయం రాలేదు. రాష్ట్రాలు కోరుతున్నా పట్టించుకోని కేంద్రం ఇంత హడావుడిగా నిర్ణయం ప్రకటించడమే దీని అమలుపై వస్తున్న పెద్ద సందేహం.

ఎన్ని 'కుల' కోటా!

అగ్రకులాల పేదలకు కోటా సాధ్యమా కాదా అన్నది పక్కనబెడితే ఇది పక్కా రాజకీయ నిర్ణయం అంటున్నారు న్యాయనిపుణులు. సీరియస్ గా అమలు చేసే నిర్ణయాలు తీసుకోవడానికి చాలా అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అందుకు సమయం కావాలి. ఎన్నికల ప్రక్రియ మొదలు కావడానికి సరిగ్గా రెండు నెలలు కూడా లేని సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కోటాను అమలు చేసే ఆలోచన కంటే ఎన్నికల ప్రయోజనమే ఎక్కువగా కనిపిస్తోంది.



కోటాలు... కొట్టివేతలు

గుజరాత్ ఈబీసీ కోటా: 2016 మే 1న అగ్రకులాల పేదలకు 10 శాతం కోటా కల్పిస్తూ గుజరాత్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. ఆర్థిక కారణాల ప్రాతిపదికన కోటాను రాజ్యాంగం ఒప్పుకోదని చెబుతూ అదే ఏడాది ఆగస్టు 4న ఆర్డినెన్స్ ను హైకోర్టు కొట్టేసింది.

రాజస్థాన్ ఓబీసీ కోటా: 2017 అక్టోబర్ 26న అగ్రకులాల పేదలకు కోటా కల్పిస్తూ రాజస్థాన్ అసెంబ్లీ బిల్లును ఆమోదించింది. మొత్తం కోటా 50 శాతం దాటుతోందన్న కారణంతో బిల్లు పాసైన రెండువారాల్లోనే ఆ రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చింది.

హర్యానా జాట్ కోటా: హర్యానాలో 2014లో ప్రత్యేక బీసీ (ఎస్ బీసీ) కోటా కింద జాట్లు, మరో మూడు అగ్రకులాలకు 10 శాతం కోటా కల్పించారు. 2015లో దీన్ని పంజాబ్, హర్యానా హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వం అప్పీలు చేసినా సుప్రీంకోర్టు కూడా కొట్టేసింది.

రాజ్యాంగంలో ఏముంది?

ఆర్టికల్ 15 (4): (సమానత్వపు హక్కు) సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరులు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలవారి పురోగతి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి ఈ ఆర్టికల్ అడ్డంకి కాదు.

ఆర్టికల్ 15 (5): సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పౌరులు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలవారి పురోగతి కోసం ప్రైవేటు, ప్రభుత్వ ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ సహా విద్యాసంస్థల్లో (మైనారిటీ విద్యాసంస్థలు మినహాయించి) అడ్మిషన్లు పొందేలా చట్టం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి ఈ ఆర్టికల్ అడ్డంకి కాదు.

ఆర్టికల్ 16 (4): (ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) ఏదైనా వెనుకబడిన వర్గానికి చెందిన పౌరులకు ప్రభుత్వ సర్వీసుల్లో తగినంత ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం భావించినప్పుడు వారికి నియామకాల్లో లేదా పోస్టుల్లో రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడానికి ఈ ఆర్టికల్ అడ్డంకి కాదు.

ఆర్టికల్ 46: బలహీనవర్గాలకు చెందిన ప్రజలు, ప్రత్యేకించి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలవారి విద్యాపరమైన, ఆర్థికపరమైన ప్రయోజనాలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పరిరక్షించాలి. వారు సామాజిక అన్యాయం, అన్ని రకాల అణచివేతలకు గురి కాకుండా కాపాడాలి.

అడ్డంకులు

1. రాజ్యాంగం ప్రకారం కోటా కోసం ఆర్థికపరమైన వెనుకబాటుతనం అనే అంశం లేదు.
2. రాజ్యాంగ సవరణ చేయడానికి లోక్ సభలో మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం.
3. న్యాయవివాదం వస్తే ఏ అధ్యయనం ఆధారంగా, ఏ ప్రాతిపదికన కోటా ఇస్తున్నారో కేంద్రం చెప్పాల్సి వస్తుంది.
4. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉంటే కోర్టుల్లో నిలబడడం కష్టమే.
5. అన్ని కోటాలు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది.

ఈబీసీ రిజర్వేషన్లపై ఎవరేమన్నారంటే..?



మాకు ఓకే.. కానీ..

రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం. నాలుగేళ్ల 8 నెలల పాలనలో ఎప్పుడూ దీని గురించి ఆలోచించలేదా? త్వరలో లోక్ సభ ఎన్నికలు ఉన్నాయని ఈ నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ నాటకాలు ఆడుతోంది. ఇదో జిమ్మిక్కు.

- కాంగ్రెస్ నేతలు సుర్జేవాలా, అభిషేక్‌సింఘ్వీ

మద్దతిస్తాం

కేంద్రం నిర్ణయానికి మేం మద్దతు తెలుపుతున్నాం. రాజ్యాంగ సవరణ బిల్లును వెంటనే ప్రవేశపెట్టేందుకు పార్లమెంటు సమావేశాలను పొడిగించాలి. కాదని ఈ విషయంలో జాప్యం చేస్తే.. దాన్ని ఎన్నికల స్టంట్‌గానే భావించాల్సొస్తుంది.

- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



రాజ్యాంగం అనుమతివ్వదు

దళితులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడమే రిజర్వేషన్ల ముఖ్యోద్దేశం. ఆర్థికపరమైన అంశాల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయడాన్ని రాజ్యాంగం అనుమతించదు. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలంటే వివిధ పథకాలను అమలు చేయవచ్చు.

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

లోక్‌సభ ఎన్నికలున్నాయని..

కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. అయితే ఇది లోక్‌సభ ఎన్నికల కోసం తీసుకున్న నిర్ణయమే. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులు చేయకూడదు.

- కేరళ సీఎం పినరయి విజయన్

చరిత్రాత్మకం

ఇది చరిత్రాత్మక నిర్ణయం. సామాజిక న్యాయాన్ని విస్తరించే గొప్ప ముందడుగు.

- బీజేపీ ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధే



మాస్టర్ స్ట్రోక్

అగ్రవర్ణ పేదలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నేను ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా. 10 % ఇవ్వడం మంచి నిర్ణయం. కులాల మధ్య భేదాలకు ముగింపు పలుకుతుంది. ఇదో మాస్టర్ స్ట్రోక్.

- సామాజిక న్యాయ మంత్రి అథవాలే

అందరికీ సమానావకాశాలు

కేంద్రం నిర్ణయంతో విద్య, ఉద్యోగాల్లో అందరికీ సమాన అవకాశాలు కలుగుతాయి. ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుంది. సామాజిక న్యాయం కేవలం బీజేపీతోనే సాధ్యమనే దానికి ఇదే నిదర్శనం.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

చరిత్రలో నిలిచిపోతుంది

మోడీ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది. మేం 20 ఏళ్లుగా చేస్తున్న పోరాటం ఇప్పుడు ఫలించింది. బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలి.

- ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి

ప్రకటనకే పరిమితం కావద్దు

ప్రకటనలకే పరిమితం కాకుండా, రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలి. నాలుగేళ్లపాటు పట్టించుకోకుండా ఇప్పుడు నిర్ణయం ప్రకటించడం ఎన్నికల జిమ్మిక్కే.

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనివీరభద్రం

పెద్ద కులాలకు కోటా

మొదటిపేజీ తరువాయి

రిజర్వేషన్లు కల్పించాలని గత కొన్నేళ్లుగా పలు రాష్ట్రాల్లో డిమాండ్లు, ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. ఏపీలో కాపులు, ఉత్తరాదిలో జాట్లు, పటేళ్లు వంటి వర్గాలు రిజర్వేషన్ల కోసం రోడ్డెక్కాయి. హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టాలు చేసినా రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పును చూపుతూ కోర్టులు వాటిని కొట్టివేశాయి. ఎన్నో ఏళ్లుగా ఈ అంశం నలుగుతున్నా ఇప్పుడు కేంద్రం దీనిపై దృష్టి సారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇది ఎంతమేరకు ఆచరణ రూపం దాలుస్తుందన్నదానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ''ఈ బిల్లు ఆమోదం పొందగానే రాజ్యాంగ సవరణ ప్రక్రియ చేపడతాం. 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా.. అది రాజ్యాంగాన్ని సవరించే పార్లమెంట్ హక్కుకు ఏమాత్రం అడ్డంకి కాబోదు'' అని కేంద్ర మంత్రి ఒకరు చెప్పారు. దేశ చరిత్రలో తొలిసారిగా తమ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలను రాజ్యాంగబద్ధంగా గుర్తించేందుకు సిద్ధమైందన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు గట్టెక్కాలంటే రెండు సభల్లో మూడింట రెండొంతుల మంది సభ్యులు మద్దతు తెలపాలి. లోక్‌సభలో బిల్లు పాసైనా రాజ్యసభలో ప్రతిపక్షాల మద్దతు లేకుండా బిల్లు పాసవడం కష్టమని అంటున్నారు. ఒకవేళ కాంగ్రెస్ వ్యతిరేకిస్తే ఆ పార్టీకి అగ్రవర్ణాలు దూరమవుతారని, అదే వ్యూహంతో మోడీ వ్యూహాత్మకంగా 'ఈబీసీ' పాచిక విసిరారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

రేపటి వరకు రాజ్యసభ

రాజ్యసభ సమావేశాలను కేంద్ర ప్రభుత్వం బుధవారం(ఈ నెల 9 వరకు) వరకు పొడిగించింది. 10 శాతం కోటాపై రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో, బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనుంది. ఇందుకు వీలుగా రాజ్యసభను బుధవారం వరకు పొడిగించాలని చైర్మన్ ఎం.వెంకయ్యానాయుడును కోరగా ఆయన అందుకు సమ్మతించారు.



సోమవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీకి వినతి పత్రం ఇస్తున్న టీఆర్ఎస్ ఎంపీలు

పార్టీ ఆఫీసుకు స్థలమివ్వండి

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తి


హైదరాబాద్, వెలుగు:

టీఆర్ఎస్ ఎంపీలు సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఢిల్లీలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయింపు అంశంపై ఈ సందర్భంగా వారు ప్రధానితో చర్చించారు. రాజ్యసభ, లోక్‌సభలో కలిపి టీఆర్ఎస్ ఎంపీలు 17 మంది ఉన్నారని, చట్ట ప్రకారం, అర్బన్ డెవలప్‌మెంట్ గైడ్ లైన్స్ ప్రకారం టీఆర్ఎస్ పార్టీ ఆఫీసు ఏర్పాటుకు వెయ్యి చదరపు గజాల స్థలం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజేంద్రప్రసాద్ రోడ్‌లో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్టీ ఆఫీసుకు కేటాయించాలని కోరారు. ప్రధాని మోడీని కలిసిన వారిలో లోక్‌సభలో టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ జితేందర్‌రెడ్డి, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ప్రొఫెసర్ సీతారాంనాయక్, జి.నగేశ్, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్, ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వేణుగోపాలచారి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరలకు నిధులు విడుదల

జీవో జారీచేసిన బీసీ సంక్షేమ శాఖ

హైదరాబాద్, వెలుగు: బతుకమ్మ చీరల తయారీకి సంబంధించిన రూ.120 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు సోమవారం బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం జీవో జారీ చేశారు. చేనేత సహాయ పద్దు కింద విడుదలైన ఈ నిధులను నేత కార్మికుల వేతనాలు చెల్లించేందుకు ఉపయోగించనున్నారు.



సమాధానం చెప్పకుండా విమర్శలా?: కర్నె ప్రభాకర్

హైదరాబాద్ , వెలుగు: కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిస్తే, దానికి సమాధానం చెప్పకుండా బీజేపీ ఎంపీ దత్తాత్రేయ అర్థంలేని విమర్శలు చేస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఫైర్ అయ్యారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని, విభజన చట్టం ప్రకారం నిధులు, ప్రాజెక్టులు రాకున్నా ఇక్కడి బీజేపీ నేతలు ప్రశ్నించడంలేదని విమర్శించారు. బీజేపీ అంటే భారతీయ జూటా పార్టీ అని వారి కార్యాలయం మీద బోర్డు మార్చుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్, ఎంపీల కృషి వల్లే రాష్ట్రానికి ఎయిమ్స్ వచ్చిందన్నారు. బీజేపీకి ఇప్పటికే తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పారని, లోక్ సభ ఎన్నికల్లోనూ డిపాజిట్లు రావన్నారు. ప్రొటెం స్పీకర్ విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యాశాఖలో అడహక్ పదోన్నతులు

పీఆర్‌టీయూటీ నేతల డిమాండ్

హైదరాబాద్, వెలుగు: పాఠశాల విద్యాశాఖలో ఖాళీగా ఉన్న వేలాది పోస్టులను అడహక్ పద్ధతిలో భర్తీ చేయాలని పీఆర్‌టీయూటీ డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్ మిశ్రాను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అంజిరెడ్డి, చెన్నయ్య కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వీస్‌రూల్స్ పేరుతో పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పాఠశాల విద్యలో ప్రమాణాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కో హెచ్ఎంకు నాలుగైదు మండలాల ఇన్‌చార్జి ఎంఈఓ బాధ్యతలు అప్పగిస్తున్నారని చెప్పారు. వెంటనే అన్ని టీచర్స్ యూనియన్లు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించి, పరిష్కారం కనుక్కోవాలని వారు కోరారు.



పరేడ్ గ్రౌండ్స్‌లో పతంగుల పండుగ

ఈ నెల 13 నుంచి ప్రారంభం

హైద రాబాద్, వెలుగు: భారీ పతంగులతో ప్రేక్షకులను కనువిందు చేసేందుకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబవుతోంది. సంక్రాంతి సెలవులను సందడిగా గడిపేందుకు వీలుగా కైట్ ఫెస్టివల్‌కు ఆతిథ్యమివ్వనుంది. దేశ, విదేశాలకు చెందిన టూరిస్టులను ఆకట్టుకునేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నాలుగో ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ (టీఐకేఎఫ్) నిర్వహించనున్నట్లు ఆ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించే ఈఫెస్టివల్‌లో మన దేశానికి చెందిన 60 మంది, విదేశాలకు చెందిన 42 మంది కైట్ ఫ్లయర్స్ పాల్గొంటారని చెప్పారు. తొలిసారిగా 2016లో నిర్వహించిన కైట్ ఫెస్ట్‌కు సుమారు 7.5 లక్షల మంది హాజరయ్యారని అన్నారు. ఈసారి దాదాపు 9 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. స్టాళ్లలో హ్యాండీక్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్స్‌తోపాటు తెలంగాణ వంటకాలను ప్రదర్శిస్తామని వెంకటేశం వివరించారు.

స్వీట్ల పండుగ కూడా..

కైట్ ఫెస్టివల్‌తో పాటు జరిగే ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ సందర్శకులను ఆకర్షించనుంది. వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన వెయ్యి రకాల స్వీట్లు నోరూరించనున్నాయి. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన గృహిణులు ఈ స్వీట్లు తయారు చేసి ప్రదర్శిస్తారని అధికారులు తెలిపారు.

కొత్త పంచాయతీలను ఏకగ్రీవం చేయండి

- టీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- రాష్ట్రంలో ఈసారి 26 శాతం సర్పంచులు గిరిజనులే
- తండాలను పంచాయతీలుగా మార్చడంతో ప్రయోజనం

హైదరాబాద్, వెలుగు:

రాష్ట్రంలో 3,400 తండాలను సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, దాంతో మొత్తం పంచాయతీల్లో 26 శాతం సర్పంచులు గిరిజనులే ఉండనున్నారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. సోమవారం నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన గిరిజన నేత భగవాన్ నాయక్ టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. సాధ్యమైనంత వరకు ఎక్కువ పంచాయతీలు ఏకగ్రీవమయ్యేలా చూడాలని, ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షల ప్రోత్సాహక నిధులు పొంది గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వచ్చే ఆరు నెలలు వరుసగా ఎన్నికలు ఉన్నాయని, ఏ ఎన్నికలు జరిగినా గులాబీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టిసారించాలని సూచించారు.

జానారెడ్డికి బుద్ధి చెప్పారు..

నాగార్జునసాగర్ అసెంబ్లీ సీట్లో టీఆర్ఎస్ గెలుపు సాధారణమైనది కాదని, ఎంతో రాజకీయ అనుభవమున్న జానారెడ్డి ఓడించిన ఘనత ప్రజలకే దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. పక్కనే కృష్ణానది ఉన్నా నాగార్జునసాగర్ ప్రాంతానికి గత ప్రభుత్వాలు సాగునీరివ్వలేదని ఆరోపించారు. ఫ్లోరోసిస్‌తో నల్లగొండ జిల్లాలో 2 లక్షల మంది చనిపోయారన్నారు. ఉమ్మడి రాష్ట్ర సీఎం చిత్తూరు జిల్లాకు రూ.9 వేల కోట్లు ఇస్తుంటే అప్పుడు కేబినెట్ లో ఉన్న జానారెడ్డి, ఉత్తమ్ నవ్వుతూ సంతకాలు పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఫ్లోరోసిస్‌కు శాశ్వత పరిష్కారమిచ్చే దిశగా కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇంటింటికి సురక్షిత మంచినీరు ఇచ్చేందుకు మిషన్ భగీరథను చేపట్టామని, వచ్చే నెల రోజుల్లో దానిని పూర్తి చేస్తామని ప్రకటించారు. త్వరలో హాలియా, నందికొండ మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేస్తామన్నారు.

డిగ్రీ కాలేజీ ఇవ్వండి

నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కేటీఆర్‌కు వివరించారు. ఈ డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరో 20, 25 ఏళ్లు టీఆర్ఎస్ పార్టీయే గెలిచేలా సెగ్మెంట్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

శాసించే స్థాయికి రావాలి

రైతుబంధు, రైతు బీమా పథకాలను మూడు రాష్ట్రాలు కాపీ కొట్టి అమలు చేస్తున్నాయని.. త్వరలో కేంద్రం కూడా అమలు చేయనుందని కేటీఆర్ చెప్పారు. ఈసారి కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఎవరికీ పూర్తి మెజారిటీ రాదన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ 16 ఎంపీ సీట్లు గెలుచుకుంటే.. ఢిల్లీ గద్దె మీద ఎవరు ఉంటారో డిసైడ్ చేయవచ్చన్నారు. యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి రావాలని జయశంకర్ సార్ అనే వారని గుర్తు చేశారు.



సోమవారం తెలంగాణ భవన్‌లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కేటీఆర్‌తో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ముచ్చట్లు

రామగుండంలో మెడికల్ కాలేజీ

ఆ నియోజకవర్గ బాధ్యతలు నేను తీసుకుంటా: కేటీఆర్

- నేతలంతా విభేదాలు వదిలి కలిసి పనిచేయాలని సూచన
- కష్టపడి పార్టీని ముందుకు తీసుకెళదాం: ప్రభుత్వ సలహాదారు వివేక్
- టీఆర్ఎస్‌లో చేరిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

హైదరాబాద్, వెలుగు:

రామగుండంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్న సీఎం కేసీఆర్ హామీని త్వరలోనే అమలు చేస్తామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. చాలా మంది కేసీఆర్ శిష్యులు కొన్ని కారణాల వల్ల పార్టీకి దూరమయ్యారని, ఇప్పుడంతా తిరిగి వస్తున్నారన్నారు. సోమవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చందర్‌తోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం కేటీఆర్ మాట్లాడారు. రామగుండం నియోజకవర్గాన్ని తాను వ్యక్తిగతంగా దత్తతకు తీసుకుంటానని చెప్పారు. పార్టీ రామగుండం నేత సోమారపు సత్యనారాయణ కేసీఆర్‌కు సన్నిహితుడని, ఈ ఇద్దరూ పాత విభేదాలు పక్కన పెట్టి కలిసి పని చేయాలని సూచించారు. ఇటీవల చందర్ సతీమణి మరణించారని, ఆ రోజున తాను రామగుండం ఎన్నికల ప్రచారానికి వచ్చానని.. మరణం విషయం తెలిసి చాలా బాధపడ్డానని పేర్కొన్నారు. సోమారపు సలహాలు తీసుకోవాలని చందర్‌కు సూచించారు. రామగుండంలో చందర్‌కు, సోమారపు సత్యనారాయణకు లక్ష ఓట్లు వచ్చాయని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా అక్కడ భారీ మెజారిటీ రావాలని చెప్పారు.

కష్టపడి పనిచేద్దాం: వివేక్

టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారని, మనందరం కూడా కష్టపడి పనిచేసి పార్టీని ముందుకు తీసుకెళదామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం కోసం అందరం కలిసి ఉద్యమం చేశామని, ఇటీవల సింగరేణి ఎన్నికల్లో కూడా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం విజయం కోసం ఎంతో కష్టపడ్డామని గుర్తు చేశారు. చందర్ రామగుండం ప్రజల విశ్వాసం పొంది మంచి మెజారిటీతో గెలుపొందారన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, రాజకీయ జన్మనిచ్చింది టీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఏ ఎన్నిక జరిగినా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గులాబీ జెండా రెపరెపలాడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామ గ్రామానికి తీసుకెళతామన్నారు. పార్టీలో తిరిగి చేర్చుకున్నందుకు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర వహించే దిశలో కేసీఆర్ ముందుకు వెళుతున్నారని, పార్టీ బలోపేతం కోసం కేటీఆర్‌కు బాధ్యతలు అప్పగించారని మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పేర్కొన్నారు. చందర్‌కు తనవైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు.

సొంతూళ్లకు అయ్యప్ప భక్తుల మృతదేహాలు

పుదుక్కోట్టై ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి



సోమవారం తమిళనాడులోని పుదుక్కోట్టై నుంచి మృతదేహాలతో రాష్ట్రానికి బయలుదేరిన అంబులెన్స్‌లు

మెదక్, వెలుగు: శబరిమలకు వెళ్లి తిరిగొస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన 10 మంది భక్తుల మృతదేహాలు మంగళవారం వారి స్వగ్రామాలకు చేరుకోనున్నాయి. తమిళనాడులోని పుదుక్కోట్టై వద్ద ఆదివారం టెంపో ట్రావెలర్‌ను కంటైనర్ ఢీకొన్న ఘటనలో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజీపేటకు చెందిన కుమార్(22), నాగరాజు(35), మహేష్(24), మంతూరుకు చెందిన శివ సాయి ప్రసాద్(21), శ్యామ్ సుందర్ గౌడ్(23), రెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు(42), అంబడిపేట కృష్ణ(35), చిన్న చింతకుంటకు చెందిన ప్రవీణ్ గౌడ్(24), సురేష్(24), హైదరాబాద్ పేట్ బషీరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ రాజేష్‌గౌడ్(26) చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ప్రమాదంలో చనిపోయిన 10 మంది మృతదేహాలకు సోమవారం పుదుక్కోట్టై హాస్పిటల్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. సాయంత్రం అంబులెన్స్‌లు బయల్దేరాయి. మంగళవారం ఉదయం బాధితుల గ్రామాలకు చేరుకుంటాయని ఆర్ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రెసిడెంట్ మురళీ యాదవ్ తెలిపారు. తమిళనాడు ఆఫీసర్లతో మాట్లాడిన ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఒక్కో మృతదేహాన్ని, ఒక్కో అంబులెన్స్‌లో తరలించేలా ఏర్పాటు చేశారని వెల్లడించారు. ప్రమాదం సంగతి తెలిసిన వెంటనే ఆయన నర్సాపూర్ సీఐ, ఎమ్మార్వోతో కలిసి తాను ఘటనాస్థలికి చేరుకున్నట్టు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన ఐదుగురి పరిస్థితి మెరుగ్గా ఉందని చెప్పారు. నరేశ్ స్వగ్రామానికి తిరుగు ప్రయాణం కాగా, ముగ్గురు పుదుక్కోట్టై మెడికల్ కాలేజీలో, తంజావూరు మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

ఉత్తమ్, కుంతియా హఠావో, కాంగ్రెస్ బచావో

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

హైదరాబాద్, వెలుగు: 'ఉత్తమ్, కుంతియా హఠావో, కాంగ్రెస్ బచావో' అంటూ పిలుపునిచ్చారు కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం పీసీసీ చీఫ్ ఉత్తమ్, కుంతియాకు లేదన్నారు. సోమవారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోతే నైతిక బాధ్యతగా రాజీనామా చేయడం కాంగ్రెస్‌లో ఆనవాయితీ అని, ఉత్తమ్, కుంతియాలు ఇంకా పదవులు పట్టుకుని వేలాడుతున్నారన్నారు. 'గాంధీ కుటుంబానికి లాయలిస్టును, నన్నే సస్పెండ్ చేస్తారా' అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను, భట్టిని ఓడించేందుకు ఉత్తమ్ కుట్రపన్నారని ఆరోపించారు. కేసీఆర్ ఒక్కరే వంద సభల్లో పాల్గొని పార్టీని గెలిపించారని, వీళ్లు మాత్రం రిసార్ట్స్, హోటల్స్‌కే పరిమితమయ్యారన్నారు. పార్టీ పదవులు, అసెంబ్లీ సీట్లు అమ్ముకున్నారని మండిపడ్డారు. ఉత్తమ్‌పై సీబీసీఐడీ కేసు ఉందని, 165 కోట్ల హౌసింగ్ కేసులో జైలుకు వెళ్లకుండా కేసీఆర్‌కు సరెండరయ్యారని ఆరోపించారు. కార్యకర్తల డబ్బుతో కుంతియా బంగళాలు కట్టారన్నారు.

నాణ్యత లేకపోతే మూసివేతే!

ప్రమాణాలు పాటించని కాలేజీలకు నో పర్మిషన్



- ఐదేండ్లలో 835 ప్రైవేటు కళాశాలలు మూత
- వాటిలో 149 ఇంజినీరింగ్, 228 డిగ్రీ ,176 ఎంటెక్ కళాశాలలు

హైదరాబాద్, వెలుగు: ఉన్నత విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రమాణాలు పాటించని ప్రైవేటు కాలేజీలపై కొరడా ఝులిపిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్తగా ఒక్క ప్రైవేటు కాలేజీకి అనుమతి ఇవ్వకపోగా, ఉన్న కాలేజీల్లో నిబంధనలు పాటించని వాటి గుర్తింపును రెన్యూవల్ చేయడం లేదు. దీంతో గడిచిన ఐదేండ్లలో ఏకంగా 835 కాలేజీలు మూతపడ్డాయి. మరికొన్ని కళాశాలలూ అదే బాటలో ఉన్నాయి. రాష్ట్రంలో 2014-15లో ఇంటర్ తర్వాత కోర్సులు నిర్వహించే 3,351 ప్రైవేటు కాలేజీలుంటే అవి 2018-19లో 2,516కు తగ్గిపోయాయి. డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఈడీ.. ఇలా అనేక కోర్సులు నిర్వహించే కాలేజీలు భారీగానే మూతపడ్డాయి. ఇంజినీరింగ్ కాలేజీల్లో నాణ్యత విషయంలో ప్రభుత్వం మొదటి నుంచీ కఠినంగా వ్యవహరిస్తోంది. వృత్తివిద్యాకోర్సులు నిర్వహిస్తున్న కాలేజీలు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ఆదేశించింది. ఆ మేరకు ఉన్నత విద్యామండలి చర్యలు కొనసాగిస్తోంది. దీంతో కాలేజీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. తెలంగాణ ఏర్పడిన సమయంలో (2014-15) ఇంజినీరింగ్ కళాశాలలు 337 ఉండగా, ఈ ఏడాది 188 కాలేజీలే ఉన్నాయి. వీటిలో 40కిపైగా కాలేజీలు మూతపడగా, కొన్నింటిలో ప్రమాణాల్లేవని ఉన్నత విద్యామండలి రెన్యూవల్ చేయలేదు. చాలా కాలేజీల్లో కోర్సులనూ కుదించారు. తెలంగాణలో కాలేజీలు ఎక్కువగా ఉన్నా, ఆయా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా లేక సీట్లు భారీగా మిగులుతున్నాయి. ఐదేళ్ల కింద 354 (17 గవర్నమెంట్ కలిపి) కాలేజీల్లో 61,909 మంది విద్యార్థులు చేరితే, ప్రస్తుతం 205 కాలేజీల్లో 68,296 మంది చేరారు. అయితే పలు కాలేజీల్లో అడ్మిషన్లు లేకపోవడంతో మరో రెండేండ్లలో 40 ఇంజినీరింగ్ కాలేజీల వరకూ మూతపడే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ ఐదేండ్లలో 176 ఎంటెక్ కాలేజీలూ మూతపడ్డాయి.

కొత్త కాలేజీలకు అనుమతులివ్వం

ఉమ్మడి రాష్ట్రంలో అవసరం లేకున్నా భారీగా ప్రైవేటు కాలేజీలను ఏర్పాటు చేశారు. దీంతో ఎడ్యుకేషన్ క్వాలిటీ దెబ్బతిన్నది. దీన్ని సరిచేస్తాం. ఐదేండ్లలో కొత్తగా ప్రైవేటు కాలేజీలకు అనుమతులివ్వలేదు. రానున్న ఐదేళ్లల్లోనూ ఇవ్వం.

- టి. పాపిరెడ్డి, టీఎస్‌సీహెచ్ఈ చైర్మన్

228 డిగ్రీ కాలేజీలూ మూత

ఇంటర్ తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే ప్రైవేటు కాలేజీల సంఖ్య భారీగా ఉండడంతో సగానికిపైగా కాలేజీలు తక్కువ మంది విద్యార్థులతోనే నడుస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడంతో యాజమాన్యాలు కాలేజీలను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. 2014-15లో 1,151 ప్రైవేటు డిగ్రీ కాలేజీలుండగా, ఈ ఏడాది ఆ సంఖ్య 923కు తగ్గింది. కానీ సర్కారు డిగ్రీ కాలేజీలు మాత్రం 178 నుంచి 238కి పెరిగాయి. విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా సర్కారు కాలేజీలను ప్రోత్సహిస్తోంది.

అటవీ భూముల్లో సర్వే

హైదరాబాద్, వెలుగు:

అటవీ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం దృష్టి సారించింది. పనిలో పనిగా అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాలకూ చెక్ పెట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరున్నర లక్షల ఎకరాల అటవీ భూములు వివాదంలో ఉన్నట్టు ప్రభుత్వానికి ఇటీవల ఫారెస్ట్ అధికారులు నివేదిక ఇచ్చారు. దాదాపు లక్ష ఎకరాల్లో రెవెన్యూ శాఖ పేదలకు అధికారికంగా పట్టాలిచ్చిందని అందులో పేర్కొన్నారు.

- ఆరున్నర లక్షల ఎకరాల్లో వివాదాలు
- దాదాపు లక్ష ఎకరాలకు పట్టాలిచ్చిన రెవెన్యూ
- వివాదాలకు తెరదించేందుకు సర్కారు సమాయత్తం

వివాదాల్లో12 శాతం అటవీ భూములు

భూ రికార్డుల ప్రక్షాళన స్ఫూర్తితో ఫారెస్ట్ భూముల సర్వే పూర్తి చేయాలని సర్కారు పట్టుదలతో ఉంది. అటవీ, రెవెన్యూ శాఖలు ఉమ్మడిగా ఫిబ్రవరిలో ఈ సర్వే చేపట్టనున్నాయి. రాష్ట్రంలోని అటవీ భూముల్లో 12 శాతం వివాదంలో ఉన్నాయి. మహబూబాబాద్ (52 శాతం), వికారాబాద్ (38 శాతం), ఆదిలాబాద్, వరంగల్ అర్బన్ (34 శాతం) జిల్లాల్లో అటవీ భూములపై వివాదాలున్నాయి. చాలా జిల్లాల్లో అటవీ భూములను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఆ భూముల్లో లబ్ధిదారులు నివాసం ఉంటున్నా, సాగు చేసుకుంటున్నా ఫారెస్టు అధికారులు అడ్డుపడుతున్నారు. కొన్నిచోట్ల ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి చోట్ల నష్టపోతున్న రైతులకు ఈ సర్వే ద్వారా న్యాయం జరగనుంది. సరైన రికార్డులు లేకపోవడంతో రెవెన్యూ యంత్రాంగం కొన్ని భూములను వదిలేసింది. వాటిని అటవీ శాఖ కూడా పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గురయ్యాయి. సర్వే అనంతరం వీటిని స్వాధీనం చేసుకునే వీలుంది.

జిల్లా స్థాయిలో సర్వే కమిటీలు

ఫారెస్ట్ భూముల్లో సర్వేల నిర్వహణ జిల్లా స్థాయిలో కొనసాగుతుంది. కలెక్టర్లు సర్వే టీమ్‌లను ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయి కమిటీతోపాటు రెవెన్యూ డివిజన్ పరిధిలో మరో కమిటీ పనిచేస్తుంది. వీరంతా క్షేత్రస్థాయిలో పర్యటించి సరిహద్దు వివాదాలు పరిశీలించి రిపోర్ట్ చేస్తారు. అటవీ భూముల వ్యవహారం తేలాక దేవాలయ, వక్ఫ్ భూముల లెక్కలు తేల్చాలని ప్రభుత్వం భావిస్తోంది.



అటవీ భూముల్లో వివాదాలు

విషయం	అటవీ భూములు(ఎకరాలు)
రెవెన్యూ రికార్డుల వివాదం	3,28,779.89
రెవెన్యూ సరిహద్దు వివాదం	80,186.26
అక్రమ రెవెన్యూ పట్టాలు	99,711.5
పట్టాదారులతో సరిహద్దు వివాదం	4,060.10
కోర్టు కేసుల్లో ఉన్నవి	1,001.89
ఆక్రమణ కేసుల్లో ఉన్న భూములు	29,578.52
ఇతర వివాదాల్లో ఉన్న భూములు	1,18,536.40
మొత్తం వివాదాల్లో ఉన్న భూములు	6,61,854.62

ఇక గోవాకు జల్దీ పోవచ్చు!

మహబూబ్‌నగర్–మునీరాబాద్ రైల్వే లైన్‌తో తగ్గనున్న దూరం

- శరవేగంగా కొనసాగుతున్న పనులు
- ఇప్పటికే అందుబాటులోకి దేవరకద్ర-జక్లేర్ లైన్

హైదరాబాద్, వెలుగు: మహబూబ్‌నగర్- మునీరాబాద్ కొత్త రైల్వే లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. 247 కిలోమీటర్ల ఈ మార్గాన్ని రూ.1,723 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి గోవాకు మధ్య దూరం సుమారు 102 కిలోమీటర్లు తగ్గుతుంది. ప్రయాణ సమయం కూడా కలిసిరానుంది. ఈ రైల్వేలైన్ 1997-98లో మంజూరైంది. అందులో 66 కిలోమీటర్లు తెలంగాణలో దేవరకద్ర-కృష్ణ మధ్య ఉంది. దీన్ని రూ.372 కోట్ల అంచనాతో చేపట్టారు. ఇప్పటికే దేవరకద్ర - జక్లేర్ (29 కిలోమీటర్లు) కొత్త రైల్వేలైన్ పూర్తికావడంతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల ప్రారంభించారు. ఈ మొత్తం లైన్‌పై 2014 నుంచి 2018 నవంబర్ వరకు రూ.499 కోట్లు ఖర్చు చేశారు. 2018-19 బడ్జెట్‌లో రూ.175 కోట్లు కేటాయించారు.



జక్లేర్ - కృష్ణ రైలు మార్గం పనులు నడుస్తున్నాయి. ఈ రైలు మార్గానికి 866 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 734 ఎకరాలు సేకరించి రైల్వేకు ఇచ్చింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మూడు పెద్ద వంతెనలు, 82 చిన్న వంతెనలు, ఐదు రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 27 రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మించారు. మహబూబ్‌నగర్- మునీరాబాద్ రైల్వేలైన్ పూర్తయితే మహబూబ్‌నగర్, కర్ణాటకలోని రాయచూర్ జిల్లాల్లో అభివృద్ధి వేగం పుంజుకోనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 88.87శాతం పల్లె ప్రజలకు రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది.

పీఎం కుర్చీకి పోటాపోటీ





లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్నవేళ ప్రధాని కుర్చీ ఈసారి ఎవర్ని వరిస్తుందన్నదానిపై ఆసక్తి నెలకొంది. కేంద్రంలో బీజేపీ సొంతంగా అధికారంలోకి రాదని పలు సర్వేలు చెబుతున్న నేపథ్యంలో పలు పార్టీల నేతలు పీఎం కుర్చీపై కర్చీఫ్‌లు వేయడానికి రెడీ అవుతున్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. దీంతో బీజేపీయేతర ప్రతిపక్ష కూటమి నేతగా కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ కూడా పీఎం రేసులో ముందువరసలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, బీఎస్పీ చీఫ్ మాయావతి, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా పోటీలో ఉన్నారు. ఎన్డీయే సారథి బీజేపీకి కనుక పూర్తి మెజారిటీ రాకుండా, వేరే పార్టీల మీద ఆధారపడాల్సివస్తే అప్పుడు మోడీకి బదులు గడ్కరీని పీఎం పోస్టుకు నిలబెట్టవచ్చని పార్టీవర్గాల సమాచారం. ఆరెస్సెస్ నాయకులకు ఇష్టమైనవాడు, శివసేన మద్దతు కూడా ఉండడం గడ్కరీకి కలిసివచ్చే అంశమంటున్నారు.

- ఒంటరిగా బీజేపీ అధికారంలోకి రాదంటున్న సర్వేలు
- రేసులో ముందున్న రాహుల్
- మమత, మాయా కూడా రెడీ
- అధికారపార్టీలో గడ్కరీకి చాన్స్
- తాజాగా తెరపైకి నితీశ్

న్యూఢిల్లీ : ప్రధాని పదవిపై ఈసారి ఎవర్ని వరిస్తుందన్నదానిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆశావహుల జాబితా కూడా పెరుగుతునే ఉంది. ప్రధాని కాగల అన్ని అర్హతలు కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీకి ఉన్నాయంటూ ఈమధ్య చెన్నైలో జరిగిన దివంగత నేత కరుణానిధి విగ్రహావిష్కరణ సభలో డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలతో ప్రధాని పదవిపై మరోసారి చర్చ మొదలైంది. బీజేపీయేతర ప్రతిపక్షాల ప్రధాని కేండిడేట్ గా రాహుల్ పేరును తమిళనాడు గడ్డ నుంచి తాను ప్రతిపాదిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ మిత్రపక్షాల నాయకులెవరూ బహిరంగంగా ప్రకటించలేదు. అయితే స్టాలిన్ ప్రతిపాదనపై కాంగ్రెస్ కు అనుకూలంగా ఉండే పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. ముఖ్యంగా నిత్యం బీజేపీతో యుద్ధం చేసే తణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించారు.ఎన్డీయే కూటమిని ఓడించడమే ముఖ్యమని, ప్రధాని ఎవరన్నది ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మిత్రపక్షాలన్నీ కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావచ్చన్నది మమత ఆలోచన.



మాయావతి: ప్లస్‌పాయింట్లు

ప్రధాని రేసులో బీఎస్పీ చీఫ్ మాయావతి కూడా ఉన్నారు.రేసులో ఉండటానికి ఆమెకు అనేక ప్లస్ పాయింట్లున్నాయి.
మొదటి పాయింట్: దేశంలో 16.6 శాతం ఉన్న దళిత వర్గానికి ఆమె జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కొన్ని వందల ఏళ్ల పాటు అణచివేతకు గురైన తమ వర్గం ప్రతినిధి ప్రధాని కావాలన్నది దళితుల చిరకాల వాంఛ.
రెండో పాయింట్: మహిళ. ఇందిరా గాంధీ తర్వాత దేశానికి మహిళా ప్రధాని ఎవరూ లేరు.
మూడో పాయింట్: యూపీలాంటి పెద్ద రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన అనుభవం ఆమె సొంతం. అలాంటి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయడం కత్తి మీద సామే అయినా, ఈ విషయంలో ఆమె మాత్రం సక్సెస్ అయ్యారు.



మమత: బెంగాల్ కోటా

బెంగాల్ ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ కూడా ప్రధాని పదవిని కోరుకుంటున్నారు. రాష్ట్రం నుంచి ప్రధానిగా ఎవరినైనా ఎన్నుకోవలసి వస్తే, ఆ పదవికి మమత అన్నివిధాల అర్హురాలంటూ బీజేపీ పశ్చిమ బెంగాల్ శాఖ ప్రెసిడెంట్ దిలీప్ ఘోష్ తాజాగా కామెంట్ చేశారు. మమతా బెనర్జీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియచేస్తూ "ప్రధాని కావాలని ఆమె కలలు కంటున్నారు. ఆమెకు అదృష్టం కలిసి రావాలని కోరుకుంటున్నా" అని దిలీప్ ఘోష్ అన్నారు. దీంతో ఎన్నికల్లో పరిస్థితి ఏమాత్రం ఉల్టా పల్టా అయినా ఆమెకు ఎన్డీయే కూటమి అండగా నిలుస్తుందన్న ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఈనెల 19న కోల్ కతాలో బీజేపీయేతర ప్రతిపక్షాల మెగా ర్యాలీని మమత ఏర్పాటు చేశారు.




గడ్కరీ: ఆర్ఎస్ఎస్, సేన మద్దతు

మూడు హిందీ రాష్ట్రాల్లో బీజేపీ ఓటమి తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ పై ధిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. ఆరెస్సెస్ కు బాగా దగ్గరైన నాయకులు కొంతమంది నితిన్ గడ్కరీకి అనుకూలంగా ప్రకటనలు చేయడం మొదలెట్టారు. ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి రావాలంటే నితిన్ గడ్కరీ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లాలని మహారాష్ట్ర కు చెందిన రైతు కిషోర్ త్రివేది కొన్ని రోజుల కిందట చేసిన కామెంట్ రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లు ఎన్డీయే కూటమికి రాకపోతే అందరికీ ఆమోదయోగ్యుడైన నేతగా నితిన్ గడ్కరీ పేరును బీజేపీ ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదని ఆ పార్టీకి మిత్రపక్షంగా ఉన్న శివసేన భావిస్తోంది.



నితీశ్: కొత్తగా తెరపైకి

బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యు) సీనియర్ నేత నితీశ్ కుమార్ కూడా ప్రధాని పదవిని ఆశిస్తున్నవారిలో ఉన్నారు. 'జంగిల్ రాజ్' గా పేరున్న బీహార్ ను అభివృద్ధి చేసిన ఘనత సొంతం చేసుకున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో ఆధునిక పోకడలున్న లీడర్ గా ఆయన పేరు తెచ్చుకున్నారు. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున ప్రధాని కేండిడేట్ గా నితీశ్ కూడా ఉంటారని ఆ పార్టీ సీనియర్ నేత రాజీవ్ రంజన్ తాజాగా చెప్పారు.



యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్ ట్రైలర్ బ్యాన్‌కు హైకోర్టు నో

న్యూఢిల్లీ: 'ది యాక్సిడెంటల్‌ప్రైమ్‌మినిస్టర్' సినిమా ట్రైలర్‌ను నిషేధించాలంటూ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఈ మేరకు పిటిషన్‌ను పిల్‌గా మార్చాలని ఆదేశించింది. అంతే కాకుండా పటిషనర్‌పై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చిత్ర బృందం 416 సెక్షన్‌ను ఉల్లంఘించిందని, ఒక వ్యక్తి జీవితం ఆధారంగా సినిమా తీస్తున్నప్పుడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని ఢిల్లీకి చెందిన ఫ్యాషన్‌డిజైనర్‌పూజా మహాజన్ పిటిషన్‌దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను కోర్టు సోమవారం విచారించింది.' నిర్మాతలు మన్మోహన్‌సింగ్‌నుంచి కానీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ నుంచి కానీ ఎలాంటి అనుమతి తీసుకోలేదు. కాబట్టి ట్రైలర్‌ను నిషేధించండి' అని పిటిషనర్‌తరపు లాయర్ కోర్టును కోరారు. దానికి కోర్టు నో చెప్పింది. అసలు ఫ్యాషన్‌డిజైనర్‌కు ఈ సినిమాకు సంబంధం ఏంటని జస్టిస్‌విభూ ప్రశ్నించారు. మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు రాసిన పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో మన్మోహన్‌సింగ్ పాత్రలో అనుపమ్ ఖేర్, సంజయ్ బారూ పాత్రలో అక్షయ్ ఖన్నా నటించారు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఎప్పుడంటే అప్పుడు సమ్మె కుదరదు

- ముందుగా నోటీసు ఇవ్వాలన్న కేరళ హై కోర్టు

కోచి : ఎప్పుడు పడితే అప్పుడు సమ్మె చేస్తామంటే కుదరదని కేరళ హై కోర్టు స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థ అయినా సమ్మె చేయాలంటే వారం రోజులు ముందుగా నోటీసు ఇవ్వాలని తెగేసి చెప్పింది. శబరిమల అంశంపై వారానికి ఒకట్రెండు రోజులు సమ్మె జరుగుతున్న పరిస్థితుల్లో కేరళ హై కోర్టు ఈ మేరకు కామెంట్ చేసింది. చెప్పాపెట్టకుండా సమ్మె చేయడాన్ని ప్రశ్నిస్తూ కేరళ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ దాఖలు చేసిన పిటీషన్ పై విచారణ సందర్భంగా హై కోర్టు సోమవారం ఈమేరకు ఓ నిర్ణయం తీసుకుంది. ముందుగా నోటీసు ఇవ్వకుండా ఎవరైనా సరే సమ్మె చేస్తే, కోర్టుకు రావచ్చని చీఫ్ జస్టిస్ హృషీ కేశ్ రాయ్, జస్టిస్ ఏకే జయ శంకరన్ నంబియార్ తో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. ఎప్పుడు పడితే అప్పుడు సమ్మెలు చేయడం వల్ల ఆ ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై పడుతుందని హై కోర్టు అభిప్రాయపడింది.

తమిళనాడు మంత్రికి మూడేళ్ల జైలు

చెన్నై: తమిళనాడు యువజన శాఖ మంత్రి బాలకృష్ణారెడ్డికి మూడేళ్ళ జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. 1998లో వినాయకుడి ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. బస్సులపై రాళ్ల దాడి కూడా జరిగింది. ఈ సంఘటనలకు సంబంధించి బాలకృష్ణారెడ్డిపై కేసు నమోదైంది.కేసు విచారించిన స్పెషల్ కోర్టు, మంత్రికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పుపై హై కోర్టులో అప్పీల్ చేస్తానని మంత్రి చెప్పారు. కోర్టు తీర్పు నేపథ్యంలో సీనియర్ మంత్రులు, అధికారులతో తమిళనాడు సీఎం పళనిస్వామి అత్యవసరంగా సమావేశమయ్యారు.

తిరువారూర్ ఉప ఎన్నిక రద్దు

న్యూఢిల్లీ: తమిళనాడులోని తిరువారూర్ లోక్ సభ సెగ్మెంట్ ఉప ఎన్నికను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం రద్దు చేసింది. తమిళనాడు మాజీ సీఎం, డీఎంకే చీఫ్‌కరుణానిధి చనిపోవటంతో తిరువారూర్ లోక్ సభ స్థానం ఖాళీ అయింది. దీంతో ఈ నెల 28న ఉప ఎన్నిక జరపడానికి నోటిఫికేషన్ విడుదలైంది. గజ తుఫాను బాధితులకు అందాల్సిన పరిహారం ఇంకా అందలేదని, అది పూర్తయ్యే వరకు ఉప ఎన్నిక వాయిదా వెయ్యాలని పార్టీలు ఈసీని కోరాయి. దీంతో ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. డీఎంకే సహా పలు పార్టీలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించాయి. పార్టీలు అభ్యర్థులను ప్రకటించడాన్ని బీజేపీ విమర్శించింది. 'తిరువారూర్‌ప్రజలకు కావాల్సింది ఎన్నికలు కాదు, రిలీఫ్. కానీ పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించడంలో బిజీగా ఉన్నాయి' అని బీజేపీ నేత ఆరోపించారు.

రద్దు చేసిన సెక్షన్ కింద అరెస్టులా?

సుప్రీంకోర్టు సీరియస్

ఆ అధికారుల్ని జైలుకి పంపిస్తామని వార్నింగ్



న్యూఢిల్లీ:

సైబర్ క్రైమ్, ఈ కామర్స్ అంశాలకు సంబంధించిన ఐటీ చట్టంలోని తొలగించిన సెక్షన్ కింద అరెస్టులు చేయడంపై ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అరెస్టులకు ఉత్తర్వులు ఇచ్చిన వారిని అరెస్ట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఎ)ను సుప్రీంకోర్టు ఇప్పటికే రద్దు చేసింది. సైబర్, ఈకామర్స్ నేరాలపై చర్యలు తీసుకునే అంశానికి సంబంధించిన ఈ సెక్షన్ అస్పష్టంగా, చట్టవిరుద్ధంగా ఉందని 2015లోనే తీర్పు చెప్పింది. అయినా ఈ సెక్షన్ కింద 22 మంది అరెస్ట్‌కు ఉత్తర్వులు జారీచేశారంటూ పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) అనే ఎన్జీవో సుప్రీంకోర్ట్‌లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేసిన సుప్రీంకోర్టు అధికారుల తీరును తప్పుపట్టింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని.. సెక్షన్ 66(ఎ) ఆధారంగా అరెస్ట్‌లకు ఆదేశించిన అధికారులను జైలుకు పంపుతామని హెచ్చరించింది.

ఎరిక్‌సన్ పిటిషన్‌పై ఆర్‌కాంకు నోటీసులు

న్యూఢిల్లీ: ఎరిక్‌సన్ ఇండియా దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై అనిల్ అంబానీ నేతృత్వంలని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) కు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. తమకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించడంలో జరుగుతున్న జాప్యంపై ఎరిక్‌సన్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ విషయంలో రిలియన్స్ కమ్యూనికేషన్స్ కోర్టు ధిక్కారానికి పాల్పడిందంటూ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌ను విచారించిన కోర్టు నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలంటూ రిలయన్స్ కమ్యూనికేషన్స్‌ను ఆదేశించింది. అయితే రూ.118 కోట్లను కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయడానికి రిలయన్స్ కమ్యూనికేషన్స్ అంగీకరించింది. అయితే ఎరిక్‌సన్ దీనికి ఒప్పుకోలేదు. మొత్తం బకాయిలు రూ.550 కోట్లు చెల్లించాల్సిందేనని కోరింది. మరోవైపు, అనిల్ టెలికం బిజినెస్‌ను ముఖేష్‌అంబానికి అమ్మేవిషయంలో నెలకొన్న వివాదాన్ని కూడా ఇద్దరు సోదరులు పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించంది.

ఒకో పార్టీ ఒకో డిమాండ్

సభను సాగనీయలే

న్యూఢిల్లీ:

లోక్‌సభలో సమాజ్‌వాది పార్టీ ఎంపీలు గందరగోళం సృష్టించారు. ఇసుక మైనింగ్ కేసులో తమ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌పైకి కేంద్రం సీబీఐని ఉసిగొల్పుతోందంటూ తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. కాగితాలు చించి స్పీకర్ చైర్ వైపు విసిరేశారు. అటు రాఫెల్‌పై కాంగ్రెస్, కావేరీపై అన్నా డీంఎకే కూడా ఆందోళనలు చేశాయి. ఏపీకి ప్రత్యేక హోదా కోసం టీడీపీ ఎంపీ శివప్రసాద్ తమిళనాడు మాజీ సీఎం ఎంజీఆర్ వేషం వేసుకొని చేతిలో చెర్నాకోల పట్టుకొని పాటలు పాడుతూ, చిడతలు వాయిస్తూ నిరసన వ్యక్తంచేశారు. దీంతో సోమవారం సభ మూడుసార్లు వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డులు పట్టుకొని రాఫెల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయాలని డిమాండ్ చేశారు. పేపర్లు చించేసి స్పీకర్ డెస్క్ వైపు విసిరేశారు. డెస్క్ ముందు కూర్చున్న అధికారుల వద్ద పేపర్లు లాక్కొనేందుకు యత్నించారు. సీబీఐ పంజరంలో చిలుకలా మారిందని, అధికార పార్టీతో పొత్తు పెట్టుకుందని ఎస్పీ మెంబర్ ధర్మేంద్ర యాదవ్ నినాదాలు చేశారు. ఈ గందరగోళం మధ్యే ప్రభుత్వం 'పర్సనల్ లాస్ అమెండ్‌మెంట్ బిల్'ను ప్రవేశపెట్టింది. తర్వాత దేశంలో ప్రకృతి విపత్తులపై చర్చ మొదలుపెట్టింది.



- సీబీ'ఐ'పై ఎస్పీ.. రాఫెల్‌పై కాంగ్రెస్
- కావేరిపై అన్నా డీఎంకే, ప్రత్యేక హోదాపై టీడీపీ
- కాగితాలు చించి స్పీకర్ డెస్క్ వైపు విసిరిన ఎస్పీ సభ్యులు

ఈ టైంలోనే ఎస్పీ సభ్యులు కాగితాలు చించేస్తూ తీవ్ర రగడ సృష్టించడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. ఆ సమయంలో ఎస్పీ చీఫ్ ములాయం సభలోనే ఉన్నారు. మళ్లీ సభ మొదలైనా కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. కావేరీపై నిరసన వ్యక్తంచేస్తూ అన్నాడీఎంకే ఎంపీలు కూడా వచ్చారు. వీరికితోడు ఎంజీఆర్ వేషం వేసుకొని టీడీపీ ఎంపీ శివప్రసాద్ వచ్చి పాటలందుకున్నారు.



ప్రమాదంలో ప్రజాస్వామ్యం

అమర్త్యసేన్ ఆందోళన

కోల్ కత: ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజలే రక్షించుకోవాలన్నారు.దేశ రాజకీయ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైతే బీజేపీయేతర కూటమిలో చేరడానికి లెఫ్ట్ పార్టీలు వెనకాడరాదన్నారు. బహుళ పార్టీ వ్యవస్థతోనే ప్రజాస్వామ్యం బతుకుతుందని ఆయన చెప్పారు. ఒక పార్టీ పెత్తనమే ఉంటే, సమాజంలో నియంతృత్వ ధోరణులు పెరుగుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మరో నాలుగైదు నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సెక్యులర్ పార్టీలన్నీ ఒక వేదిక మీదకు రావాలని కోల్ కతాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన అన్నారు.

జనం సమస్యలు తెర వెనక్కి

ఎన్నికల వేళ ప్రజా సమస్యలు తెర వెనక్కి వెళ్లేలా చేయడంలో మోడీ సర్కార్ సక్సెస్ అయిందని అమర్త్యసేన్ విమర్శించారు. రామమందిర్, శబరిమల వంటి అంశాలు కీలకమయ్యాయన్నారు. ప్రజల అభిప్రాయాలను సర్కార్ గౌరవించడం లేదన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న అమర్త్యసేన్: బీజేపీ

మోడీ సర్కార్ పై అమర్త్యసేన్ విమర్శలు చేయడాన్ని బీజేపీ తప్పుపట్టింది. అమర్త్యసేన్ తన కామెంట్ల ద్వారా సమాజాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించింది.



సిటిజన్‌షిప్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ గౌహతిలో సోమవారం ర్యాలీ తీస్తున్న ఎల్డీఎఫ్ కార్యకర్తలు

బీజేపీతో ఏజీపీ కటీఫ్

న్యూఢిల్లీ :

సిటిజన్ షిప్(సవరణ)బిల్లు 2016పై తమ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ కేంద్రం ముందుకెళ్లడంతో అస్సాంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు వస్తున్నట్లు అస్సాం గణపరిషత్(ఏజీపీ) ప్రకటించింది. సిటిజన్ షిప్ (సవరణ)బిల్లును చట్టం చేయడం అంటే అస్సాం ఒప్పందాన్ని తుంగలో తొక్కడమేనని ఏజీపీ పేర్కొంది. సిటిజన్ షిప్(సవరణ)బిల్లు 2016 ను అడ్డుకోవడానికి ఏజీపీ అన్ని ప్రయత్నాలు చేసింది. పార్టీ తరఫున ఒక ప్రతినిధి బృందం, కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కలిసి, అభ్యంతరాలు వ్యక్తం చేసింది. బిల్లుకు ఓకే చెప్పడం అంటే అస్సాం ప్రజల ప్రయోజనాలకు తూట్లు పొడవడమే అని ఏజీపీ లీడర్లు పేర్కొన్నారు. "సిటిజన్ షిప్(సవరణ)బిల్లును అడ్డుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేశాం.అయితే ఈవిషయంలో కేంద్రం మొండిగా వ్యవహరిస్తోంది.దీంతో, సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నాం" అని ఏజీపీ ప్రెసిడెంట్ అతుల్ బోరా చెప్పారు. అస్సాం మాజీ సీఎం ప్రఫుల్ కుమార్ మహంతా కూడా ఈ (సవరణ)బిల్లుపై తన అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

అస్సాం సర్కార్ కు వచ్చిన ముప్పేమీ లేదు

అస్సాంలో ప్రస్తుతం బీజేపీ నాయకత్వాన సంకీర్ణ ప్రభుత్వం ఉంది. అసెంబ్లీలో మొత్తం 126 సెగ్మెంట్లు ఉంటే బీజేపీకి 61 సీట్లు ఉన్నాయి. మిత్రపక్షాలైన అస్సాం గణపరిషత్ కు 14 సీట్లు, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ కు 12 సీట్లు ఉన్నాయి.ఈనేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం నుంచి ఏజీపీ బయటకు వెళ్లినా బీజేపీ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదు.

- సిటిజన్ షిప్ (సవరణ)బిల్లు 2016 పై అభ్యంతరాలు
- అస్సాం ఒప్పందాన్ని తుంగలో తొక్కుతున్నారంటూ విమర్శలు

సిటిజన్ షిప్(సవరణ)బిల్లు 2016 ఏంటి ?

బంగ్లాదేశ్,పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ దేశాల నుంచి వచ్చిన అక్రమ వలసదారులను పౌరులుగా గుర్తించడమే మౌలికంగా సిటిజన్ షిప్(సవరణ)బిల్లు. 2016 జులై 15న ఈ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టారు. 1955 నాటి సిటిజన్ షిప్ బిల్లుకు ఇది సవరణ.పొరుగుదేశాల నుంచి శరణార్థులుగా ఇండియాకు వచ్చి తలదాచుకున్న హిందువులకు పౌరసత్వం ఇస్తామని 2014 లోక్ సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ హామీ ఇచ్చింది. అక్రమ వలసదారులకు పౌరసత్వం ఇవ్వడాన్ని అస్సాం గణపరిషత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.



మంచు కట్టడంలో టూరిస్టుల సందడి

ఇంటర్నేషనల్ఐస్అండ్‌స్నో ఫెస్టివల్‌లో భాగంగా చైనాలోని హార్బిన్ లో ఓ మంచు కట్టడం.. ఏటా జనవరి మొదటి వారం నుంచి ఫిబ్రవరి 5 వరకూ జరిగే ఈ ఫెస్టివల్ ను సందర్శించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు చైనాకు చేరుకుంటారు. ఫెస్టివల్ జరిగే ప్రాంతంలో మైనస్35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది.

మనసెట్ల వచ్చిందో!

ఓ అంగన్‌వాడీ కేంద్రం వద్ద దారుణం జరిగింది. గుడ్డు ఎందుకు చిన్నవి ఇస్తున్నావని అడిగినందుకు ఓ బాలింతపై అంగన్‌వాడీ ఆయా దంపతులు దాడి చేశారు. మృగంలా మారిన ఆయా భర్త సదరు బాలింత కడుపులో బలంగా తన్నాడు. దీంతో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పిండం బయటపడింది. మానవత్వం మరిచిన ఆ వ్యక్తి పశువులా మారి శిశువును చంపివేశాడు. దీంతో అక్కడున్నవారి గుండెలవిసి పోయాయి. అతి కిరాతకంగా వ్యవహరించిన వ్యక్తిని జనం నానా దుర్భాషలాడారు. హాస్పిటల్‌లో బాధితురాలి పరిస్థితి చూసిన వారంతా అంగన్‌వాడీ ఆయా భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- బాలింతను కాలితో తన్నిన వ్యక్తి
- కడుపులోంచి బయటపడిన పిండం
- బాధితురాలి పరిస్థితి విషమం
- అంగన్ వాడీ ఆయా భర్త నిర్వాకం
- గుడ్డు విషయంలో చిన్న గొడవ

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : చిన్న విషయం గొడవగా మారింది. చిలికి చిలికి గాలివాన మాధిరిగా ఆ గొడవ చివరకు కడుపులోని బిడ్డ ప్రాణాన్ని బలి తీసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలీలాఉన్నాయి. టేకులపల్లి ఎస్సై ప్రవీణ్‌కుమార్, బాధితురాలి భర్త లక్ష్మణ్ కథనం ప్రకారం... భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలం మద్దిరాల గ్రామానికి చెందిన బాదావత్ పద్మ(28)కు అదే ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీ ఆయా నీలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బాదావత్ పద్మ, లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు పాపలు, చిన్న పాప మద్దిరాల అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటోంది. పెద్దపాప అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని గవర్నమెంట్ స్కూల్లో ఒకటో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట పెద్ద పాప మేఘన స్కూల్‌కు సెలవు కావడంతో ఆమె చెల్లి వద్ద అంగన్‌వాడీ కేంద్రంలోనే కూర్చుంది. మేఘన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ‘నీకు ఆరోగ్యం బాగాలేదు, నువ్వు మా దగ్గర కూర్చో వద్దు’ అంటూ అంగన్‌వాడీ ఆయా నీల వెళ్లగొట్టింది. ఈ విషయమై సోమవారం నీలను మేఘన తల్లి పద్మ నిలదీసింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అన్నం సరిగా పెట్టడం లేదంటూ, గుడ్లు చిన్నగా వున్నవి ఇస్తున్నారంటూ ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో కోపంతో ఆయా నీల తన భర్త ఈరుకు ఫోన్ చేసింది. కోపంతో వచ్చిన ఈరు, నీల కలిసి పద్మపై దాడి చేశారు. ఆరు నెలల గర్భవతి అని కూడా చూడకుండా ఈరు ఆమె కడుపు మీద కాలుతో తన్నాడు. దీంతో పద్మకు ఘటనాస్థలంలోనే గర్భస్రావం జరిగింది. కడుపులోని పిండం బయటపడింది. పద్మ అపస్మార స్థితిలోకి వెళ్లడంతో ఆమెను వెంటనే అంబులెన్స్ లో సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి కొంత విషమంగానే ఉందని డాక్టర్లు చెప్పారు. పద్మ భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ ఘటనపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. పిండానికి కొత్తగూడెం ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.



కొత్తగూడెం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న పద్మ

ఎన్నికల్లో పొరపాట్లు జరగొద్దు

ఏర్పాట్లను పరిశీలించిన క్రిష్టినా జడ్ చోంగ్తూ



ఆర్మూర్ ఎంపీడీవో గోపికి సూచనలిస్తున్న అధికారిణి క్రిష్టినా జడ్ చోంగ్తూ

నిజామాబాద్, వెలుగు : మొదటి విడత ఎన్నికల్లో పొరపాట్లు జరగొద్దని అధికారులను గ్రామ పంచాయతీ ఎన్నికల జనరల్ పరిశీలకులు డాక్టర్ క్రిష్టినా జడ్ చోంగ్తో సూచించారు. సోమవారం నిజామాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో జిల్లా కలెక్టర్ రామ్మోహన్ రావుతో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆర్మూర్ మండలం అంకాపూర్ జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి వసతిని స్వయంగా పరిశీలించారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన గదిని కూడా పరిశీలించారు. ఆర్డీవో, ఎంపీడీవోలకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ రాత్రి వరకు కొనసాగే అవకాశాలుండటంతో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి భోజన వసతి సదుపాయాలను సమకూర్చాలన్నారు. అనంతరం ఆర్మూర్ ఎంపీడీవో ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాల వారీగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, ఎంపీడీవో, డీపీవోలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకునే చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.



చిన్నచింతకుంటలో సురేష్ తల్లి యాదమ్మ



మంతూర్‌లో ఏడుస్తున్న శ్యాంసుందర్‌గౌడ్ తల్లి సుజాత

ఎటుచూసినా విషాదమే

గొల్లుమంటున్న నాలుగు పల్లెలు

ఒక్కో కుటుంబానికి ఒక్కో గాథ

మెదక్, వెలుగు:

జిల్లాలోని నాలుగు ఊళ్లు కన్నీటిలో మునిగిపోయాయి. శబరిమల నుంచి తిరిగివస్తూ మరణించిన వారి కుటుంబసభ్యుల ఏడుపులతో సోమవారం ఆ ఊళ్లలో విషాదం నెలకొంది. చనిపోయిన వారంతా పేద, మధ్యతరగతి వారే. అయ్యప్ప మాల ధరించి స్వామిని దర్శించుకునేందుకు శబరిమల వెళ్లి వస్తుండగా కంటైనర్ వారిని బలితీసుకుంది. తమిళనాడులోని పుదుక్కొట్టై వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నర్సాపూర్ మండలం ఖాజీపేట, మంతూరు, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన తొమ్మిది మంది చనిపోయారు. ఆ కుటుంబాల్లో ఎవరిని కదిలించినా కన్నీటి కథలే.

ఎంత వద్దన్నా వినలేదు

ప్రమాదంలో మృతి చెందిన బోయిన కుమార్(22)ది ఖాజీపేట. హైదరాబాద్‌లో ఒరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ వర్క్ చేస్తున్నాడు. ఫస్ట్‌టైం అయ్యప్ప మాల వేసుకుని శబరిమల వెళ్లాడు. తామెంత వద్దన్నా వినకుండా కుమార్ మాల వేసుకున్నాడని, తామ మాట వినుటే ఇంత ఘోరం జరిగిఉండేది కాదని అతని అన్న గణేష్ వాపోయాడు. పది రోజుల కింద ఇంట్లో పెద్ద ఎత్తున పడిపూజ చేశాడని.. సంతోషంగా అయ్యప్ప గుడికి పోతున్నానని చెప్పి ఇలా శవమై వస్తాడని ఊహించలేదంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.

ఇంక దిక్కెవరూ

మంతూర్‌కే చెందిన సంజీవ్‌గౌడ్, సుజాత దంపతుల కొడుకు శ్యామ్‌సుందర్‌గౌడ్(22) ప్రమాదంలో చనిపోయాడు. వీరిది పేద కుటుంబం. తండ్రి మానసిక ఆరోగ్యం సరిగా లేక ఇంటికే పరిమితం అయ్యాడు. దీంతో శ్యామ్ సుందర్ నర్సాపూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇపుడు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో మా ఇంటికి ఆధారమెవరంటూ తల్లిదండ్రులు రోదించడం కలిచివేస్తోంది. రెడ్డిపల్లికి చెందిన నక్క ఆంజనేయులు (42) నర్సాపూర్‌లో మోటర్ వైండింగ్ చేస్తుంటాడు. స్వాముల వెంట ఆయన సివిల్‌గా శబరిమల వెళ్లి చనిపోయాడు. ఆయన మరణంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.



బండి ముచ్చటైన తీరకముందే..

ఖాజీపేటకే చెందిన సాయిలు, మల్లమ్మల చిన్న కొడుకు మహేష్(24) నర్సాపూర్‌లో ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఇతనికి ఎనిమిది నెలల కిందే మనూషతో పెళ్లైంది. రెండోసారి మాల వేసుకుని శబరిమల వెళ్లివస్తూ చనిపోయాడు. నాకెందుకింత అన్యాయం చేశావంటూ మనూష గుండెలవిసేలా ఏడుస్తోంది. మహేష్ తన సంపాదనతో ఈమధ్యే తన అన్న నరేష్‌కు పల్సర్ బైక్ కొనిచ్చాడు. తనకు ఎంతో ఇష్టపడి రాయల్ ఇన్‌ఫీల్డు కొనుక్కున్నాడు. ఆ బండి ముచ్చట తీరకముందే అతను చనిపోయాడంటూ అతని దోస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.

పెద్దదిక్కు దూరమైంది

ఖాజీపేటకు చెందిన నాగరాజు(35) గురుస్వామి. ఆయన ఇప్పటి వరకు 17 సార్లు మాల వేసుకున్నాడు. ఈసారి ఇంట్లోనే సన్నిధానం ఏర్పాటు చేసి నిత్యం పూజలు నిర్వహించారు. అతని తమ్ముడు నరేష్ కూడా మాల ధరించి అన్నవెంట శబరిమల వెళ్లాడు. పుదుక్కొట్టై వద్ద జరిగిన ప్రమాదంలో నాగరాజు చనిపోగా, నరేష్ గాయపడ్డాడు.

తట్టుకోలేక భార్యకు అస్వస్థత

రెడ్డిపల్లి గ్రామానికే చెందిన అంబరిపేట కృష్ణ(35) బాచుపల్లిలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య లావణ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. యాక్సిడెంట్‌లో కృష్ణ చనిపోయిన విషయం తెలిసి తట్టుకోలేక అతని భార్య అస్వస్థతకు గురైంది. నర్సాపూర్ తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెదక్ మండలం మగ్దుంపూర్‌కు చెందిన ప్రవీణ్‌గౌడ్(24) చిన్నచింతకుంటలోని అమ్మమ్మ వాళ్లింట్లో ఉండి చదువుకున్నాడు. నర్సాపూర్‌లో మీసేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాసిన ప్రవీణ్ ఉద్యోగంలో చేరిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇపుడు శాశ్వతంగా దూరమయ్యాడంటూ తండ్రి శ్రీనివాస్ గౌడ్ ఏడుస్తున్నాడు. ప్రమాదంలో చనిపోయిన చిన్నచింతకుంటకు చెందిన సురేష్(24)ది నిరుపేద కుటుంబం. ఇతని తండ్రి మధు ఐదేళ్లకిందట యాక్సిడెంట్‌లో చనిపోయాడు. దీంతో తల్లి యాదమ్మ పోషణ భారం ఇతనిపై పడింది. ఈ మేరకు సురేష్ మేడ్చల్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇంటి బాధ్యతలు చూస్తున్నాడు. ఇదివరకు భర్త ఇపుడు కొడుకు మృతిచెందడంతో యాదమ్మ ఒంటరైంది.

ఎదిగొచ్చిన కొడుకు..

మంతూర్ గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్, కమలమ్మల కొడుకు శివప్రసాద్(21) దూలపల్లిలో సెంట్ మారిటన్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇంటి నుంచే రోజు కాలేజీకి వెళ్లివచ్చేవాడు. అయ్యప్ప మాల వేసుకున్న కజిన్ శ్రీశైలం వెంట సివిల్‌లో శమరిమల వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. కొడుకు కష్టపడొద్దని, పెద్ద సదువు సదివి ఉద్యోగం చేయాలని కలలుగన్న తండ్రి అతని మరణంతో కుప్పకూలిపోయాడు. ఆగం చేసి పోయాడంటూ తల్లిదండ్రులు విలపిస్తున్నారు.



క్యాట్ లో ప్రతిభ చూపిన సాకేత్

- 99% మార్కులతో ఉత్తీర్ణత

పరకాల, వెలుగు : శాయంపేట సోషల్ వెల్ఫేర్ హాస్టల్ అధికారి కోడం శ్రీనివాస్ కుమారుడు సాకేత్ నేషనల్ ఐఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాట్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ప్రతిభ చూపి 99.34% మార్కులు సాధించాడు. సోమవారం సాకేత్ ను టీచర్లు, స్నేహితులు అభినందించారు. సాకేత్ పదో తరగతి వరకు కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్లో చదివాడు. టెన్త్‌లో 95 శాతం మార్కులు సాధించాడు. ఇంటర్ హైదరాబాదులోని శ్రీ గాయత్రీ కాలేజీలో చదివి 95% మార్కులు సాధించాడు. బీటెక్ బిట్స్ పిలానీలో ట్రిపుల్ ఈ చేశాడు. అందులో 8.5 జీపీఏతో ఉత్తీర్ణుడయ్యాడు. ఇటీవల జరిగిన క్యాట్ ఎంట్రెన్స్ టెస్టులో 99.34 శాతం మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా సాకేత్ మాట్లాడుతూ తల్లిదండ్రుల స్ఫూర్తితోనే తాను ఇవన్నీ సాధించానని అన్నారు.



‘సాయికృష్ణను ఆదుకోండి’

మహబూబాబాద్, వెలుగు: అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో గాయపడ్డ మహబూబాబాద్ పట్టణానికి చెందిన పూస సాయికృష్ణను ఆదుకోవాలని కోరుతూ సోమవారం ఢిల్లీలో కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌ను ఎంపీ సీతారామ్ నాయక్ కలిశారు. జరిగిన ఘటనను వివరాలను ఆమెకు తెలిపాఉ. సాయి కృష్ణ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, అతడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

న్యాయానికి సంకెళ్లేస్తారా?

సంగారెడ్డి, వెలుగు: సామాజిక న్యాయంతో పాటు స్టూడెంట్ సమస్యలపై నిరంతరం పోరాడే వారిని జనశక్తి పేరుతో అక్రమంగా అరెస్టు చేశారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నారన్న నేరంపై సిద్దిపేటలో ఈ నెల 5న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్ట్ చేసిన వారిని పోలీసులు ఎక్కడుంచారో తెలుస్తలేదంటూ బాధిత కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు సహాయంతో సంగారెడ్డి జిల్లా జైలులో ఉన్నట్టు తెలుసుకొని సోమవారం వారిని కలిశారు . అనంతరం సంగారెడ్డిలో కుటుంబ సభ్యులు సుగుణ, రాజు, రామేశ్వరి , అనసూయ విలేకరులతో మాట్లాడారు. స్టూడెంట్ కోసం పోరాడే వారిని జైల్లో వేశారని ఆరోపించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు.



వెదురు సేకరణకు మరో ఐదేళ్లు హాలిడే

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నాగర్‌కర్నూల్, వెలుగు : నల్లమల అడవి నుంచి వెదురు సేకరణపై మరో ఐదేళ్లు నిషేధం విధిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి వెదురు సేకరణపై 2013లో ఐదేళ్ల నిషేధం విధించిన ప్రభుత్వం తాజాగా మరో ఐదేళ్లు పొడిగించింది. కృష్ణానదిపై నాటుపడవల ద్వారా కలప, వెదురు అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై నిఘా ఉంచిన అధికారులు గతేడాది దాదాపు 250 పైకి పైగా కేసులు నమోదు చేశారు. 40 ఎడ్ల బండ్లను సీజ్ చేశారు. వెదురు నరకడానికి ఇతర రాష్ట్రాల నుంచి రప్పించిన కూలీలను తిరిగి వెనక్కి పంపించారు. తాజా నిషేధం మరో ఐదేళ్లు పొడిగింపుతో వెదురు క్రాప్ హాలిడే ప్రకటించినట్లు అయ్యింది.

వేములఘాట్ రైతులకు చెక్కులు

- 69 మందికి రూ. 16.50 కోట్లు

సిద్దిపేట, వెలుగు: తొగుట మండలం వేములఘాట్ రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ సోమవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో ప్రారంభించారు. మల్లన్నసాగర్ ప్రాజక్టు కోసం సేకరించిన భూములకు సంబంధించి చెక్కుల ఇస్తున్నారు. వేములఘాట్‌లో 566 మంది రైతుల నుంచి 966 ఎకరాలను సేకరించారు. ఎకరాకు 7.75 లక్షల చొప్పున పరిహారంగా చెల్లిస్తున్నారు. సోమవారం 69 మంది రైతులకు 213.09 ఎకరాలకు సంబంధించి రూ. 16.50 కోట్ల చెక్కులను కలెక్టర్ క్రిష్ణభాస్కర్ అందించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో తమకు న్యాయం జరుగుతున్నదని రైతులు అన్నారు. చెక్కుల పంపిణీ కోసం రైతుల కోసం ఐదు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. రైతులకు ఈ హెల్ప్ డెస్క్ లోని సిబ్బంది సహాయపడ్డారు. ఇవే కాకుండా పరిహారం కోసం వచ్చిన రైతులకు రెవెన్యూ సమస్యలుంటే పరిష్కారించేందుకు మరో మూడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆర్డీవో ఆఫీసు దగ్గర పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వేములఘాట్ రైతులను మాత్రమే పోలీసులు పంపించారు. జేసీ పద్మాకర్, సిద్దిపేట ఆర్డీవో జయచంద్రారెడ్డి, గజ్వేల్ ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, గడ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి పాల్గొన్నారు. మంగళవారం కూడా పంపిణీ జరుగుతోంది.

కేటీపీపీలో నిలిచిన కరెంటు ఉత్పత్తి

భూపాలపల్లి రూరల్, వెలుగు : కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్‌లో కరెంటు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక్కడున్న రెండు యూనిట్లలో వరుసగా టెక్నికల్ సమస్యలు తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులో 1100 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఉంది. అయితే సోమవారం అనూహ్యంగా 500 మెగావాట్ల యూనిట్ 1 బాయిలర్ ట్యూబ్‌లో లీకేజీ ఏర్పడింది. దీంతో కేటీపీపీలో రెండు యూనిట్లలో 1100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి నిలిచిపోయింది. ఒక్కరోజుకు రూ.5కోట్ల నష్టం వస్తుందని అధికారులు తెలిపారు.

భూదాన్ భూముల కోసం రైతుల ధర్నా

ఖమ్మంటౌన్, వెలుగు :

ఖమ్మం నగరం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ యజ్ఞ బోర్డుకు సంబంధించిన భూములు తమవేనని రైతులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ యజ్ఞ బోర్డు 148,149 సర్వే నెంబర్లలోని భూములు తమవేనని, వాటిని తమకే కేటాయించాలంటూ ఖమ్మం అర్బన్ మండలంలో ని పుట్టకోట, రుద్రమకోట, గోపాలపురానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. ధర్నా చౌక్ లో వినూత్న రీతిలో నాగలి మోస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆ భూములు తమ తాత, ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిందని, పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని అన్నారు. ఆ భూములను కేటాయించే వరకూ నిరసనలు ఆపేది లేదని స్పష్టం చేశారు. కలెక్టర్, తహసీల్దార్ ఆ రికార్డులను పరిశీలించి తమకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.





దోస్త్ మేరా దోస్త్

కుక్కతో పాటు కనిపిస్తున్న వ్యక్తి పేరు రాజు. ఈయన రిక్షా నడుపుతూ ఉంటాడు. ఏడేళ్లుగా ప్రతి పనిలో ఈ కుక్క తన వెంటే ఉంటుంది. తనకు అన్ని విధాలా సహకరిస్తుంది. ఆయన రిక్షాలో కూర్చుంటే ఆ శునకమే లాగుతూ ఆయన్ను ఇంటి వరకు తీసుకెళ్తుంది. వీరి మధ్య ఉన్న అనుబంధాన్ని చూస్తూ అందరూ ఆశ్చర్యపోతుంటారు. - వెలుగు, ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్

జూనియర్ కాలేజీలు దరఖాస్తు చేసుకోవాలి

అదనపు సెక్షన్లు, గుర్తింపు ఆన్‌లైన్‌లోనే: ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్ కాలేజీల గుర్తింపు రెన్యూవల్, అదనపు సెక్షన్ల అనుమతులకోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. ఎలాంటి ఫైన్ లేకుండా ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కాలేజీ యాజమాన్యాలకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వెయ్యి రూపాయల ఫైన్‌తో ఫిబ్రవరి 12 వరకు, మూడు వేల ఫైన్‌తో ఫిబ్రవరి 25 వరకు, ఐదువేల ఫైన్‌తో మార్చి 8 వరకు, 10 వేల ఫైన్‌తో మార్చి 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. వివిధ కోర్సుల్లో అదనపు సెక్షన్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని అశోక్‌కుమార్‌చెప్పారు.

అసెంబ్లీ ఎన్నికలపై మాట్లాడతామని భయమా?

- అఖిలపక్షంతో ఈసీ భేటీ నిర్వహించాల్సిందే
- పీసీసీ నేత నిరంజన్ డిమాండ్

హైదరాబాద్, వెలుగు: ఓటర్ల జాబితా సవరణపై అన్ని పార్టీలతో మీటింగ్ ఎందుకు నిర్వహించడం లేదని పీసీసీ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు నిరంజన్ ప్రశ్నించారు. ప్రతి పార్టీతో 10 నిమిషాల పాటు విడిగా సంప్రదింపులు చేస్తామని లేఖ పంపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని నిలదీశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని పార్టీలతో ఒకేసారి ఉమ్మడిగా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆఫీసర్లు రాష్ట్రానికి వచ్చినప్పుడు మాత్రమే పార్టీలతో విడివిడిగా భేటీ అవుతారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై చర్చ జరగకుండా తప్పించుకోవడానికే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఆనవాయితీ ప్రకారమే అఖిలపక్ష మీటింగ్ ఏర్పాటు చేయాలని సీఈవో రజత్ కుమార్‌కు లేఖ రాశానని, ఫోన్ కూడా చేశానని తెలిపారు.



గొడవలొద్దు ఎన్నికలు చూడండి

కార్యకర్తలతో మాజీ మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్, వెలుగు : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో విభేదాలు పక్కనపెట్టి ఏకతాటిపై నిలవాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యకర్తలకు సూచించారు. సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో కొల్లాపూర్‌ను ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కార్యకర్తలు వర్గాలుగా విడిపోకుండా పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో టీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు.



జిల్లాకు ముగ్గురు కొత్త జడ్జీలు

నల్లగొండ, వెలుగు : ఏపీ, తెలంగాణ హైకోర్టు విభజన నేపథ్యంలో జిల్లాకు కొత్తగా ముగ్గురు జడ్జీలు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా జడ్జిగా పనిచేసిన ఎస్.శశిధర్ రెడ్డి నల్లగొండ జిల్లా ప్రధాన జడ్జిగా వచ్చారు. కృష్ణాజిల్లా న్యూజివీడులో పని చేసిన ఎస్.వెంకటేశ్వర ప్రసాద్‌ను మొదటి అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో పనిచేసిన వెంకటేశ్వర రావు మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కొత్తగా వచ్చిన ముగ్గురు న్యాయమూర్తులకు ఎస్పీ ఏవీ రంగనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలిటిక్స్ కన్నా డెవలప్‌మెంట్‌పైనే దృష్టి

ఇప్పటికే ఆరు పంచాయతీలు ఏకగ్రీవం

ఏకగ్రీవాలు వంద దాటే చాన్స్



ఏకగ్రీవం వైపే పల్లె చూపు

సంగారెడ్డి, వెలుగు:

గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు గిరిజనులు అడుగులు వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ లేకుండా సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు స్థానాలను ఏకగ్రీవం చేసుకొని రాజకీయాలకు దూరంగా ఉండేందుకు సమష్టిగా కృషి చేస్తున్నారు. సోమవారం నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఐక్యతతో చర్చిస్తూ పోటీ లేకుండా శాంతియుత వాతావరణానికి దోహద పడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 647 పంచాయతీలలో ఇటీవల 190 కొత్తగా ఏర్పడ్డాయి. ఇందులో 74 తండాలు వందశాతం ఉండగా మరో 19 ఎస్టీకి రిజర్వయ్యాయి. ఈ 93 ఎస్టీ పంచాయతీలలో చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే కంగ్టి, కల్హేర్‌తో పాటు పుల్‌కల్ మండలంలో ఐదు పంచాయతీలను ఏకగ్రీవం చేస్తూ గ్రామస్థులు తీర్మానించారు. ప్రభుత్వం అందించే రూ.10 లక్షల ప్రోత్సాహకాన్ని అందుకొని గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. 93 పంచాయతీల్లో సగానికి పైగా ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో 65 గ్రామాలు, జహీరాబాద్ పరిధిలో 18 , సంగారెడ్డి పరిధిలో 25 పంచాయతీలలో చర్చలు జరుగుతున్నాయి.

కొత్త పంచాయతీలలో ...

జిల్లాలో ఏర్పడిన కొత్త పంచాయతీలు గిరిజనులను ఆదర్శంగా తీసుకొని ఏకగ్రీవం వైపు ముందుకు సాగుతున్నాయి. 190 పంచాయతీల్లో తండాలతో పాటు ఎస్సీ, జనరల్ కేటాయింపులు జరిగిన గ్రామాలున్నాయి. గత ఎన్నికల్లో 62 గ్రామాలు ఏకగ్రీవం కాగా ఈ సారి ఆ సంఖ్య వందకు దాటే అవకాశం కనిపిస్తోంది. తాజాగా ఆరు పల్లెలు ఏకగ్రీవమయ్యాయి. కంగ్టి మండలంలో కొత్తగా ఏర్పడిన పంచాయతీ ఎడ్లరేగడితండా, కల్హేర్ మండలంలోని బల్కంచెల్క తండా , పుల్‌కల్ మండలంలోని గొంగ్లూర్ తండా, బద్రిగూడెం, మిన్‌పూర్ తండా, జిన్నారం మండలంలోని లక్ష్మీపతిగూడెంలను ఏకగ్రీవం చేస్తూ గ్రామస్థులు తీర్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికను ఏకగ్రీవం చేశారు. అయితే 50 ఎస్టీ పంచాయతీలు గల నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎక్కువ శాతం గ్రామాలు ఏకగ్రీవమయ్యే అవకాశం కనిపిస్తున్నాయి. మొదటి దఫా ఎన్నికలు జరిగే గ్రామాలలో రెండు రోజుల్లో ఏకగ్రీవ పంచాయతీలపై స్పష్టత రానున్నది.

మా కళను కాపాడండి సారూ



ప్రజావాణిలో ఫిర్యాదు చేయడానికివచ్చిన కిన్నెర వాయిద్య కళాకారులు

- ప్రజావాణిలో కిన్నెర వాయిద్య కళాకారుల విజ్ఞప్తి

మహబూబ్‌నగర్/ గద్వాల/ వనపర్తి , వెలుగు : 'అంతరించిపోతున్న మా కళను కాపాడండి సారూ' అంటూ కిన్నెర వాయిద్య కళాకారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి పాలమూరు మండలం సత్యమన్న కాలనీకి చెందిన కిన్నెర వాయిద్య కళాకారులు వచ్చి గోడు వెళ్లబోసుకున్నారు. తమను కళాకారులుగా గుర్తించి పింఛన్, ఇళ్లు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోశప్ప అధికారులను కోరారు. అనంతరం సమావేశ మందిరం బయట కిన్నెర వాయించి కాసేపు అలరించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం ప్రజావాణి అనంతరం అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులతో పాటు పరిష్కరించిన వాటిని కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పరిష్కరింప బడని వాటి వివరాలు, కారణాలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమీక్షకు రావాలని సూచించారు.

ప్రతి అధికారి శ్రద్ధ చూపాలి

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో ప్రతి అధికారి శ్రద్ధ చూపాలని వనపర్తి జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి ఆదేశించారు. వనపర్తి కలెక్టర్ కార్యాలయంలో 78 మంది కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు వివరించుకున్నారు. వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులకు అప్పగించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అపూర్వరావుకు 11 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న నాయకులు

అయిజను డివిజన్ చేయాలి

గద్వాల, వెలుగు : అయిజను రెవెన్యూ డివిజన్ చేయాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అయిజ రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో గద్వాల కలెక్టరేట్‌కు చేరుకొని, కలెక్టర్ శశాంకకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు పాలన చేరువ చేసేందుకు కొత్త జిల్లాలు మండలాలు, డివిజన్ల ఏర్పాటు చేసిన ప్రభుత్వం అన్ని సౌకర్యాలున్న అయిజను కూడా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే ప్రతిపనికి గద్వాలకు వెళ్లాల్సి వస్తుందని, ఖర్చు, సమయం వృథా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రామచంద్రారెడ్డి, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.





ఇదేమి విచిత్రమో..

180మంది ఎస్సీలున్న ఎల్లగిరిలో ఒక్కవార్డు రిజర్వ్ కాలేదు ■ ఎల్లంబావిలో ఐదుగురు ఉన్నా ఒక్క వార్డు రిజర్వ్

యాదాద్రి, వెలుగు:

పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు విచిత్రంగా ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో చిత్రం చోటుచేసుకుంది. ఎల్లగిరి గ్రామంలో ఎస్సీ జనాభా 180 ఉన్నప్పటికీ, ఒక్క వార్డును వారికి రిజర్వు చేయలేదు. కొత్తగా ఏర్పాటైన ఎల్లంబావి గ్రా మపంచాయతీలో ఐదుగురే ఎస్సీలున్నప్పటికీ, 3వ వార్డులను ఎస్సీలకు రిజర్వు చేశారు. ఇది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎల్లగిరిలో 117ఎస్సీ ఓటర్లు ఉన్నప్పటికీ, ఒక్క వార్డును రిజర్వు చేయకపోవడంతో ఎస్సీలు అధికారుల తీరుపై మండిపోతున్నారు. ఎల్లంబావిలో ఐదుగురే ఓటర్లు ఉన్నప్పటికీ రిజర్వు చేయడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

చిన్న పొరపాటు వల్లే...

ఎల్లంబావి, ఎల్లగిరి పంచాయతీల్లో పొరపాటు వల్లే రిజర్వేషన్ల ఖరారులో తప్పిదం వల్లే విచిత్ర పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఎల్లగిరి పంచాయతీ పరిధిలో ఎస్సీ జనాభా 180, ఓటర్లు 117మంది ఉన్నారు. 56ఓట్లు పురుషులవి కాగా, 61ఓట్లు మహిళలవి. ఎల్లంబావిలో ఎస్సీ జనాభా 8మంది. ఓట్లు -5. పురుషుల-1, మహిళలు-4, మిగతా వాళ్లు పిల్లలు. కాగా, రిజర్వేషన్ల ఖరారు సమయంలో అధికారులు ఎల్లంబావిలో ఎస్సీ జనాభాను 105మంది, ఎల్లగిరిలో ఎస్సీ జనాభా ఏమి లేదని చూపి పొరపాటు చేసినట్టు అర్థమవుతుంది. ఎల్లంబావిలో 105ఎస్సీ జనాభా చూపిన అధికారులు ఓట్లు మాత్రం 5గానే చూపించారు. ఎల్లగిరిలో ఎస్సీ జనాభా ఏమి లేదని చూపినప్పటికీ, ఓటర్లు మాత్రం 117చూపించారు. స్థానికులు ఎస్సీలు చౌటుప్పల్ ఆర్డీఓ ఫిర్యాదు చేయగా, ఈ సంఘటనను వెలుగు చూసింది.

చంద్రమ్మ, లేదంటే మైసమ్మ

ఎల్లంబావి గ్రామంలో ఐదుగురే ఓటర్లు ఉన్నప్పటికీ, 3వ వార్డును ఎస్సీలకు రిజర్వు చేయడంతో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఐదుగురు ఓటర్లలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. వీరిలో ముగ్గురు మహిళలు, ఒక యువకుడు ఉన్నారు. ఈ కుటుంబంలో కుటుంబ పెద్ద చంద్రమ్మ 90ఏళ్లకు పై బడి ఉంది. ఈమె కూతురు ప్రభుత్వ ఉద్యోగి. ఈమె కొడుకు, కోడలులకు ముగ్గురు పిల్లలు. పోటీకీ అనర్హులు. దీంతో ఈ కుటుంబం నుంచి చంద్రమ్మే పోటీకి అర్హురాలు. మరో కుటుంబానికి చెందిన మైసమ్మకు ఎలాంటి ఆధారం లేదు. ఈమె కూడా వృద్ధురాలే. ఆస్తిపాస్తులు లేవు. పాచి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. వీరిద్దరే పోటీకి అర్హులు కావడంతో, వీరిద్దరూ పోటీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే ఎవరో ఒకరికి ఏకగ్రీవం చేయాలి. మైసమ్మ ఎలాగు పోటీ చేసే పరిస్థితో లేదు కాబట్టి చంద్రమ్మే ఏకగ్రీవమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

≡ క్విక్ బైట్స్



మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో ఉన్న పాత కార్లు

కొత్త కార్లు చేతికి.. పాత కార్లు మూలకి..

కొత్త గజ్జెలు తెచ్చుకున్నా పాత గజ్జెలు పైలంగ పెట్టుకుంటం. లేదంటే ఎవలకన్న అమ్ముకుంటం. నూరు రూపాయల గజ్జెలనే ఇంత పైలంగ జూసుకుంటే లక్షల రూపాయల కార్లను ఇంకెంత బాగ జూసుకోవాలె. కింద పనిజేసే సిబ్బంది గుండు పిన్నుల తెచ్చినా లెక్కలు అడిగే పెద్దాఫీసర్లు లక్షల విలువైన కార్లను మాత్రం పట్టించుకుంటలేరు. ఫార్చునర్ల, ఇన్నోవా వంటి కొత్త కార్లను సర్కారు ఇవ్వడంతో పాత కార్లను ఇట్ల మూలకు పడేసిండ్రు. రిపేరు జేసి రెంటుకిచ్చినా, సెకండ్ హ్యాండ్‌ల అమ్మినా పైసలొస్తుండె.. వట్టిగనే ఖరాబైతున్నయ్ జర పట్టించుకొండి సార్లు.

మహబూబ్‌నగర్, వెలుగు:



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఎగ్జిబిట్లను తిలకిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సైన్స్ ఎగ్జిబిషన్ మొదలైంది

సంగారెడ్డి, వెలుగు : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు 2019 కోసం సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో 360 ఎగ్జిబిట్లు ప్రదర్శనకు వచ్చాయి. రాష్ట్ర స్థాయి ఎంపిక కోసం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ మొదలైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వి. హనుమంతరావు ప్రారంభించారు. బాల శాస్త్రవేత్తలుగా నిరూపించుకునేందుకు ఈ ఎగ్జిబిషన్ దోహద పడనుంది. ఆన్‌లైన్ ద్వారా మొత్తం 470 ఎగ్జిబిట్ల కోసం స్టూడెంట్స్ దరఖాస్తుచేసుకోగా ఇందులో 360 ప్రదర్శనకు వచ్చాయి. మెదక్ జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ కూడా సంగారెడ్డిలో నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో 210, మెదక్ జిల్లా పరిధిలో 150 వివిధ రకాల ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఎగ్జిబిట్‌కు సైన్స్ ఇన్‌స్పైర్ అవార్డుతో పాటు రూ.10 వేల బహుమతి అందజేస్తారు. ఇది వరకు సంగారెడ్డి జిల్లా నుంచి ఇద్దరు బాల శాస్త్రవేత్తలు తమ ఎగ్జిబిట్లను జాతీయస్థాయిలో ప్రదర్శించి అవార్డు పొందారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు: సోమవారం అట్టహాసంగా ప్రారంభమైన సైన్స్ ఎగ్జిబిషన్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ స్కూల్ స్టూడెంట్స్ నిర్వహించిన కల్చరల్ ప్రోగామ్స్ ఆకట్టుకున్నాయి. ఎగ్జిబిట్లను చూసిన వారిలో జిల్లా కలెక్టర్‌తోపాటు జడ్పీ సీఈఓ రవి, ఎన్ఐఎఫ్ జాతీయ పరిశీలకురాలు మౌనిత గోరాయ్, అధికారులు ఉన్నారు.



కొత్తగూడెంలో కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సింగరేణి అధికారులు

ప్లీజ్.. సమ్మె వద్దు

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు :

- సమ్మెతో సింగరేణికి రూ.వంద కోట్లకు పైగా నష్టం
- కార్మికులు కోల్పోయే వేతనం రూ.40కోట్లు
- గుర్తింపు సంఘంతో కంపెనీ చర్చలు


సింగరేణి కార్మికులు సమ్మెకు వెళ్లొద్దంటూ కంపెనీ యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది. సమ్మె కారణంగా సంస్థకు రూ.వంద కోట్లకు పైగా నష్టం వాటిల్లుతుందని, కార్మికులు సుమారు రూ. 40కోట్లు కోల్పోయే అవకాశముందని అంటోంది. సోమవారం హెడ్డాఫీస్ నుంచి కంపెనీ డైరెక్టర్లు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమ్మె వల్ల కలిగే నష్టంపై కార్మికులకు అవగాహన కల్పించాలని వారు ఆదేశించారు. ఈ నెల 8, 9 తేదీల్లో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎమ్మెస్‌తో పాటు ఇఫ్టూ వారం రోజులుగా బొగ్గు గనుల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. కాగా సమ్మెతో సింగరేణికి దాదాపు రూ. 106 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని, దాదాపు రూ.40 కోట్ల మేర వేతనాలను కార్మికులు కోల్పోతారని తెలుపుతూ సింగరేణి వ్యాప్తంగా యాజమాన్యం పోస్టర్లతో ప్రచారం చేపట్టింది. మరోవైపు గుర్తింపు సంఘం నేతలతో యాజమాన్యం ఏరియాల వారీగా చర్చలు సాగిస్తోంది. ఇప్పటికే వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కొంత వెనుకబడి ఉన్నాము, సమ్మెతో లక్ష్య సాధనకు మరింత ఆటంకం కలుగుతుందంటూ యాజమాన్యం యూనియన్ నేతలకు వివరిస్తోంది. ఇదిలా ఉంటే కార్మికవర్గం సమ్మెను విజయ వంతం చేయాలని ఆయా సంఘాలు కోరుతున్నాయి. సమ్మె నేపథ్యంలో గనుల వద్ద యాజమాన్యం పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తోంది.

కార్మికులూ ఆలోచించండి

దేశ వ్యాప్త సమ్మెతో సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధం లేదని, కార్మికులు ఆలోచించాలని కంపెనీ డైరెక్టర్లు ఎస్ చంద్రశేఖర్, భాస్కర్‌రావు, జీఎం పర్సనల్ ఆనందరావు కోరారు. సోమవారం కొత్తగూడెం హెడ్డాఫీస్ నుంచి సింగరేణి వ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమ్మె ప్రభావం లేకుండా కార్మికులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

మిర్యాలగూడ మండలంలోని తుంగపాడు గ్రామంలో ఇటీవల తవ్వకాల్లో బయటపడిన విష్ణుమూర్తి విగ్రహాన్ని వారసత్వ శాఖ నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్ సోమవారం పరిశీలించారు. ఈ విగ్రహం 13 శతాబ్దానికి చెందిన కళ్యాణీ చాళుక్యుల కాలానికి చెందిందని తెలిపారు.

- మిర్యాలగూడ, వెలుగు





నోట్ల రద్దు ఎఫెక్ట్.. ఇంకా కోలుకోని కూలీ

పెద్ద నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను షాక్‌కి గురిచేసింది. నగదు లావాదేవీల పైనే ఆధారపడే నిర్మాణరంగ కూలీలనైతే కోలుకోలేని విధంగా దెబ్బకొట్టింది. ఈ ఫీల్డ్‌లో పనిచేసే కూలీల ఆరోగ్యం, వారి పిల్లల చదువు డీమానిటైజేషన్‌తో తారుమారయ్యాయి. ఆ ప్రభావం నేటికీ కొనసాగుతున్నట్లు 'డీమానిటైజేషన్: ఫ్రం డెప్రివేషన్ టు డెస్టిట్యూషన్'స్టడీలో తేలింది.

నిర్మాణ రంగంలో వర్కర్లకి డైలీ పేమెంట్లను ఎక్కువగా క్యాష్ రూపంలోనే చేస్తారు. డీమానిటైజేషన్ ప్రభావం కూలీల ఆరోగ్యంపై బాగా పడింది. హెల్త్ పాడైతే లేబర్ ఇక పని చేయలేరు. రెక్కాడితే గానీ డొక్కాడలేని పేదరికం స్థాయి నుంచి బయట పడలేరు. సాయం చేసేవారు కూడా ఉండకపోవటం వల్ల వాళ్లు లైఫ్‌లో బాగుపడలేరు.

అనారోగ్యానికి గురైన లేబర్ పెద్ద నోట్ల రద్దు వల్ల పనులు దొరక్క, డబ్బులు లేక సరిగా మందులు వాడలేదు. కొందరు గోళీలను లేట్‌గా కొని వేసుకొనేసరికి రోగం ముదిరింది. అది తగ్గటానికి మరింత ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చింది. వైద్యం ఆలస్యం కావటంతో జబ్బుల నుంచి కోలుకునే ఛాన్సులూ తగ్గాయి. కొంత మంది కెమిస్ట్‌లు మొదట్లో కొన్ని రోజుల పాటు పాత నోట్లు తీసుకున్నా చాలా చోట్ల దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొనేది. వర్కర్లకు రోజువారీ ఖర్చులు పోను చేతిలో మిగిలే డబ్బులు తక్కువ. కొంత మందికైతే వచ్చినవి వచ్చినట్లే సరిపోతాయి. అందువల్ల సమయానికి మెడిసిన్స్ కొనుక్కొని వాడేవాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఆరోగ్యపరంగా చూస్తే కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్ చాలా వరకు మగవాళ్లకే సూటబుల్. ఇటుకలు, ఇసుక, సిమెంట్, సెంట్రింగ్ కర్రలు తదితర బరువైన నిర్మాణ సామగ్రిని పైఅంతస్తులకు మోయటం ఆడవాళ్లకు కొంచెం కష్టంతో కూడిన పని. దీంతో వాళ్లు తేలిగ్గా అలిసిపోతున్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు వస్తున్నాయి. దీనికితోడు టయానికి మందులు వేసుకునే వీలుండట్లేదు. ఈ రంగంలోని 55 శాతం మంది స్త్రీల హెల్త్ పెద్ద నోట్ల రద్దుతో దిగజారింది.

పని కోసం అడ్డాల దగ్గర కూలీలు గంటల పాటు ఎండలో నిలుచోవాల్సి వస్తోంది. అక్కడ తాగటానికి నీళ్లు, తినటానికి తిండి, టాయిలెట్లు వంటివి ఉండవు. ఇవి ఆడవాళ్ల ఆరోగ్యంపై మరింత ప్రతికూల ప్రభావం చూపాయి. ఆస్పత్రికి వెళ్లొచ్చేసరికి పొద్దు నెత్తి మీది కొచ్చి పని దొరకదేమో అని లేబర్ భయపడుతుంటారు. డీమానిటైజేషన్ వల్ల ఈ ఆందోళనలు తారాస్థాయికి చేరాయి. పెద్ద నోట్లు రద్దైన 2016 నవంబర్ నుంచి 2017 జనవరి వరకు (మూడు నెలల్లో) హెల్త్ బాగలేక హాస్పిటల్‌లో చేరాలనుకున్న వారిలో పాతిక శాతం మందిపై డీమానిటైజేషన్ ఎఫెక్ట్ పడింది. రోగుల దగ్గర కొత్త నోట్లు లేక ఆస్పత్రుల్లో చేరటం సాధ్యపడలేదు. ఇలా ఇబ్బందిపడ్డవాళ్లలో 57 శాతం మంది ఆడవాళ్లే. ఈ అసౌకర్యానికి గురైనవాళ్లు కొంత మంది తోటి కూలీల వద్ద, కాంట్రాక్టర్ల దగ్గర డబ్బులు బదులు తీసుకున్నారు. కాంట్రాక్టర్లు బదులు రూపంలో కాకుండా వడ్డీకి ఇచ్చి ఆ మొత్తాన్ని ముక్కుపిండి వసూలు చేశారు.

నిర్మాణ కూలీల వద్ద సర్‌ప్లస్ మనీ ఉండదు కాబట్టి రోగమొస్తే గవర్నమెంట్ దవాఖానాలకే వెళతారు. 45.9 శాతం మందిది ఇదే పరిస్థితి. ప్రైవేట్ హాస్పిటల్స్‌కి, క్లినిక్‌లకి పోయేవాళ్లు 41.5 శాతం మంది. మిగతావాళ్లు ఆస్పత్రికి వెళ్లకుండా మెడికల్ షాపుల్లో కొనే మందులతోనే బండి లాగించారు. పెద్ద నోట్లు రద్దయిన మొదటి మూడు నెలల్లో దాదాపు 12 శాతం మంది వర్కర్లు ప్రైవేట్ ఆస్పత్రులకు బదులు గవర్నమెంట్ హాస్పిటల్‌కే వెళ్లారు. వీరిలో ఆడవాళ్లే ఎక్కువ మంది ఉండటం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులపైనా పెద్ద నోట్ల రద్దు ప్రభావం పడింది.

ఈ బాధలకు అక్షర రూపం

ఆర్థికవేత్త రీతు దేవాన్, రాధా సెహగల్ అనే రీసెర్చర్‌తో కలిసి అధ్యయనం చేశారు. ప్రైమరీ డేటా ఆధారంగా జరిగిన ఈ స్టడీ ఫలితాలను 'డీమానిటైజేషన్: ఫ్రం డెప్రివేషన్ టు డెస్టిట్యూషన్' పేరుతో చిన్న బుక్ రూపంలో విడుదల చేశారు. నిర్మాణ పనులు పీక్ స్టేజ్‌లో ఉండే ఏప్రిల్, మే నెలల్లో ఈ పరిశోధన నిర్వహించారు. మహారాష్ట్రలోని 'యాక్షన్ ఎయిడ్' సపోర్ట్ కూడా తీసుకున్నారు. పెద్ద నోట్ల రద్దు.. హెల్త్, ఎడ్యుకేషన్, ఫుడ్ కన్జప్షన్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపిందో క్వాంటిటేటివ్ బేసిస్‌లో డాక్యుమెంటేషన్ రూపంలోకి తేవటమే రచయితల ఉద్దేశం.

బడికి 'ప్రతిజ్ఞ' బహుమతిచ్చాడు


బడిగంట కొట్టగానే విద్యార్థులందరూ బారులుతీరి "భారతదేశం నా మాతృభూమి/ భారతీయులందరూ నా సహోదరులు/ నేను నా దేశమును ప్రేమించుచున్నాను..." అంటూ ప్రతిజ్ఞ చదువుతారు. మన హృదయాల్లో అణుఅణువునా దేశభక్తిని ఉప్పొంగించే ఆ ప్రతిజ్ఞ రాసింది మరెవరో కాదు నల్లగొండ జిల్లా వాసి పైడిమర్రి వెంకటసుబ్బారావు.

ఆయన జీవిత చరిత్ర హిందీ అనువాదం 'భారత్ మేరీ మాతృ భూమి హై' పుస్తకాన్ని ఇవాళ (జనవరి 8న) ఆవిష్కరిస్తున్న సందర్భంగా..

భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన సమైక్యదేశం మన ఇండియా. బహుళత్వమే మన బలమని చాటిచెప్పిన జాతీయ గీతాల్లో 'ప్రతిజ్ఞ'ది ముఖ్యపాత్ర. పైడిమర్రి రచించిన ప్రతిజ్ఞలో చిన్నారుల్ని భవిష్యత్తు వైపునకు పరుగులు తీయించే పదనిసలున్నాయి. గురజాడ భావజాలం, శ్రీశ్రీ అభ్యుదయ వాదం కూడా ప్రతిజ్ఞలో కన్పిస్తాయి. 1962లో ఆయన ప్రతిజ్ఞని రచించారు. ఇంగ్లీష్, హిందీ భాషల్లోకి అనువాదమైన ఆ ప్రతిజ్ఞను 1965 నుంచి దేశవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో ఆలపిస్తున్నారు. పైడిమర్రి పేరు తల్చుకుంటే దాశరథి గీతంలోని 'ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' చరణం గుర్తుకొస్తుంది. నీతి నిజాయితీగల ప్రభుత్వ ఉద్యోగిగా, కవి, రచయిత, సంగీత విద్వాంసుడు, వైద్యుడు, బహుభాషా కోవిదుడిగా పైడిమర్రి పేరు పొందారు. పైడిమర్రి వెంకటసుబ్బారావు1916 జూన్ 10న నల్లగొండ జిల్లా, అన్నేపర్తిలో జన్మించారు. చిన్నప్పటి నుంచీ కష్టాలు ఎదురైనా, నిస్వార్థంగా పనిచేసి పైకొచ్చారు. చిన్న చిన్న పాటలతో మొదలైన ఆయన సాహితీ ప్రస్థానంలో తొలుత ఆధ్యాత్మిక రచనలు, తర్వాత 'మనిషికెంత భూమి కావాలి' లాంటి విప్లవాత్మక రచనలు చేశారు. ఆయనకు హిందీ, సంస్కృతం, ఇంగ్లీష్, ఉర్దూ, అరబ్బీ వంటి భాషల్లో పట్టు ఉంది. రచనల్లో సంగపురీ నృసరి శతకం, గీతా మీమాంస, బాలరామాయణం, శ్రీవెంకటేశ్వర స్తుతి, దైవభక్త మీమాంసాత్రయం గ్రంథాలతోపాటు కాలభైరవుడు అనే నవల, ఉషస్సు పేరుతో కథాసంపుటి కూడా ఉన్నాయి. జమీందారి, భూస్వామ్య వెట్టిచాకిరి పద్ధతుల్ని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. అయితే 'నౌకరి', 'పిల్లిపోడు' అనే రెండు కథలు మాత్రమే ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. సమకాలీన సమస్యలను చర్చిస్తూ పలు పత్రికలకు వ్యాసాలూ రాశారాయన.

సుబ్బారావుపైఎలికట్టె శంకరరావు సంపాదకీయంలో 'ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రి' అనే పుస్తకం వెలువడంది. పైడిమర్రి చరిత్రని విజిఎస్ ప్రచురణసంస్థ 'భారత దేశం నా మాతృ భూమి' పేరుతో ప్రచురించింది.ఆ పుస్తకం ఇంగ్లీష్‌లోకి కూడా అనువాదమైంది. దాన్నే ఇప్పుడు 'భారత్ మేరా మాతృభూమి హై' పేరుతో హిందీలోకి అనువదించారు తిరువూరుకు చెందిన హిందీ టీచర్ రేపాక రఘునందన్. పైడిమర్రి జీవిత చరిత్ర హిందీ అనువాదానికి ప్రముఖ కవులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వెన్నా వల్లభరావు, పాశం యాదగిరి, కె.ఎస్. లక్ష్మణరావు తదితరులు సహకరించారు. దేశవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో 'ప్రతిజ్ఞ' ఆలపిస్తున్నప్పటికీ తెలుగు రాష్ట్రాలలోని పుస్తకాల్లో మాత్రమే ప్రతిజ్ఞ వద్ద ఆయన పేరు కనిపిస్తుంది. జీవితాంతం ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ సేవ చేసిన పైడిమర్రి పేరును అన్ని భాషల పాఠ్యపుస్తకాలలో ముద్రించినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. ఈ దిశగా పాలకులు కృషిచేయాలి.

– మందడపు రాంప్రదీప్, టీచర్.




పైడిమర్రి రాసిన భారత జాతీయ ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

ఏమన్నారంటే


ప్రశాంత కశ్మీరం



జమ్ముకశ్మీర్ ప్రస్తుతం చాలా ప్రశాంతంగా ఉంది. మారణహోమాలు, రాళ్లదాడులు లేవిప్పుడు. పట్నా లాంటి సిటీలో జరిగే నేరాలకంటే తక్కువ కేసులు నమోదవుతున్నాయి.

– సత్యపాల్ మాలిక్, జమ్ముకశ్మీర్ గవర్నర్.

రాజకీయాలు మాత్రమే వార్తలా?



జనరల్ ఎలక్షన్ అనేసరికి మిగతా ఇంపార్టెంట్ విషయాలను వదిలేస్తుంది ఇండియన్ మీడియా. ఎంతసేపు రామమందిర నిర్మాణం, ఆలయాల్లోకి మహిళల ప్రవేశం లాంటి ఇష్యూస్‌నే కవర్ చేస్తుండటం నాకైతే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

– అమర్త్యసేన్, ఆర్థికవేత్త




రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్

ఈ నెల 26న జరగనున్న ఇండియా గణతంత్ర దినోత్సవానికి 20 రోజుల ముందుగానే ప్రాక్టీస్ మొదలైంది. న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో రిపబ్లిక్ డే పరేడ్ రిహార్సల్స్ చేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ భద్రతా సిబ్బంది.

కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ప్రాబ్లమ్స్ తీరేనా?

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 11 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్నవారి జీతాలను 75% పెంచుతున్నట్లు 2018 ఏప్రిల్‌లో ఉన్నత విద్యాశాఖ జీవో(నంబర్ 11) జారీచేసింది. వర్సిటీల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ సమస్యలను పరిష్కారిస్తామన్న సీఎం కేసీఆర్ హామీ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ల సమావేశం జరిగిన తర్వాతే జీవో నంబర్11 జారీ అయిందన్న సంగతి తెలిసిందే. నాటి సమావేశంలో యూనివర్సిటీల్లో టీచింగ్, రీసెర్చ్‌లకు అవసరమైనంత మంది లెక్చరర్లులేరన్న విషయాన్ని అందరూ అంగీకరించారు. ఆయా యూనివర్సిటీల్లో డిపార్ట్‌మెంట్లవారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను పంపాల్సిందిగా ఉన్నత విద్యా శాఖ వైస్ చాన్స్‌లర్లను ఆదేశించింది. ఈ ప్రక్రియ నడుస్తుండగానే, సర్వీసు ప్రాతిపదికన తమనే పర్మనెంట్ ఎంప్లాయీస్‌గా గుర్తించాలంటూ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుమల రావు నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యుల ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. సమస్యలపై అధ్యయనం చేసి ప్రొఫెసర్ తిరుపతి రావు కమిటీ రెండు నెలల వ్యవధిలోనే తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. వీటన్నింటి ఫలితంగానే జీవో నెంబర్ 11 జారీ అయింది. అయితే సదరు జీవోలోని నిబంధనలను అనుసరించి కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని రెండు(రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు)గా విభజించారు. ఈ విభజన.. 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న' సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. జీవో నెంబర్ 11 లో స్పష్టత కొరవడిన కారణంగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బోధిస్తోన్న కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకి అన్యాయం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీ అవలంబించిన విధానాలనే రాష్ట్రంలోని మిగతా యూనివర్సిటీలూ స్వీకరించాయి. 'ఉస్మానియాలో ఇలా చేశారు, అలా చేశారు కాబట్టి మేమూ అదే చేస్తాం' అంటూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ సమస్యలు తీర్చడానికి ముందుకురాలేదు. అధ్యాపకులను రెండు వర్గాలుగా కాకుండా అందరికీ సమానంగా వేతనాలు చెల్లించాలని, ఆమేరకు ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 11 విశ్వవిద్యాలయాలలో మొత్తం 1528 మంది కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. వీరిలో ఉస్మానియా యూనివర్సిటీలో 441మంది, కాకతీయ యూనివర్సిటీలో 197, తెలంగాణ వర్సిటీలో 51, జేఎన్‌టీయూలో 294, ఎంజీయూలో 51, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్సిటీలో 18 మంది, శాతవాహన వర్సిటీలో 45 మంది, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో 167 మంది, పాలమూరు విశ్వవిద్యాలయంలో 136, తెలుగు యూనివర్సిటీలో 30 మంది పని చేస్తున్నారు.


– డాక్టర్. ఆర్. ఆదిరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ.

ఇలా చేస్తేనే ఫలితం సాధిస్తాం

'లెప్రసీ పేషెంట్లకు సంబంధించి మన దగ్గరున్న లెక్కలన్నీ పాసివ్ రిపోర్టుల రూపంలో వచ్చినవే. దీనికంటూ దేశవ్యాప్తంగా ఒక విధానం లేదు. కేసుల గుర్తింపు మొదలు ట్రీట్‌మెంట్ సెంటర్ల పెంపు దాకా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్, ప్రైవేట్ సెక్టార్లను కూడా ఈ మిషన్‌లో భాగస్వాములను చేయాలి. వీలైనంత ఎక్కువగా ఎన్‌జీవోల సహాయం తీసుకోవాలి. పొగాకు నియంత్రణ (యాంటీ టొబాకో) ఉద్యమం స్థాయిలో యాంటీ లెప్రసీ మూమెంట్ రూపొందాలి. పేదల్లో పౌష్టికాహార లోపాలను తగ్గించాలి. గట్టి సంకల్పంతో ఇలా చేస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలొస్తాయి'

- అషీమ్ చొవ్లా, చీఫ్ ఎగ్జిక్యూటివ్, లెప్రా సొసైటీ సికింద్రాబాద్.

లెప్రసీ లేదంటే ఎట్లా?






లెప్రసీ (కుష్టువ్యాధి)ని ఇండియా నుంచి తరిమేశామని కేంద్ర ప్రభుత్వం 2005లోనే సంబురాలు చేసుకుంది. అప్పటిదాకా బాగా పనిచేసిన శాఖలను దాదాపు ఎత్తేసింది. ఇందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో లెప్రసీ రక్కసి విస్తరిస్తూపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.35 లక్షల మంది కుష్టు రోగులున్నారు. అయినాసరే వాళ్లను గుర్తించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు.

మహమ్మారి లెప్రసీ ఇండియాలోకి మళ్లీ వచ్చింది. ఆరోగ్య శాఖ అధికారులు, యాక్టివిస్టులు మాత్రం 13 ఏండ్ల కిందటే కంట్రీ నుంచి లెప్రసీని ఎలిమినేట్ చేసేశామని ప్రకటించేశారు. హెల్త్ మినిస్ట్రీ ఆధ్వర్యంలోని సెంట్రల్ లెప్రసీ డివిజన్ 2017లో కొత్తగా 1,35,485 లెప్రసీ కేసుల్ని డిటెక్ట్ చేయడం వార్నింగ్ బెల్స్‌ను మోగించినట్లైంది. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరికి కుష్టువ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నది. లెప్రసీ ఇంత ప్రమాదక స్థాయిలో వ్యాపిస్తున్నా ప్రభుత్వాలు మాత్రం కండ్లు మూసుకుని కూర్చున్నాయి. ఎందుకంటే వాళ్ల దృష్టిలో లెప్రసీ ఎప్పుడో ఎలిమినేట్ అయిపోయింది మరి.

మైక్రోబ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా సోకే కుష్టు వ్యాధి చర్మంతోపాటు నాడీ వ్యవస్థపైనా ఎఫెక్ట్ చూపెడుతుంది. మైకో బ్యాక్టిరియం లెప్రే శరీరంలోకి ప్రవేశించిన తర్వాత ఇంకుబేషన్ పీరియడ్(వ్యాధి పొదిగే కాలం) ఐదు నుంచి ఏడేండ్ల దాకా ఉంటుంది. దీంతో ప్రాథమిక దశలో వ్యాధి లక్షణాలను గుర్తించడం కాస్త కష్టమవుతుంది. కాబట్టే రోగుల పెరగడానికి మరింత ఆస్కారం ఏర్పడుతోంది. మొదటి దశలోనే లెప్రసీని గుర్తించి, మల్టీ డ్రగ్ థెరపీని అందిస్తే నూరు శాతం నయమవుతుంది.

నిర్మూలనకు నాశనానికి తేడా గుర్తించరా?

1983లో నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించిన ఇండియా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నుంచి భారీ మొత్తంలో నిధులు పొందింది. తీసుకున్న డబ్బులు ఏమయ్యాయో, ఎక్కడ ఖర్చయ్యాయోగానీ కుష్టును నిర్మూలించేశామని 2005లో హడావిడిగా ప్రకటన చేసింది. టెక్నికల్‌గా చూస్తే, కేసుల శాతం 0.01గా ఉంటే ఆ దశను నిర్మూలించినట్లుగానే డబ్ల్యూహెచ్‌వో భావిస్తుంది. 100 కోట్లకు పైబడిన జనాభాలో 0.01 శాతం(లక్షల మంది) అనేది చిన్న సంఖ్యేమీ కాదన్న విషయం ప్రభుత్వానికి పట్టలేదు. 2005కు ముందు అంతో ఇంతో పనిచేసిన కుష్టు నిర్మూలన యంత్రాంగం ఆ తర్వాతి కాలంలో పడకెక్కింది. అప్పటిదాకా లెప్రసీ డివిజన్‌లో పనిచేసిన ఉద్యోగులను ఆరోగ్య శాఖలోని వేర్వేరు డివిజన్లకు కేటాయించారు. సిబ్బంది లేని కారణంగా కొత్త కేసులను గుర్తించడం కష్టతరంగా మారింది. పైన చెప్పుకున్న 1.35 లక్షల కేసులు కూడా అధికారికంగా గుర్తించినట్లు అంగీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. రాష్ట్రానికి ఒక తీరుగా ఉండే కుష్టు వ్యాధి గ్రస్తుల లెక్కలను కేంద్ర ప్రభుత్వం కలగలిపి చూస్తుండం కూడా సమస్యగానే మారింది. ఉదాహరణకు పేదరికం ఎక్కువగా కనిపించే ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాల్లో లెప్రసీ కేసులు ఎక్కువగా ఉన్నాయి. హెల్త్ ఇండెక్స్‌లో ముందుండే కేరళ లాంటి రాష్ట్రాల్లో ఆ ప్రభావం తక్కువగా ఉంది. పాలసీలు వేరువేరుగా రూపొందిస్తే తప్ప అన్ని చోట్లా వ్యాధిని నిర్మూలించలేం. నిజానికి మన ప్రభుత్వాలు లెప్రసీ నిర్మూలనకు(ఎలిమినేషన్), లెప్రసీని సమూలంగా నాశనం చేయడానికి(ఎరాడికేషన్)కు మధ్య తేడాను తెలుసుకోలేకపోతున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలకూ కుష్టువ్యాధి సోకదు. ఈ మహమ్మారికి బలవుతోన్న వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే గరీబులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. పౌష్టికాహారలేమి వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. అప్పుడు శరీరంలో మైక్రోబ్యాక్టీరియం లెప్రే లాంటి బ్యాక్టీరియాలు వేగంగా ప్రభావం చూపుతాయి. అంటే మంచి ఆహారాన్ని అందజేయడం లెప్రసీ నిర్మూలనా మిషన్‌లో అంతర్భాగంగా ఉండితీరాలి. ఇండియాలో ప్రస్తుత పాలకులకు అలాంటి ఆలోచనేదీ లేనట్లుంది.



లెప్రసీ వ్యాధి కారక 'మైక్రోబ్యాక్టీరియం లెప్రే' బ్యాక్టీరియా

కేసుల గుర్తింపే అసలు సమస్య

ఊరూరా తిరిగి ఎవరెవరికి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నాయో కనిపెట్టడం కష్టతరంగా మారింది. యంత్రాంగం, సిబ్బంది లేకపోవడం ప్రధాన సమస్య. అసలు చెకప్ చేయించుకోడానికి రోగులే ముందుకు రాకపోవడం ఇంకో సమస్య. కుష్టు నిర్ధారించాలంటే ఒళ్లు మొత్తాన్ని క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఒంట్లో ఏ మూల ఏ చిన్న మచ్చ దేనికారణంగా ఏర్పడిందో తెలుసుకోవాలి. వైద్యపరీక్షలప్పుడు దుస్తులు తొలగించేందుకు మహిళలు సుముఖత చూపడంలేదు. చాలా మంది మగవాళ్లదీ అదే పరిస్థితి. ఆరోగ్యపరిరక్షణకు సంబంధించి మిగతా వ్యవస్థల్లో ఉన్నట్లు గ్రామానికో ఉద్యోగిని తప్పనిసరిగా నియమిస్తే కొంతలో కొంత మార్పు రావచ్చు. ఇదంతా ఒక ఎత్తైతే, కొత్త కేసులను గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరిస్తుండటం అన్నింటికన్నా పెద్ద సమస్యగా తయారైంది. ఇండియాలో లెప్రసీ ఉందని అంగీకరించినంత మాత్రాన మన కిరీటాలేవీ పడిపోవు. కండ్ల ముందే లక్షల మంది చనిపోతుంటే చూస్తూ కూర్చోవడం కన్నా నిజాన్ని నిర్భయంగా ఎదుర్కోవడమే ఉత్తమమని యాక్టివిస్టులు మొత్తుకుంటూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా 2017లో గుర్తించిన కేసుల్లో దాదాపు సగం(అంటే67,160) మంది రోగులకు వ్యాధి అడ్వాన్స్ స్టేజ్‌లో ఉంది. ఇవి కాకుండా కొత్త కేసుల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో 2016 నాటికి 2,025గా ఉన్న కుష్టు వ్యాధి కేసుల సంఖ్య 2017లో 2,910కి పెరిగింది. ఇండియాలో వ్యాధి పెరుగుదలను ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సైతం గుర్తించింది. ప్రపంచ వ్యాప్తంగా 2015-2016లో కొత్తగా నమోదైన కేసుల్లో 60 శాతం ఇండియాలోనే నమోదుకావడం గమనార్హం.

లెప్రసీని జయించిన రచనా కుమారి

ఇండియాలో లెప్రసీ వ్యతిరేక పోరాటం గురించి చెప్పుకున్న ప్రతిసారి రచనా కుమారిని గుర్తు చేసుకోవాలి. బిహార్‌లోని ముంగేర్ ప్రాంతానికి చెందిన ఆమెకు 18 ఏండ్ల వయసులో పెండ్లైంది. 21 ఏండ్ల నాటికి ఇద్దరు పిల్లల తల్లి. అప్పటిదాకా సజావుగా సంతోషంగా సాగిన జీవితంలో కుష్టు కలకలం రేపింది. డయాగ్నసిస్ టెస్టులో(2014లో) ఆమెకు వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అత్తింటివాళ్లు ఆమెను బయటికి వెళ్లగొట్టారు. పుట్టింటివాళ్లు కూడా దగ్గరికి రానివ్వలేదు. హృదయవిదారక స్థితిలో తనకు తానే ధైర్యం చెప్పుకున్న రచన ఒంటరిగానైనా వ్యాధితో పోరాడాలని డిసైడైంది. పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా లెప్రసీపై పోరాటాన్ని కొనసాగించింది. కుష్టు సోకినవాళ్లను చిన్నచూపు చూసే సమాజంలో మార్పు కోసం నడుంకట్టింది. ఆ ప్రయత్నంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం రచన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ యాంటీ లెప్రసీ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తోంది. కుష్టువ్యాధి సోకినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని, భయపడకుండా ముందుకొచ్చి వైద్యం చేయించుకుంటే నయమవుతుందని ఊరూరా తిరిగి ప్రచారం చేస్తోంది. పోలియో నిర్మూలన లాగా అందరూ కలిసి వస్తే లెప్రసీని తరిమేయడం కష్టమైన పనేమీ కాదని, కుష్టు అంటూ లేని ప్రపంచాన్ని చూడటమే తన లక్ష్యమని రచనా చెబుతారు.

టాకీస్
ప్రభాత వెలుగు 09
మంగళవారం | హైదరాబాద్
08.01.2019
www.v6velugu.com
Follow: v6velugu

ఫొటో ఫీస్ట్



ప్రపంచమంతా ఆమె అందం వైపు రెప్ప వేయకుండా చూస్తుంది. మరి తన కలువ రేకుల్లాంటి కనులు విప్పార్చి ఆమె ఎవరి కోసం చూస్తోందో. ఐష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటో ఇది.

ఈవెంట్



త్వరలో జరగనున్న ఇళయరాజా 75వ కాన్సర్ట్ లోగో ఆవిష్కరణ చెన్నైలో ఘనంగా జరిగింది. విశాల్, పార్థిబన్, నాజర్ వంటి ప్రముఖులంతా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో మ్యాస్ట్రోతో ముచ్చట్లాడుతోన్న విశాల్.

గప్‌చుప్



'విజేత'తో ఎంట్రీ ఇచ్చిన కళ్యాణ్ దేవ్ రీసెంట్‌గా రెండో సినిమా మొదలు పెట్టాడు. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా సాయిపల్లవిని అడిగితే నో అన్నదనే వార్తలు వచ్చాయి ఆ మధ్య. ఆ సంగతి నిజమో కాదో తెలీదు కానీ ప్రస్తుతం మరో అమ్మాయి ఫిమేల్ లీడ్‌గా ఎంపికయ్యిందని తెలుస్తోంది. 'జిలేబీ' చిత్రంతో హాట్ గాళ్‌గా పాపులర్ అయిన రియా చక్రవర్తిని కళ్యాణ్ పక్కన హీరోయిన్‌గా ఎంపిక చేశారట. ఇదైనా నిజమో కాదో మరి.

ట్విటర్ టాక్



"మనం ఒకలా బతకాలనుకుంటాం. కానీ అలా బతకడం సాధ్యపడే విషయమేనా? ఎందుకంటే ఇక్కడ భావనల కంటే బతుకు పోరాటమే ముఖ్యం. మన జీవితంలో ఎక్కువ సమయం శక్తిని, రక్తాన్ని ధారపోసి లక్ష్యాలను అందుకోవడానికే సరిపోతోంది కదా! ఆలోచించండి."

– ఉదయ్ చోప్రా, బాలీవుడ్ నటుడు



సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ సినిమా

వెంకటేశ్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి రూపొందించిన చిత్రం 'ఎఫ్ 2'. దిల్‌రాజు నిర్మాత. ఈనెల 12న విడుదల. ఈ చిత్ర ట్రెయిలర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రామానాయుడు స్టూడియోస్‌లో జరిగింది.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ట్రైలర్‌లో చూసిన నవ్వులు కొన్నే. సినిమాలో రెండు గంటల ఇరవై ఆరు నిముషాల పాటు నవ్వులున్నాయి. హీరో హీరోయిన్లు నలుగురూ ఈ సినిమాకి నాలుగు పిల్లర్స్. వారి నడుమ ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్‌తో కూడిన ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్విస్తుంది' అన్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ 'కెరీర్ మొత్తంలో నేను ఎంతయితే కామెడీ చేద్దామనుకున్నానో, అదంతా ఈ ఒక్క సినిమాలో చేయించాడు అనిల్. కామెడీ సీన్స్ ఇరగదీసే వెంకీ గారితో కలసి నటించడమంటే ప్రారంభంలో టెన్షన్ ఉండేది. కానీ ఆయన సపోర్టుతో నటించాను. థియేటర్లో కుదురుగా సీట్లో కూర్చోలేనంత కామెడీ ఉంటుంది' అన్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ 'మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ వంటి చిత్రాల తర్వాత నేను నటించిన పూర్తిస్థాయి కామెడీ సినిమా ఇది. అందరికీ మంచి క్యారెక్టర్స్ డిజైన్ చేశాడు అనిల్. సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ సినిమా ఇది' అన్నారు. మెహరీన్ మాట్లాడుతూ 'వెంకీ సార్, వరుణ్, తమన్నాలతో స్క్రీన్ షేర్ చేసుకోవడం సంతోషంగా ఉంది. తొలిసారి డబ్బింగ్ చెప్పాను. నా పాత్ర అందరికీ నచ్చుతుంది' అని చెప్పింది. తమన్నా మాట్లాడుతూ 'దిల్‌రాజు గారు విడుదల చేసిన 'హ్యాపీడేస్' తర్వాత నా కెరీర్‌కి హ్యాపీడేస్ వచ్చాయి. ఆయన బ్యానర్‌లో నటించడం ఇప్పటికి కుదిరింది. షూటింగ్ మినహా సెట్‌లో ఎవరితోనూ కలవనంటూ నాకో చెడ్డ పేరుంది. కానీ ఈ సెట్‌లో ఎక్కువ సమయం గడిపాను. ఎన్నో సినిమాలు, పాత్రలు చేసినా వెంకీ గారు ఇప్పటికీ ఫ్రెష్‌గా, ముద్దుగా ఎలా కనిపిస్తున్నారో అర్థం కాదు. ఎలాంటి క్యారెక్టరైనా చేసేసే వరుణ్‌కి నేను ఫ్యాన్‌ని. మెహరీన్ అద్భుతంగా నటించింది' అని చెప్పింది. దిల్‌రాజు మాట్లాడుతూ ''రాజా ది గ్రేట్' తర్వాత అనిల్ ఈ స్టోరీ ఐడియా చెప్పాడు. అతనితో మూడు సినిమాలైనా చిన్న వివాదం కూడా రాలేదు. సినిమాలో ప్రతి క్యారెక్టర్ నుంచి థియేటర్‌లో నవ్వులు వస్తూనే ఉంటాయి. సంక్రాంతి అందరికీ ఫన్ ఇస్తూ విజయం సాధిస్తుంది' అంటూ భరోసా వ్యక్తం చేశారు. ఝాన్సీ, మిర్చి కిరణ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాలను కాదని థియేటర్స్ ఇవ్వలేం: దిల్ రాజు

ఇటీవల ఓ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో కొందరు తొందరపడి స్టేట్మెంట్స్ ఇచ్చారు. ఆరు నెలల క్రితమే ఈ మూడు క్రేజీ తెలుగు సినిమాలు సంక్రాంతికి వస్తున్నట్టు ప్రకటించడం జరిగింది. ఆ మూడింటికే థియేటర్స్ ఎలా సర్దుబాటు చేసుకోవాలా అని పంపిణీదారులు, నిర్మాతలం సతమతమవుతున్నాం. అలాంటి సమయంలో పదిహేను రోజుల క్రితం ఓ సినిమా హక్కులు కొనుక్కొచ్చి సంక్రాంతికి అని ప్రకటించారు. మూడు తెలుగు సినిమాలు ఉన్నప్పుడు పక్క రాష్ట్రం నుంచి వచ్చే సినిమాకి థియేటర్స్ ఎలా సర్దుబాటవుతాయి? అదే నిర్మాత ఈ నాలుగు నెలల్లో 'నవాబ్', 'సర్కార్' అనే రెండు డబ్బింగ్ చిత్రాలు విడుదల చేశాడు. అప్పుడు ఎన్ని థియేటర్స్ అవసరమో అన్నింటిలో విడుదల చేశారు. అప్పుడలా విడుదల చేసి, ఇప్పుడు థియేటర్స్ దొరకడం లేదని అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారు. 18 నుంచి థియేటర్స్ పెరుగుతాయి అన్నారు. అలాంటప్పుడు అదే తేదీకి విడుదల చేస్తే వారికి ఎక్కువ థియేటర్స్ లభిస్తాయి కదా. ఇలాంటివి ఆలోచించకుండా పిచ్చి పిచ్చి మాటలతో నోరు జారడం సరి కాదు. సంక్రాంతి సీజన్‌లో తెలుగు సినిమాలను కాదని వేరే సినిమాకు థియేటర్స్ ఇచ్చే పరిస్థితి లేదు.



థియేటర్లలో ఎన్టీఆర్ విగ్రహాలు

ఒకప్పుడు ఏదైనా భక్తిరస సినిమాలు విడుదలైతే థియేటర్లలో ఆ దేవుడి విగ్రహాలు పెట్టేవారు. ప్రేక్షకులు సినిమా చూసి తృప్తిగా బైటికొచ్చి, భక్తితో ఆ విగ్రహానికి ఒక నమస్కారం పెట్టి వెళ్లేవాళ్లు. కదలివచ్చిన కనకదుర్గ , అమ్మోరు, దేవీ లాంటి సినిమాలు విడుదలయినప్పుడు దుర్గమ్మ విగ్రహం, నాగేంద్రుడి పుట్ట, అమ్మోరు విగ్రహాలు థియేటర్లలో వెలిశాయి. ఆ తర్వాత అలాంటి సినిమాలు రాలేదు, ఆ సంప్రదాయమూ కనబడలేదు. కానీ చాలా యేళ్ల తరువాత మళ్లీ అది జరగనుంది. అయితే ఈసారి దేవత విగ్రహం కాదు, తమ అభిమాన నాయకుడు ఎన్టీయార్ విగ్రహాన్ని థియేటర్లలో చూడబోతున్నారు అభిమానులు. బాలకృష్ణ హీరోగా, క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కథానాయకుడు' ప్రపంచవ్యాప్తంగా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిన వంద సినిమా హాళ్లలో ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. తొలి విగ్రహాన్ని బాలకృష్ణ, విద్యాబాలన్, కళ్యాణ్ రామ్ లు తిరుపతి పీజీఆర్ థియేటర్లో నేడు ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత అన్ని విగ్రహాలనూ థియేటర్లలో పెడతారు. అంటే ఎన్టీఆర్ అభిమానులకు థియేటర్ లోపలే కాదు, బయట కూడా ఇక కనుల పండుగేనన్నమాట.

మోడీ మస్తున్నడు



బాలీవుడ్‌లో వరుస బయోపిక్స్ తెరకెక్కుతూనే ఉన్నాయి. అయితే కొద్ది రోజుల క్రితం వరకూ వీటితో వచ్చిన సమస్య ఏమీ లేదు. ఎందుకంటే స్పోర్ట్స్, సినిమా, హిస్టారికల్ బయోపిక్స్ మాత్రమే వచ్చాయి. కానీ ఇప్పుడు పొలిటికల్ బయోపిక్స్ మొదలయ్యాయి. ఆల్రెడీ 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' విషయంలో గొడవ జరుగుతోంది. అంతలోనే మోడీ బయోపిక్ అనౌన్స్ చేశారు. అంతేకాదు... ఆయన వెండితెర మీద ఎలా ఉంటాడో అప్పుడే చూపించేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ జీవితం ఆధారంగా ఒక చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నద్ధమయ్యాడు బాలీవుడ్ దర్శకుడు ఒమంగ్ కుమార్. ప్రధాన పాత్రధారిగా వివేక్ ఒబెరాయ్‌ని ఎంచుకున్నాడు. మోడీగా వివేక్ సూటవుతాడా అని కొందరు అనుమాన పడ్డారు కానీ ఆ సెలెక్షన్ కరెక్టేనని ఈ ఫస్ట్ లుక్ చూశాక అందరికీ అర్థమయ్యింది. అసలితను వివేక్ ఒబెరాయేనా అన్నంతగా ట్రాన్స్‌ఫామ్ అయ్యాడు వివేక్. అతడి తండ్రి సురేష్ ఒబెరాయ్, సందీప్ సింగ్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమా విషయంలో పెద్ద చర్చలే జరుగుతున్నాయి. మన్మోహన్ సింగ్‌ని డమ్మీ ప్రైమ్ మినిస్టర్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నందుకు ఆ సినిమాని బ్యాన్ చేయమంటున్నారు. మరి మోడీ గురించి నిజాలు నిర్భయంగా తీస్తే ఊరుకుంటారో లేదో చూడాలి.



ఈవిడే విజయమ్మ

వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన 'యాత్ర' చిత్రం ఫిబ్రవరి 8న విడుదల కానుంది. వైఎస్సార్ పాత్రలో వెర్సటైల్ యాక్టర్ మమ్ముట్టి నటిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఆయన అర్ధాంగి పాత్రను ఎవరు పోషిస్తున్నారన్న విషయంలో సందేహం ఉంది. అది ఇప్పుడు తీరింది. విజయమ్మ పాత్రలో ఆశ్రిత వేముగంటి నటించింది. ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు చిత్రబృందం. అచ్చు గుద్దినట్టు విజయమ్మలానే ఉందామె. అలాగే 'యాత్ర' సెకెండ్ ట్రెయిలర్‌ని కూడా రిలీజ్ చేశారు. మొదటి ట్రెయిలర్‌లాగే ఇది కూడా ఒక ఇంటెన్సిటీతో ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కొత్తవారితో నిన్ను తలచి



వంశీ, స్టెఫీ పటేల్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకత్వం వహించాడు. ఎస్.ఎల్.ఎం. ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. కొత్త వారితో తాము నిర్మిస్తోన్న ఈ సినిమాతో అందరికీ పేరు రావాలని ఆశిస్తున్నానన్నారు నిర్మాత అజిత్. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్స్ చాలా బాగా నటించారు, మంచి సంగీతం కుదిరింది. షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలియజేశారు. హీరో హీరోయిన్లతో పాటు గీత రచయిత పూర్ణాచారి కూడా పాల్గొన్నారు.

సిగ్నల్ ఇచ్చింది



పోయిన సంవత్సరం 'స్త్రీ' సినిమాతో పెద్ద హిట్టే కొట్టిన శ్రద్ధాకపూర్... ఈ యేడు ఆ సక్సెస్‌ని కచ్చితంగా కంటిన్యూ చేస్తానంటోంది. ప్రస్తుతం మూడు సినిమాల షూటింగులతో బిజీబిజీగా ఉంది శ్రద్ధ. ప్రభాస్‌తో కలిసి 'సాహో'లో యాక్షన్ సీక్వెన్సులు చేస్తోంది. నితీష్ తివారీ డైరెక్షన్లో 'చిచోరే' మూవీలో నటిస్తోంది. మరోపక్క సైనా నెహ్వాల్ పాత్రలో కూడా పరకాయ ప్రవేశం చేస్తోంది. ఇవింకా షూటింగ్ దశలో ఉండగానే మరో సినిమాకి ఎస్ చెప్పింది. రెమో డిసౌజా తీయనున్న 'ఏబీసీడీ 3' సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది శ్రద్ధ. పాకిస్థానీ డ్యాన్సర్ పాత్ర పోషించాల్సిన కత్రినా తప్పుకోవడంతో ఈ ప్రాజెక్టు వార్తల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఆ రోల్‌కి సారా అలీ ఖాన్‌ని తీసుకున్నారనే వార్తలు కూడా వచ్చాయి. కానీ చివరికి ఆ రోల్ చేయడానికి శ్రద్ధాకపూర్ కన్‌ఫర్మ్ అయ్యింది. ఆల్రెడీ 'ఏబీసీడీ 2'లో తన డ్యాన్సులతో ఇంప్రెస్ చేసింది శ్రద్ధ. కాబట్టి ఆమే బెటరని ఫీలై ఉంటాడు రెమో. ఏమైతేనేం... శ్రద్ధ సూపర్బ్ డ్యాన్స్ చూసే అవకాశం మరోసారి దొరికింది ఫ్యాన్స్‌కి.


నెక్ గుడ్ల ధరలు (100కు)

	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.453	రూ.5.15
వరంగల్	రూ.455	రూ.5.15

మార్కెట్

సెన్సెక్స్ 155 35,850

నిఫ్టీ 44 10,771



సెన్సెక్స్ 155 పాయింట్లు అప్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిస్థితులతోపాటు అమెరికా–చైనా మధ్య వాణిజ్యయుద్ధం తగ్గుముఖం పట్టడంతో దేశీయ మార్కెట్లలో సోమవారం ఉత్సాహం కనిపించింది. సెన్సెక్స్ 155 పాయింట్లు పెరిగింది. ఒకదశలో 36 వేల మార్కును తాకినా, లాభాల స్వీకరణ, యూరప్ మార్కెట్లలో వీక్‌ట్రెండ్ వల్ల 35,850 స్థాయికి పరిమితమయింది. గత శుక్రవారం సెన్సెక్స్ 181 పాయింట్లు పెరిగింది. ఇక నిఫ్టీ 44.45 పాయింట్ల లాభంతో 10,771 స్థాయికి ఎగబాకింది. రియల్టీ, టెక్, ఐటీ, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ స్టాక్‌లు లాభాల్లో ముగిశాయి. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధమని అమెరికా, చైనా ప్రకటించడం మార్కెట్లలో ఉత్సాహం నింపింది. దీనికితోడు అమెరికా ఉద్యోగ గణాంకాల డేటా సానుకూలంగా ఉండటంతో షేర్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.240.60 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశాయి.

డబ్బుంటేనే మాఫీ చేయాలి..

లేకపోతే రుణ విధానం దెబ్బతింటుంది

లిక్విడిటీ సమస్య చాలా వరకు పరిష్కారమయింది

ఎంఎస్‌ఎంఈలను బ్యాంకులు ఆదుకోవాలి

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్



రుణ మాఫీతో ఇబ్బందే

న్యూఢిల్లీ: పలు రాష్ట్రాలు వ్యవసాయ రుణాలను మాఫీ చేయడాన్ని ఆర్‌బీఐ విమర్శించింది. ఇలాంటి చర్యల వల్ల రుణ విధానం దెబ్బతింటుందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఇటీవల కాంగ్రెస్ గెలిచిన మూడు రాష్ట్రాల్లో సాగు రుణాలను మాఫీ చేస్తున్నట్టు ఆయా ప్రభుత్వాలు ప్రకటించిన నేపథ్యంలో కాంత్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. శక్తికాంత్ ఢిల్లీలో సోమవారం చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రుణాల మాఫీపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ "అప్పులను రద్దు చేసే అధికారం రాష్ట్రాలకు ఉంటుంది. సాగు రుణాల మాఫీ వంటి నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆర్థిక పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాలి. అప్పులను మాఫీ చేసి ఆ డబ్బును బ్యాంకులకు విడుదల చేయగల సామర్థ్యం ఉన్నదీ లేనిదీ చూసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు వస్తాయి" అని కాంత్ అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు రూ.1.47 లక్షల కోట్ల విలువైన రుణాలను మాఫీ చేశాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్ ప్రభుత్వాలు కూడా 2017లో వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించాయి. కర్ణాటక ప్రభుత్వం గత ఏడాది అప్పులను మాఫీ చేసింది. ఇదిలా ఉంటే, రూ.రెండువేల నోట్లపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు కాంత్ బదులు ఇవ్వలేదు. ఈ విషయమై ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇది వరకే వివరణ ఇచ్చినందున, తాను చెప్పేది ఏమీ లేదని అన్నారు. ప్రస్తుతం తగినన్ని రూ.రెండు వేల నోట్లు అందుబాటులో ఉన్నందున, వీటి ముద్రణను తాత్కాలికంగా నిలిపివేశామని కేంద్ర ప్రభుత్వం గత వారం ప్రకటించింది. ప్రస్తుత కరెన్సీలో 35 శాతం వాటా రూ.రెండు వేల నోట్లదేనని కేంద్ర ఆర్థిక వ్యవహారాలశాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గర్గ్ అన్నారు.

తేదీ తరువాత వెల్లడిస్తాం..

మధ్యంతర డివిడెండ్ గురించి ప్రస్తావించగా, ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నాక తేదీని తెలియజేస్తామని అన్నారు. గతంలో ఇచ్చినట్టే ఈసారి కూడా మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కేంద్రం ఆర్‌బీఐని కోరింది. గత ఏడాది ఆర్‌బీఐ రూ.10 వేల కోట్ల డివిడెండ్ చెల్లించింది. మొండిబకాయిలను తొలగించుకోవడానికి బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించారా ? అని అడిగిన ప్రశ్నకు అలాంటిది ఏమీ లేదని శక్తికాంత దాస్ అన్నారు. లిక్విడిటీపై మాట్లాడుతూ "ఆర్థిక వ్యవస్థలో నగదు కొరత పరిష్కారానికి ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతానికి నగదు నిల్వల సమస్య చాలా వరకు తీరింది. లిక్విడిటీపై తరచూ సమీక్ష చేస్తున్నాం. దీనిపై బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలతో భేటీ అవుతాను. ఎంఎస్‌ఎంఈల పునర్నిర్మాణం కోసం వచ్చే రుణాల దరఖాస్తుల సాధ్యాసాధ్యాలను బ్యాంకులు పరిశీలించాలి. ఆర్థిక వ్యవస్థలోకి నగదును పంపించడం అవసరాలను బట్టి ఉంటుంది. ఆర్‌బీఐ తగినంత నగదు నిల్వలను ఉంచుతుంది" అని శక్తికాంత దాస్ వివరించారు.

ప్రభుత్వానికి రూ.40 వేల కోట్ల డివిడెండ్ ?

మధ్యంతర డివిడెండ్‌పై దాస్ విలేకరులకు ఏమీ చెప్పనప్పటికీ, ఈ ఏడాది మార్చికల్లా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్ల వరకు మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని ఆర్‌బీఐ వర్గాలు తెలిపాయి. పన్నుల వసూళ్ల తగ్గినందున, ఆర్‌బీఐ ఇచ్చే మొత్తంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి వీలు కలుగుతుంది. జీడీపీలో ద్రవ్యలోటు 3.3 శాతం ఉండటంతో ఆర్‌బీఐ నిధులు ప్రభుత్వానికి ఎంతో కీలకం. ఫిబ్రవరి ఒకటిన జైట్లీ బడ్జెట్ ప్రవేశపెడతారని, ఆలోపే డివిడెండ్ చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటామని ఆర్‌బీఐ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నిధుల బదలాయింపు గురించి ఆర్‌బీఐకి, కేంద్రానికి మధ్య ఇటీవల ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా చేశారు. దీంతో శక్తికాంత దాస్‌ను ఆయన స్థానంలో నియమించారు.

సత్యం బద్దలై పదేళ్లు

హైదరాబాద్, వెలుగు : ఐటీలో రారాజుగా వెలుగొందుతున్న సత్యం కంప్యూటర్ సర్వీసెస్ లిమిటెడ్ స్కామ్ జరిగి సరిగ్గా పదేళ్లయింది. కంపెనీ ఎకౌంట్స్‌లో అవకతవకలకు పాల్పడ్డానంటూ ఛైర్మన్ బైర్రాజు రామలింగ రాజు జనవరి 7, 2009 నాడు చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని, స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లను నివ్వెరపోయేలా చేసింది. ఏడు వేల కోట్ల మేర కంపెనీ ఎకౌంట్స్‌లో మోసం చేసినట్లు రాజు ఆ రోజు అంగీకరించారు. సత్యం కంప్యూటర్ స్కామ్ ఇండియా స్టాక్ మార్కెట్లో పెద్ద కుదుపునే తీసుకొచ్చింది. రామలింగ రాజు ప్రకటన టైమ్‌కి రూ. 180 వద్ద వున్న సత్యం షేర్ ఒక్కసారిగా రూ. 76 కు కుప్పకూలడమే కాకుండా, ఆ రోజు సెన్సెక్స్‌ను 7 శాతం కిందకి లాగింది. ఎప్పటికప్పుడు మెరుగైన పనితీరు ప్రదర్శనకు ఇన్వెస్టర్ల డిమాండ్ పెరగడంతో, ఒత్తిడికి లోనైన తాను కంపెనీ ఎకౌంట్లలో ఈ ఆర్థిక అక్రమాలకు పాల్పడవలసి వచ్చినట్లు రాజు వెల్లడించారు. ఇది పులి మీద స్వారీ చేయడం లాంటిదని, ఆ పులి తినేయకుండా బైట పడటం ఎలాగో తెలియరాలేదని రాజు ఆరోజు ప్రకటనలో తెలిపారు. ఐటి దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రోల తర్వాత నాలుగో స్థానానికి సత్యం కంప్యూటర్ సర్వీసెస్ చేరుకోగలిగింది. అంతేకాదు, ఆ కంపెనీ ఛైర్మన్ రామలింగ రాజు ఐటి రంగంలో మేటిగా పేరు పొందారు. కార్పొరేట్ గవర్నెన్స్‌లో ఎన్నో అవార్డులు కూడా సత్యం దక్కించుకోవడం విశేషం. రాజు ప్రకటనకు కొన్ని నెలల ముందే గ్రూప్‌లోని ఇన్‌ఫ్రా కంపెనీ మేటాస్‌ను టేకోవర్ చేయాలని సత్యం ప్రతిపాదించింది. ఐటి రంగంలోని సత్యం ఇన్‌ఫ్రాలోని మేటాస్‌ను ఎందుకు టేకోవర్ చేయాలని సత్యం ఇన్వెస్టర్లు ప్రశ్నించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ టేకోవర్ అహేతుకమైనదిగా అభివర్ణించారు. సత్యం ఎకౌంట్స్‌లో అవకతవకలను సరిదిద్దుకునేందుకు పరిష్కార మార్గంగానే మేతాస్ టేకోవర్‌ను ప్రతిపాదించినట్లు విశ్లేషకులు చెబుతారు. ఎసెట్లు ఎక్కువగా వున్న మేటాస్ ఇన్‌ఫ్రా చేతిలో వుంటే, ఎకౌంట్లను మరికొంత కాలంపాటు సమర్థంగా మేనిప్యులేట్ చేయొచ్చనేదే రాజు ఆలోచన అని వ్యాఖ్యానించారు. మేటాస్ టేకోవర్ ప్రతిపాదనను సత్యం ప్రకటించిన రోజు సాయంత్రం అమెరికా మార్కెట్లో ఇన్వెస్టర్లు మూకుమ్మడిగా సత్యం షేర్లను అమ్మేశారు. సత్యం షేర్ ధర తగ్గిపోవడంతో మేటాస్ టేకోవర్ అసాధ్యంగా మారింది. ఆ తర్వాత రోజు ఉదయమే రాజు తన తప్పు ఒప్పుకోలును ప్రకటించారు.

టెక్‌మహీంద్రా చేతికి......

స్కామ్ బయటకు వచ్చాక ఇండిపెండెంట్ డైరెక్టర్లు, ఆడిటర్లు, బ్యాంకింగ్ భాగస్వాములతో సత్యం సంబంధాలు ఒకటొకటిగా ప్రపంచానికి తెలిశాయి. స్కామ్ నాటికి పీడబ్ల్యూసీ స్టాట్యుటరీ ఆడిటర్. ఆ తర్వాత కాలంలో ఈ ఆడిట్ ఫర్మ్ ఇండియా విభాగం మీద యుఎస్ సెక్యూరిటీస్ కమిషన్ 60 లక్షల డాలర్ల జరిమానా విధించింది. ఇండియాలో ఏ లిస్టెడ్ కంపెనీకి రెండేళ్లపాటు ఆడిటర్‌గా వుండరాదని పీడబ్ల్యూసీని 2018 లో సెబీ ఆదేశించింది. స్కామ్ నేపథ్యంలో కంపెనీ డైరెక్టర్ల బోర్డును సీఎల్‌బీ రద్దు చేసింది. 10 మందితో కొత్త బోర్డును నియమించింది. ఇండియన్ ఐటి పరిశ్రమకు చెడ్డ పేరు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అప్పటి కార్పొరేట్ ఎఫైర్స్ మంత్రి ప్రకటించారు. 2009 ఏప్రిల్‌లో టెక్ మహీంద్రా పబ్లిక్ ఆక్షన్ విధానంలో 46 శాతం వాటా కొనుగోలు చేసింది. దాంతో ఇండియాలో ఐదో పెద్ద ఐటి ఎక్స్‌పోర్టర్‌గా అవతరించింది. తర్వాత 2013 లో టెక్ మహీంద్రాలో సత్యం కంప్యూటర్‌ను విలీనం చేశారు.



సెబీ ఫైన్, ఏడేళ్ల జైలు ...

స్కామ్ వెలువడిన వెంటనే రామలింగ రాజు, ఆయన తమ్ముడు రామరాజులను 2009 లోనే పోలీసులు అరెస్టు చేశారు. సీబీఐ ఛార్జ్ షీటు దాఖలు చేయడంలో విఫలమవడంతో 2011 లో సుప్రీం కోర్టు నుంచి ఇద్దరూ బెయిల్ పొందారు. రాజు మీద రూ. 1,849 కోట్ల జరిమానాతోపాటు, 14 ఏళ్లపాటు మార్కెట్ల నుంచి నిషేధాన్ని కూడా సెబీ విధించింది. ఇండియన్ పీనల్ కోడ్‌లోని వివిధ చట్టాల కింద రాజు, మరో 9 మందిని ఈ కేసులో దోషులుగా 2015 లో తేల్చిన హైదరాబాద్ కోర్టు, ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. బెయిల్ మీదున్న రామలింగ రాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోనే వుంటున్నారు.

వచ్చే ఏడాది రెండు మోడల్స్ తెస్తాం

న్యూఢిల్లీ: మనదేశంలోనే అతిపెద్ద కార్ల కంపెనీ మారుతీ సుజుకీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండు కొత్త మోడల్స్‌ను విడుదల చేస్తామని ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రెండు కొత్త మోడళ్లను ప్రవేశపెట్టింది. కొత్త భద్రతా నిబంధనలను అనుగుణంగా కొత్త వాహనాల్లో ఎయిర్‌బ్యాగ్స్, సీట్‌బెల్ట్ రిమైండర్, రివర్స్ పార్కింగ్ సెన్సర్లను అమర్చుతామని కంపెనీ ఛైర్మన్ ఆర్సీ భార్గవ తెలిపారు. కొత్త మోడల్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగో క్వార్టర్‌లో (వచ్చే నెల) విడుదల చేస్తామని వెల్లడించారు. వీటిని నెక్సా షోరూమ్‌ల ద్వారా అమ్ముతామని కంపెనీ వర్గాలు తెలిపాయి. కొత్తగా ప్రవేశపెడుతున్నందున అమ్మకాలు మరింత మెరుగుపడతాయని భార్గవ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి కొనుగోళ్లు ఎక్కువగానే ఉంటాయని అన్నారు.

బంధన్ గూటికి గృహ్ ఫైనాన్స్

ముంబై : మార్ట్‌గేజ్ రుణాలిచ్చే గృహ్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను బంధన్ బ్యాంక్ లిమిటెడ్ చేజిక్కించుకుంటోంది. హౌసింగ్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించాలనుకుంటున్న బంధన్ బ్యాంక్ ఆ దిశలోనే ఈ కొనుగోలుకు నిర్ణయించింది. బంధన్ బ్యాంక్‌లో ప్రమోటర్ల వాటా తగ్గించుకోవడానికీ ఈ చర్య దోహదపడనుంది. గృహ్ ఫైనాన్స్ లిమిటెడ్ కొనుగోలుకు షేర్ల శ్వాప్ (షేర్ల జారీ) మార్గాన్నే బంధన్ ఎంపిక చేసుకుంటోంది. గృహ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ప్రతి 5 షేర్లకు 3 బంధన్ బ్యాంక్ షేర్లు జారీ చేస్తారు. ఆరు నెలల వెయిటెడ్ ఏవరేజ్ ధర ఆధారంగా ఈ శ్వాప్ నిష్పత్తిని నిర్ణయించినట్లు డీల్‌తో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. గృహ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ (హెచ్‌డీఎఫ్‌సీ) లిమిటెడ్‌కు 57.83 శాతం వాటా వుంది. విలీనం తర్వాత కొత్త సంస్థలో తనకుండే వాటాలో 5.5 శాతాన్ని సంస్థాగత ఇన్వెస్టర్లకు లేదా ఓపెన్ మార్కెట్లో విక్రయించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ అంగీకరించింది. ఆర్‌బీఐ నిబంధనల మేరకు, కొత్త సంస్థలో ప్రమోటర్‌గా తన వాటాను 10 శాతం లోపుకు హెచ్‌డీఎఫ్‌సీ తగ్గించుకుంటుంది. బంధన్ బ్యాంక్‌గృహ్ ఫైనాన్స్ డీల్‌ను ఈ వారంలోనే వెల్లడిస్తారని భావిస్తున్నారు. రెండు కంపెనీల బోర్డు మీటింగ్‌ల అనంతరం ప్రకటన వెలువడనుంది. ఆర్‌బీఐ బ్యాంకింగ్ లైసెన్స్ నిబంధనల ప్రకారం బంధన్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్ బంధన్ బ్యాంకులో తన వాటాను 82.3 శాతం నుంచి 40 శాతానికి తగ్గించుకోవల్సి వుంది. బ్యాంకు వ్యాపారం ప్రారంభించిన మూడేళ్ల లోపు ఆ నిబంధనను నెరవేర్చడం తప్పనిసరి. ఈ నిబంధనలను నెరవేర్చకపోవడంతో గత సెప్టెంబర్‌లో బంధన్ బ్యాంకు మీద ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. బ్రాంచ్‌ల విస్తరణతోపాటు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర శేఖర్ ఘోష్ రెమ్యూనరేషన్ చెల్లింపు మీదా ఆంక్షలు పెట్టింది. బంధన్ బ్యాంకు ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 63,000 కోట్లు. ఇక గృహ్ ఫైనాన్స్ మార్కెట్ వ్యాల్యూ రూ. 23,000 కోట్లు. మెర్జర్ తర్వాత, సంస్థలో హెచ్‌డీఎఫ్‌సీ వాటా 15.44 శాతానికి, బంధన్ ఫైనాన్షియల్ వాటా 60.27 శాతానికి తగ్గుతాయి. అయినా, బంధన్ ఫైనాన్షియల్ వాటా ఆర్‌బీఐ నిబంధనల కంటే ఎక్కువే వుంటుంది. కాబట్టి, 40 శాతం నిబంధనను నెరవేర్చడానికి బంధన్ ఫైనాన్షియల్ మరికొన్ని చర్యలు తీసుకోవల్సి వుంటుంది. విలీనం ఫలితంగా బంధన్ బ్యాంక్ ప్రమోటర్‌గా హెచ్‌డీఎఫ్‌సీ అవతరిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోనూ హెచ్‌డీఎఫ్‌సీకి ప్రమోటర్ హోదాలో 19.72 శాతం వాటా వుంది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఒక బ్యాంకులో ప్రమోటర్ హోదాలో వున్న వారు మరో బ్యాంకులో అదే హోదాలో పది శాతం కంటే ఎక్కువ వాటాలు కలిగి వుండటానికి వీలు లేదు. దీంతో కనీసం 5.5 శాతం వాటాను అమ్మేందుకు సంస్థాగత ఇన్వెస్టర్లతో హెచ్‌డీఎఫ్‌సీ చర్చిస్తోంది. మెర్జర్ డీల్ గురించి అధికారికంగా హెచ్‌డీఎఫ్‌సీ, బంధన్ బ్యాంకులు ఇంకా ప్రకటించలేదు.

Bandhan Bank

GRUH FINANCE LIMITED
We help you build homes
(A subsidiary of HDFC Ltd)



జియో నుంచి బ్రౌజర్

న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం జియో అండ్రాయిడ్ ఫోన్ల కోసం బ్రౌజర్‌ను ఆవిష్కరించింది. ఇది తెలుగు సహా ఎనిమిది ప్రాంతీయ భాషలను సపోర్ట్ చేస్తుంది. కేవలం 4.8 ఎంబీ సైజ్ మాత్రమే ఉండే ఈ బ్రౌజర్ వేగంగా పనిచేస్తుంది. ఇందులో న్యూస్ షేరింగ్, కంటెంట్ షేరింగ్ ఇన్‌కాగ్నిటో మోడ్, డౌన్‌లోడ్ మేనేజర్ వంటి సదుపాయాలు ఉన్నాయి. గూగుల్, ఫేస్‌బుక్ వంటి సైట్లనూ ప్రాంతీయ భాషల్లో చూసుకోవచ్చు. అక్షరాల పరిమాణాన్ని నచ్చిన రీతిలో మార్చుకోవచ్చు. నచ్చిన సైట్లను బుక్‌మార్క్ కూడా చేసుకోవచ్చు.

మీ 'ఏ2' ధర రూ.రెండు వేలు తగ్గింపు



న్యూఢిల్లీ: షావోమీ మిడ్‌రేంజ్ స్మార్ట్‌ఫోన్ 'మీ ఏ2' ధర రూ. రెండు వేలు తగ్గి రూ.13,999 లకు చేరింది. దీనిని మనదేశంలో గత ఆగస్టులో రూ.16,999 ధరతో విడుదల చేశారు. గత నవంబరులోనూ రూ.వెయ్యి తగ్గించారు. 6జీబీ వేరియంట్ ధర రూ.15,999లకు తగ్గింది. ఇందులో 5.99 డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 660 ప్రాసెసర్, అండ్రాయిడ్ 9.0, డ్యూయల్ కెమెరాలు, డ్యూయల్ బ్యాండ్ వైఫై, ఫింగర్‌ప్రింట్ స్కానర్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ, క్విక్‌చార్జ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. దీనిని మీడాట్‌కామ్, అమెజాన్‌డాట్‌ఇన్‌లో కొనుగోలు చేయవచ్చు.



లగ్జరీ కార్లు ఎక్కువమంది కొనలె

హైదరాబాద్, వెలుగు : లగ్జరీ కార్ల పరిశ్రమకు 2018 సంవత్సరం పెద్దగా కలిసిరాలేదు. లగ్జరీ కార్ల అమ్మకాల్లో 2017 లో 17 శాతం వృద్ధి సాధించగా, 2018 లో 4-5 శాతం వృద్ధితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. భారమైన దిగుమతి సుంకాలు, స్థూల ఆర్థిక పరిస్థితులు, బలహీనమైన స్టాక్ మార్కెట్ వంటివి కార్ల అమ్మకాలను ప్రభావితం చేశాయి. 2017 లో లగ్జరీ ఎస్ యువి కార్ల అమ్మకాలు కలిసి 39,039 కాగా, 2018 లో సుమారు 41 వేల కార్లు అమ్ముడయ్యాయి. 2016 లగ్జరీ కార్ల అమ్మకాలను మినహాయిస్తే గత పదేళ్లలో లగ్జరీ కార్ల అమ్మకాల్లో ఇంత తక్కువ వృద్ధి నమోదు అయిన సంవత్సరం 2018 అనే చెప్పవచ్చు. సుప్రీం కోర్టు లార్జ్ డీజిల్ పవర్డ్ కార్ల ను ఎన్ సిఆర్ (నేషనల్ కాపిటల్ రీజియన్) లో నిషేధించడంతో తో పాటు డీమానిటైజేషన్ 2016 లగ్జరీ కార్ల మార్కెట్ ను విపరీతంగా ప్రభావితం చేసాయి. దీంతో లగ్జరీ కార్ల పరిశ్రమ దాదాపు 8 శాతం నష్టపోయింది. ఇది మినహాయిస్తే 2009 నుండి 2017 వరకు లగ్జరీ కార్ల అమ్మకాలు జోరుమీదే సాగాయి. ఈ దశాబ్ద కాలంలో 2010 లో కార్ల అమ్మకాల్లో అత్యధికంగా 81.56 శాతం వృద్ధి నమోదైంది. 4-5 శాతం తో అత్యల్పంగా వృద్ధి నమోదైంది 2018 లోనే. ఏదేమైనా లైట్ వెహికిల్స్ అమ్మకాల్లో వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో మొదటి ఐదు స్థానాల్లో తిరిగి ఇండియా చోటు సంపాదించుకుంది.

ఫస్టాఫ్ గ్రాండ్ సక్సెస్

2018 లో మొదటి ఆరు నెలలు లగ్జరీ కార్ల కంపెనీలు భారీ లాభాలను మూటగట్టుకుని రెండంకెల వృద్ధి రేటును సాధించాయి. అమ్మకాలు బాగుండడంతో అధికమైన దిగుమతి సుంకాలను కంపెనీలు భరించాయి. ఆ తరువాతి ఆరు నెలల కాలంలో అమ్మకాలు మందగించడంతో లగ్జరీ కార్ల కంపెనీలు ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ తో పోలిస్తే రూపాయి బలహీనపడడంతో కాస్ట్ పెరిగింది. దీంతో పాటు అధికమైన ఇంధన ధరలు, పెరిగిన వడ్డీ రేట్లు, మందకొడిగా సాగిన స్టాక్ మార్కెట్లు వంటివి అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణాలయ్యాయి. ఆడీ అమ్మకాలు భారీగా తగ్గి రెండంకెల నెగెటివ్ గ్రోత్ ను సాధించినట్లు మార్కెట్ వర్గాల అంచనా.

కలిసిరాని పండగ సీజన్

లగ్జరీ కార్ల అమ్మకాలకు పండగ సీజన్ కలిసిరాలేదు. లగ్జరీ కార్ల విభాగానికి 2018 పండగ సీజన్ అత్యంత చేదు సంవత్సరంగా మిగిలిపోయిందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. యేటా ఇయర్ ఎండ్ కు ఆటోమొబైల్ రంగంలో భారీ డిస్కౌంట్లు దర్శనమిస్తుంటాయి. కానీ 2018 లో మాత్రం యేడాది పొడువుగా లగ్జరీ కార్లపై డిస్కౌంట్లు, స్పెషల్ ఆఫర్లు అందిస్తూనే ఉండాల్సి వచ్చిందని, అయినా అమ్మకాలు మాత్రం పెంచుకోలేకపోయినట్లు డీలర్లు వాపోతున్నారు. ధరలు ఆకాశానికంటడంతో లగ్జరీ కార్ల పరిశ్రమ భారీ లాభాలు సాధించడంలో విఫలమైంది.

భారీగా వృద్ధి సాధించిన వోల్వో

కొన్ని కంపెనీలే భారీ వృద్ధి సాధించాయి. వోల్వో ఇండియా 2017 లో 2019 యూనిట్లు అమ్మగా, 2018 లో 2,638 కార్లు అమ్మి 30 శాతం వృద్ధిని సాధించింది. ఎక్స్ సి60 వేరియంట్ కారు వోల్వోకు కలిసివచ్చింది. ఇక బిఎండబ్ల్యూ కూడా 2017 లో 10,405 కార్లు అమ్మగా, 2018 లో 11,105 యూనిట్లు అమ్మి 13 శాతం వృద్ధి ని సాధించింది. బిఎండబ్ల్యూ మిని 2018 లో 700 యూనిట్ల అమ్మకాలు జరిపి 66 శాతం వృద్ధి చెందింది. దీంతోపాటు మెర్సిడెస్ బెంజ్, జాగ్వర్, లాండ్ రోవర్ కంపెనీలు సింగిల్ డిజిట్ గ్రోత్ ను సాధించాయి.

ఇండియా లో అవకాశాలు మెండు

2018 కలిసి రాకపోయినప్పటికీ ఇండియాలో వృద్ధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నానాటికి ఇండియాలో మిలీయనీర్ల సంఖ్య పెరుగుతుండడం, లగ్జరీ కార్లున్నవారి సంఖ్య తక్కువగానే ఉండడం ఇక్కడి వృద్ధి అవకాశాలకు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. ఇండియాలో మొత్తం ఆటో మొబైల్ మార్కెట్లో లగ్జరీ కార్లున్న వారు కేవలం 1.5 శాతమే కాగా, చైనా లో 13 శాతం, యుఎస్ లో 10 శాతం ఉన్నారు. ఇది కూడా ఇండియాలో లగ్జరీ కార్ల మార్కెట్ మరింత వృద్ధి చెందడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2018 నాటికి ఇండియాలో 3.4 లక్షల మంది మిలీయనీర్లు ఉండగా, మార్కెట్ సైజ్ ఇంకా 50 వేల యూనిట్లను కూడా దాటలేదు.

2018లో లగ్జరీ కార్ల అమ్మకాలు	యూనిట్లు	వృద్ధి(శాతాల్లో)
తొలి ఆర్నెల్లు	20,000	13
తరువాతి ఆర్నెల్లు	21,000	-4.54

సంవత్సరం	అమ్మకాలు	వృద్ధి(శాతాల్లో)
2010	15896	81.56
2011	24300	52.87
2012	28438	17
2013	30166	6.08
2014	31912	5.79
2015	36207	13.46
2016	33318	-7.98
2017	39039	16.93
*2018	40788	4.48

*అంచనా

ఎన్నాళ్లో వేచిన ఉదయం రానే వచ్చింది..! దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న విజయం సొంతమైంది..! లెక్కకు మించిన దండయాత్రలకు ఎట్టకేలకు ఫలితం దక్కింది..! ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా టెస్ట్ సిరీస్‌ను గెలిచింది..! 71 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత కంగారూల గడ్డపై కొత్త చరిత్రను సృష్టించింది..! క్రికెట్ అత్యుత్తమ ఫార్మాట్‌లో విదేశీ 'టెస్ట్'ను పాసైన కోహ్లీసేన సగర్వంగా తలెత్తుకున్నది..! ఇంటే కాదు రచ్చ కూడా గెలుస్తామని.. ఉపఖండం అవతల కూడా ఉప్పెనలా విరుచుకు పడతామని ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపింది..! జై టీమిండియా.. జయహో ఇండియా...!



ఎన్నాళ్లో వేచిన విజయం

- చరిత్ర సృష్టించిన టీమిండియా
- వర్షంతో చివరి రోజు ఆట రద్దు
- 2–1తో సిరీస్ నెగ్గిన కోహ్లీసేన
- ఆసీస్ గడ్డపై తొలి సిరీస్ విజయం
- డ్రాగా ముగిసిన నాలుగో టెస్ట్
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్‌గా పుజారా

సిడ్నీ: టీమిండియా టెస్ట్ క్రికెట్‌లో కొత్త పొద్దు పొడించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఏడు దశాబ్దాలుగా అందని ద్రాక్షగా ఉన్న టెస్ట్ సిరీస్ విజయాన్ని విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో ఇండియా ఎట్టకేలకు అందుకున్నది. నాలుగు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. 1947-48లో తొలిసారి ఆసీస్ టూర్‌కు వచ్చిన ఇండియా 12వ పర్యటనలో సక్సెస్ సాధించగలిగింది. వర్షం, ప్రతికూల వాతావరణం కారణంగా ఆఖరి రోజైన సోమవారం ఆట ఒక్క బంతి కూడా పడకుండా పూర్తిగా రద్దు కావడంతో నాలుగో, చివరి టెస్ట్ డ్రాగా ముగిసింది. ఇండియా 622/7 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి.. ఆసీస్‌ను 300 పరుగులకే ఆలౌట్ చేసి నాలుగో రోజే ఫాలోఆన్‌లో పడేసింది. వర్షం, బ్యాడ్‌లైట్‌తో శనివారం 25.2 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఫాలోఆన్‌లో 6/0తో నిలిచిన ఆసీస్‌ను మరోసారి ఆలౌట్ చేస్తే ఇండియా 3-1తో సిరీస్ నెగ్గే అవకాశం కనిపించింది. కానీ, ఆదివారం కూడా వరుణుడు అడ్డు తగిలాడు. మధ్యాహ్నం 2.30 గంటలకు చివరి రోజును రద్దు చేశారు. దాంతో, మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది. అయితే, ఈ టెస్ట్‌కు ముందే సిరీస్‌ను ఖాయం చేసుకున్న ఇండియా బోర్డర్-గావస్కర్ ట్రోఫీని అందుకుంది. చివరి మ్యాచ్‌లో భారీ సెంచరీతో పాటు ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు కొట్టిన చటేశ్వర్ పుజారాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఈ నెల 12న ఇదే మైదానంలో జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు

ఇండియా తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్ (పుజారా 193, రిషభ్ పంత్ 159 నాటౌట్, నేథన్ లైయన్ 4/178); ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 300 ఆలౌట్ (మార్కస్ హారిస్ 79, కుల్దీప్ 5/99, షమి 2/58); ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ (ఫాలోఆన్): 6/0 (ఖవాజా 4 నాటౌట్, హారిస్ 2 నాటౌట్).

4

కెప్టెన్‌గా విదేశాల్లో కోహ్లీకిది నాలుగో సిరీస్ విజయం. 2015లో శ్రీలంకపై 2–1తో, 2016లో వెస్టిండీస్‌పై 2–0తో, 2017లో శ్రీలంకపై 3–0తో ఇండియా సిరీస్‌లు నెగ్గింది.

5

ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ నెగ్గిన ఐదో జట్టు ఇండియా. ఇదివరకు ఇంగ్లండ్ (13సార్లు), వెస్టిండీస్ (4), న్యూజిలాండ్ (1), సౌతాఫ్రికా (3) ఈ ఫీట్ సాధించాయి.

సమష్టిగా.. సగర్వంగా!

(వెలుగు క్రీడా విభాగం)

71 సంవత్సరాలు.. 31 సిరీస్‌లు.. 98 టెస్ట్‌లు.. 292 మంది ప్లేయర్లు.. 29 మంది కెప్టెన్లు..!

ఒక్క టీమిండియానే కాదు.. ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపై ఓడించి టెస్ట్ సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు ఆసియా దేశాలు చేయని ప్రయత్నం లేదు. హనీఫ్ మహమ్మద్, సునీల్ గావస్కర్, కపిల్ దేవ్, వసీం అక్రమ్, సౌరవ్ గంగూలీ, సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కర వంటి లెజెండరీ క్రికెటర్లు కూడా ఆసీస్ గడ్డపై సిరీస్‌ను అందుకోలేకపోయారు. కానీ, వీరందరి తర్వాత వి రాట్ కోహ్లీ నేతృత్వంలోని ఇండియా ఎట్టకేలకు ఆ ఘనత సాధించింది. ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్‌ను నెగ్గిన ఆసియా ఖండపు తొలి టీమ్‌గా చరిత్రకెక్కడం ప్రతీ భారతీయుడు గర్వించాల్సిన విషయం.

ఈ చరిత్రక సందర్భంలో ఒక్కసారి గతంలోకి వెళ్తే.. 1947-48లో తొలిసారి ఆసీస్ టూర్‌కు వెళ్లిన ఇండియా నాడు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 0-4తో దారుణమైన ఓటమిని మూటగట్టుకుంది. తర్వాతి డెబ్బై ఏళ్లలోనూ దాదాపు అదే ట్రెండ్ కొనసాగింది. చాలా సందర్భాల్లో ఇండియా ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చింది. కానీ, సిరీస్ మొత్తంలో ఆసీస్ క్రికెటర్ల పేస్, బౌన్స్ ముందు తలొంచక తప్పలేదు.

కానీ, ఈ సారి తమ జట్టు డిఫరెంట్‌గా ఆడుతుందని కెప్టెన్ కోహ్లీ ప్రామిస్ చేశాడు. విక్టరీ కోసమే ప్రయత్నిస్తామని చెప్పిన అతడు.. ఆసీస్‌ను జయించి చూపించాడు. బ్యాటింగ్, బౌలింగ్ అన్ని విభాగాల్లో హై క్లాస్ ఆటతో కోహ్లీసేన ఆసీస్ పని పట్టింది. కోహ్లీ, పుజారా, బుమ్రానే కాదు.. జట్టుకు తమ అవసరం ఉందనగానే ముందుకొచ్చి తమ కర్తవ్యాన్ని అందరూ సమర్థవంతంగా నిర్వర్తించారు. సమష్టిగా ఆడి ఇండియా సగర్వంగా తలెత్తుకునేలా చేశారు.

ఆ ఇద్దరూ.. తోడుగా అందరూ...

ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా కోహ్లీకి ఫుల్ మార్కులు దక్కితే.. చారిత్రక విజయంలో చటేశ్వర్ పుజారా, జస్‌ప్రీత్ బుమ్రా పాత్రలు చాలా కీలకం. సౌతాఫ్రికా, ఇంగ్లండ్ టూర్లలో కీలక సమయాల్లో బ్యాటింగ్ వైఫల్యంతో పాటు బౌలర్ల తప్పిదాలు విజయావకాశాలను దెబ్బతీశాయి. ఈ సారి మాత్రం అలాంటి పరిస్థితుల్లో ఇండియా గట్టిగా నిలబడింది. చాలా క్లిష్టమైన పెర్త్ స్టేడియం వికెట్‌పై కోహ్లీ క్లాస్ ఆటతో సెంచరీ కొడితే.. సిరీస్ అసాంతం పుజారా మాస్టర్ క్లాస్ బ్యాటింగ్.. బుమ్రా వైవిధ్యమైన బౌలింగ్ ఇండియాకు తొలి సిరీస్‌ను కట్టబెట్టాయి. పర్‌ఫెక్ట్ డిఫెన్సివ్ టెక్నిక్స్‌తో మూడు సెంచరీలు కొట్టిన పుజారా ప్రత్యర్థికి సింహస్వప్నమయ్యాడు. ఇక, ఇండియా బౌలింగ్ ధాటికి ఆసీస్ బ్యాటింగ్ కకావికలమైంది. చివరి టెస్ట్‌లో మార్కస్ హారిస్ చేసిన 79 రన్స్ సిరీస్‌లో ఆసీస్ నుంచి నమోదైన టాప్ స్కోరు అంటే ఆశ్చర్యం కలగకమానదు. 21 వికెట్లు తీసిన జస్‌ప్రీత్ బుమ్రా బంతులకు కంగారూ బ్యాట్స్‌మెన్ వద్ద సమాధానమే లేకుండా పోయింది. కీలక సమయాల్లో వికెట్లు తీసిన మహ్మద్ షమి, ఇషాంత్ శర్మ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. విదేశీ గడ్డపై మన పేస్ బౌలింగ్ ఇంత అద్భుతంగా ఉండడం ఇదే తొలిసారి. స్పిన్నర్లు జడేజా, కుల్దీప్ కూడా ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టగలిగారు. యంగ్‌స్టర్ పృథ్వీ షా గాయంతో వైదొలగడంతో ఓపెనర్‌గా జట్టులోకి వచ్చిన మయాంక్.. రెండు హాఫ్ సెంచరీలతో నమ్మకం నిలబెట్టుకున్నాడు. ఇక, మరో యంగ్ ప్లేయర్, వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను ఎంత పొగిడినా తక్కువే. సిడ్నీలో భారీ సెంచరీ సహా సిరీస్‌లో 350 రన్స్ చేసిన పంత్ విదేశాల్లో సిరీస్‌లో అత్యధిక క్యాచ్‌లతో రికార్డు నెలకొల్పాడు. టెస్ట్ ఫార్మాట్‌లో ఇండియా బెస్ట్ కీపర్ కాగల సామర్థ్యం తనలో ఉందని నిరూపించుకున్నాడు. అంతేకాదు.. తనను స్లెడ్జింగ్ చేసిన ఆసీస్ పార్ట్‌టైమ్ కెప్టెన్ టిమ్ పైన్‌కు బదులిచ్చిన తీరు అతడి బ్యాటింగ్ కంటే పదును అనొచ్చు.

> తమ కల సాకారం చేసుకునేందుకు కోహ్లీసేన శ్రమించిన తీరు.. కంగారూల గడ్డపై ఆడిన తీరును గమనిస్తే ఇది చారిత్రక విజయమే కాదు, అంతకు మించినది. కోహ్లీ చెప్పినట్టు రాబోయే తరం టెస్ట్ క్రికెటర్లలో స్ఫూర్తినింపే మైలురాయి ఇది. ఇండియా అంటే స్వదేశంలో పులి అనే ముద్ర చెరిగిపోయిన తరుణమిది. ఒకప్పుడు వెస్టిండీస్, ఆస్ట్రేలియాను చూసి భయపడినట్టుగా ఇండియా తమ దేశ పర్యటనకు వస్తుందంటే ఉపఖండం అవతలి జట్లు ఇకపై ఒళ్లు దగ్గరపెట్టుకొని ఉండాలని చాటి చెప్పిన విజయమిది.

ఆసీస్ దారిలోనే.. గెలుపు బావుటా..

టీమిండియా ఎట్టకేలకు టెస్ట్‌లోనూ శిఖర స్థాయికి చేరుకున్నదంటే కెప్టెన్ కోహ్లీ జట్టును నడిపిస్తున్న విధానమే కారణం అనొచ్చు. టెస్ట్ క్రికెట్‌నే సుప్రీంగా భావించే విరాట్.. 1990, 2000 దశకాల్లో ఆస్ట్రేలియన్ల మాదిరిగా ఇండియన్స్ ఆడాలని కోరుకుంటున్నట్టు కొద్ది కాలం కిందట అన్నాడు. నాడు ఆసీస్ కాస్త వేగంగా భారీ స్కోరు చేసేసి.. మిగతా పని గ్లెన్ మెక్‌గ్రాత్, షేన్ వార్న్‌లకు వదిలేసేది. ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేసేందుకు తమ బౌలర్లకు తగిన సమయం ఇవ్వాలన్న స్టీవ్‌వా, రికీ పాంటింగ్ పాలసీనీ కోహ్లీ అనుసరించాలని నిర్ణయించాడు. కానీ, చాలా మంది టీమ్ మేట్స్ అందుకు సంసిద్ధం కాలేకపోయారు. అయినా సరే దూకుడుగా ఆడేందుకే కోహ్లీ జై కొట్టాడు. ఫలితంగా సౌతాఫ్రికా, ఇంగండ్ టూర్లలో సిరీస్ కోల్పోయింది ఇండియా. కానీ, తాము ఎక్కడ తప్పు చేస్తున్నామో, ఏ అంశాల్లో మెరుగవ్వాలనే విషయాలను ఈ రెండు టూర్లతో కోహ్లీసేన గ్రహించింది. ఆసీస్ టూర్‌కు మెరుగ్గా సన్నద్ధమై.. సరైన ప్రణాళికలు రచించి.. సమర్థవంతంగా అమలు చేసి ఫలితం రాబట్టింది. ఇప్పటిదాకా వరల్డ్ బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా ఉన్న విరాట్ ఈ విక్టరీతో బెస్ట్ కెప్టెన్‌గా మారాడనంలో సందేహం లేదు. ఈ సిరీస్‌లో బౌలింగ్ మార్పులు, పెర్త్ టెస్ట్‌లో తుది జట్టు ఎంపికపై విమర్శలు వచ్చాయి కానీ.. కెప్టెన్‌గా అతడి కమిట్‌మెంట్‌ను, కేవలం విజయం కోసమే ఆడాలన్న అతడి తీరును ఎవరూ ప్రశ్నించలేరు.

ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ విజయాన్ని అందుకున్న విరాట్ కోహ్లీ, అతడి టీమ్‌కు అభినందనలు. అద్భుతమైన బ్యాటింగ్, అసాధారణ బౌలింగ్, టీమ్ ఎఫర్ట్‌తో మేం గర్వింపడేలా చేశారు. ఇకపై దీన్ని అలవాటుగా మార్చుకోవాలి

- రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి

ఆస్ట్రేలియాలో సాధించిన చారిత్రక క్రికెట్ విజయమిది. గొప్పగా పోరాడిన ఇండియా క్రికెట్ టీమ్‌కు కంగ్రాట్స్. ఈ సిరీస్ విజయానికి మీరు పూర్తిగా అర్హులు

- నరేంద్ర మోడీ, ప్రధానమంత్రి

ఆసీస్‌లో టెస్టు సిరీస్ విక్టరీ ఇండియాకు పెద్ద అచీవ్ మెంట్. స్మిత్, వార్నర్ లేకుండా ఆస్ట్రేలియా బరిలోకి దిగడంలో ఇండియాకు సంబంధం లేదు. తక్కువ సమయం బ్యాన్ విధించే అవకాశమున్నా, ఆసీస్ క్రికెట్‌కు మంచిదనిపించే వీరిద్దరిపై ఏడాది నిషేధాన్ని విధించారు. ఆటను అప్రతిష్టపాలు చేయాలని భావించేవాళ్లకు ఇదో హెచ్చరికలాంటిది

– సునీల్ గావస్కర్





ఈ విక్టరీ.. నా కెరీర్‌లోనే బెస్ట్

సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై సాధించిన టెస్ట్ సిరీస్ విజయం తన కెరీర్‌లోనే అత్యుత్తమం అని టీమిండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ అన్నాడు. కెరీర్‌లో ఇప్పటివరకు ఎన్నో ఘనతలు సాధించిన విరాట్.. ఆసీస్‌ను వారి దేశంలో, అది కూడా టెస్టుల్లో ఓడించడం చాలా గొప్ప అచీవ్‌మెంట్ అన్నాడు. 'ఆస్ట్రేలియాలో విజయం సాధించిన జట్టుకు నాయకత్వం వహించినందుకు గర్వపడుతున్నా. మా ఆటగాళ్లు కెప్టెన్ తలెత్తుకునేలా చేశారు. ఈ ఘనత వెనుక పుజారా పాత్ర కీలకం. మయాంక్ అరంగేట్రం టెస్ట్‌లోనే ప్రపంచ స్థాయి బౌలింగ్ లైనప్‌ను ఎదుర్కొని జట్టుకు అవసరమైన ఇన్నింగ్స్ ఆడాడు. తన స్టైల్‌లో ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగిన రిషభ్ పంత్ కూడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్ మొత్తం మీద బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఏదని అడిగితే.. ఎంసీజీలో హనుమ విహారి ఇన్నింగ్స్‌కే నా ఓటు. ఎంసీజీ వికెట్‌పై పేసర్లు కొత్త బంతితో వేసిన 70 -80 డెలివరీలు ఎదుర్కొవడం సెంచరీ చేయడం కంటే గొప్ప. ఇక, మా బౌలింగ్ విభాగం సత్తా వల్లే కొత్త చరిత్ర సృష్టించాం. యువ రక్తంతో నిండిన టీమిండియా ఈ విజయంతో భవిష్యత్తుకు బాటలు వేసింది. విరామం లేకుండా క్రికెట్ ఆడుతున్న మా బౌలర్లు గాయాలబారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకోసం అదనంగా మరో ముగ్గురు బౌలర్లను వెతుకుతున్నాం. ఆసీస్‌లో మేం సాధించిన విజయం యువ క్రికెటర్లలో స్ఫూర్తి నింపుతుంద'ని విరాట్ పేర్కొన్నాడు.

'1983' కంటే గొప్పది

టీమిండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి

ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ విజయం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని కోచ్ రవిశాస్త్రి అన్నాడు. 'అత్యంత కఠినమైన టెస్ట్ ఫార్మాట్‌లో దక్కిన ఈ విజయం, 1983 వరల్డ్‌కప్, 1985 వరల్డ్ చాంపియన్‌షిప్ కంటే గొప్పది. ఆస్ట్రేలియాను వారి గడ్డపై ఓడించి, 71 ఏళ్ల చరిత్రను తిరగరాసిన టీమిండియా కెప్టెన్ కోహ్లీకి సెల్యూట్ చేస్తున్నా. కోహ్లీ ఆడినట్టుగా ప్రపంచంలో మరే క్రికెటర్ టెస్టులాడడని కచ్చితంగా చెప్పగలను. విరాట్ తన బాధ్యతను పూర్తి చేసి మిగిలినవారు తమ పని వంద శాతం చేసేలా ప్రేరేపిస్తాడు. గత మూడేళ్లలో టీమిండియా ఆలోచన విధానం మారిపోయింది. మా జట్టులో దేవుళ్లు, సీనియర్లు, జూనియర్లు అని ఎవరూ లేరు. అంతా కలిసి ఒక కమిట్‌మెంట్‌తో పోరాడి చరిత్ర తిరగరాశారు. మేం అసలైన టెస్ట్ క్రికెట్ ఆడామని ప్రస్తుతం జట్టులో ఉన్న ప్రతి ప్లేయర్, గతంలో ఇండియాకు ఆడిన ఏ జట్టుకైనా బదులివ్వగలర'ని శాస్త్రి చెప్పాడు.

అవధ్ వారియర్స్ నాలుగో విజయం

బెంగళూరు : గెలిచి తీరాల్సిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో వరల్డ్ నెం 8 సన్ వాన్‌వో 15-6, 15-6తో రాజీవ్ ఊసెఫ్‌ను సునాయాసంగా ఓడించడంతో చెన్నై స్మాషర్స్‌తో జరిగిన టై లో అవధ్ వారియర్స్ 4-3తో గెలిచింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన ఈ టై లో ఇరు జట్లు తమ ట్రంప్ మ్యాచ్‌లు గెలవడంతో ఆఖరి మ్యాచ్‌కు వచ్చేసరికి 3-3తో సమంగా నిలిచాయి. దీంతో చివరిగా జరిగిన పురుషుల సింగిల్స్ కీలకంగా మారింది. కాగా తొలుత జరిగిన పురుషుల డబుల్స్(2-0), పురుషుల సింగిల్స్(2-0)లో అవధ్ విజయం సాధించగా, తర్వాత జరిగిన మహిళల సింగిల్స్(2-0), మిక్స్‌డ్ డబుల్స్(2-1)లో చెన్నై స్మాషర్స్ గెలిచింది. ఈ సీజన్‌లో అవధ్‌కు ఇది నాలుగో విజయం.

తిండి తినడు, తాగి బతుకుతాడు

లిక్విడ్ ఫుడ్‌కు పెరుగుతున్న ఆదరణ

న్యూయార్క్: రేపటి తరం మనిషి, తిండి తినడట. కేవలం లిక్విడ్ ఫుడ్ తీసుకుని బతికేస్తాడట. మనం ఇప్పుడు తీసుకుంటున్న ఫుడ్ ను చాలా మంది ఇష్టపడరట. ఎప్పుడు ఆకలేస్తే, అప్పుడు బాటిల్స్ లో ఉండే లిక్విడ్ ఫుడ్‌నే గటగటమని తాగేస్తారట. భవిష్యత్తులో మనిషి ఫుడ్ హేబిట్స్‌పై జరిగిన రీసెర్చ్ లో ఆశ్చర్యకరమైన ఈ విషయం వెల్లడైంది. మనిషి బతకాలంటే ఆహారం తీసుకోవాల్సిందే. ఫుడ్ హేబిట్స్ ఎప్పుడూ ఒకేలా ఉండవు. కాలానికి తగ్గట్టు, అవి కూడా మారుతుంటాయి. దీని మీద వరల్డ్ వైడ్‌గా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వీటిలో బోలెడన్ని ఆసక్తికరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. లిక్విడ్ ఫుడ్ వీటిలో ఒకటి.

టైమ్ మేనేజ్‌మెంట్‌కు టాప్ ప్రయారిటీ

రానున్న రోజుల్లో మనిషి టైమ్ మేనేజ్‌మెంట్ కు టాప్ ప్రయారిటీ ఇస్తాడని పరిశోధనలు చెబుతున్నాయి. 24 గంటల్ని పూర్తిగా వాడుకోవాలనుకుంటాడు. నిమిషం కూడా వేస్ట్ చేయడానికి ఇష్టపడడు. ఈ నేపథ్యంలో లిక్విడ్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతాడు. కేవలం కొన్ని సెకన్లలోనే గుటుక్కుమనిపించే ఫుడ్‌ను తీసుకోవడానికే ఓటేస్తాడు. అంటే బాటిళ్లలో ఉండే లిక్విడ్ ఫుడ్ ఎంట్రీ ఇస్తుందన్నమాట.


అమెరికా ఫుడ్ ఇండస్ట్రీ లో సోయ్ లెంట్ సందడి


సోయ్ లెంట్, ఇదో లిక్విడ్ ఫుడ్. తెల్లగా పాలలా కనిపించే ద్రవం. అమెరికాలో ఫుడ్ ఇండస్ట్రీని ఊపేస్తోంది. సోయ్ లెంట్, రాబ్ రినేహార్ట్ అనే అమెరికన్ క్రియేటివిటీ. జార్జియాకు చెందిన రాబ్, బేసికల్ గా కంప్యూటర్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్. రాబ్ కు మూడు పూటలా ఫుడ్ ప్రిపేర్ చేసుకోవడం ఇబ్బందిగా అనిపించింది. ఓ రోజు లెక్కలు కట్టాడు. కేవలం తినే తిండి కోసం రోజులో గంటన్నర పైగా టైమ్ వేస్ట్ చేస్తున్నానని డిసైడ్ అయ్యాడు. దీని కోసం ఘన రూపంలో ఉన్న ఆహారం మీద ఆధారపడటం తెలివి తక్కువ పని అని డిసైడ్ అయ్యాడు. నార్మల్ ఫుడ్ కు ప్రత్యామ్నాయంగా సోయ్ లెంట్ పేరుతో, ఓ లిక్విడ్ ఫుడ్ ను తయారు చేశాడు. నార్మల్ ఫుడ్ లో ఉండే అన్ని పోషకాలు, సోయ్ లెంట్ లో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఒక మనిషికి ప్రతిరోజూ ఎన్ని కేలరీలు అవసరమో, అన్ని కేలరీలు లిక్విడ్ ఫుడ్ లో ఉండేలా తయారు చేశాడు.

అమెరికాలో లిక్విడ్ ఫుడ్ హిట్


ఇప్పుడు అమెరికాలో చాలా మంది లిక్విడ్ ఫుడ్ తోనే గడిపేస్తున్నారు. లిక్విడ్ ఫుడ్ ను ప్రజలు ఇంతగా ఇష్టపడటానికి చాలా కారణాలున్నాయి. ఘన రూపంలో ఉన్న ఆహారంతో పోలిస్తే, ద్రవ రూపంలో ఉండే సోయ్ లెంట్ తయారీకి ఖర్చు తక్కువ. అంతేకాదు, డ్రింక్ తయారు చేసుకోవడానికి టైమ్ వేస్ట్ కాదు. ఓ వైపు పనులు చక్కబెట్టుకుంటూనే, మరో వైపు సోయ్ లెంట్ బాటిల్ మూత తీసి గటగటా తాగేయవచ్చు. నిమిషం కూడా టైమ్ వేస్ట్ కాదు. ఏమైనా రానున్న రోజుల్లో మనిషి ఆహార పుటలవాట్లలో పెనుమార్పులు రావడం ఖాయం.







సోలార్ రోడ్లు



కుటుంబం మొత్తం రోజూ కాసేపు నడిస్తే చాలు, నెలనెలా కరెంటు బిల్లు కట్టాల్సిన పని ఉండదు. అదే ఎలక్ట్రిక్ కారు వాడారనుకోండి దానికి కరెంటు ఖర్చు ఉండదు. రోడ్డుపైనే ఎంచక్కా చార్జింగ్ పెట్టేసుకోవచ్చు. ఇదంతా సోలార్ రోడ్ల వల్ల భవిష్యత్ తరాలు పొందబోయే సంతోషం. పార్కింగ్ స్థలాలతో మొదలుపెడితే నడక ప్రాంతాలు, డ్రైవ్ వేస్, ప్లాజాలు, ప్లే గ్రౌండ్లు, పార్కుల్లో నడక ప్రాంతాలు ఇలా ఎండ తగిలే ప్రతి ప్రాంతంలోనూ సోలార్ రోడ్లను వేసుకుంటే చాలు కరెంటు కష్టాలు తప్పినట్లే. ఇళ్లు, బిజినెస్, కార్లు ఇలా ఏ కరెంటు బాధనైనా సోలార్ రోడ్లు ఇట్టే తీర్చేస్తాయి.

0.2 నుంచి 0.5 శాతం ప్రపంచ భూమి రోడ్లతో నిండివుంది. 2050 కల్లా ఈ సంఖ్య మరో 60 శాతం పెరుగుతుందని అంచనా. అయితే వీటిని కేవలం రవాణా కోసమే వాడలని ప్రపంచదేశాలు అనుకోవడం లేదు. కరెంటు తయారు చేసుకుంటే పేద్ద సమస్య నుంచి బయటపడొచ్చని భావిస్తున్నాయి. అందుకే రూఫ్‌పై ఉంచే సోలార్ ప్యానళ్ల కన్నా తక్కువ కరెంటును తయారు చేస్తాయని తెలిసినా సోలార్ రోడ్లపై దృష్టి పెడుతున్నాయి. ఇప్పటికే ఫ్రాన్స్ ఒక కిలోమీటర్ రోడ్డేసింది. చైనా ఏకంగా హైవే వేసే పనిలో నిమఘ్నమైంది. చాలామంది ఈ రోడ్ల గురించి వినే ఉంటారు. కానీ రోడ్లు అసలు ఎలా పని చేస్తాయో మీకు తెలుసా?

సోలార్ రోడ్లలో మూడు దశలు

సోలార్ రోడ్లను వేసేందుకు అమెరికా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, చైనా తదితర దేశాలు వేర్వేరు టెక్నాలజీలను వాడుతున్నాయి. స్థూలమైన కాన్సెప్ట్‌లో సోలార్ రోడ్డు మూడు లేయర్స్‌లో ఉంటుంది. ఒకటి పైన కనిపించే రోడ్డు లేయర్. దీంట్లో ఫొటోవోల్టాయిక్ సెల్స్ (సూర్యకాంతి వీటిపైనే పడుతుంది) ఉంటాయి. దీనిపై నడిచే వాహనాలు జారి పోకుండా గరుకుగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా ఇది వాటర్‌ప్రూఫ్. వర్షం పడితే వచ్చే నీళ్లను రోడ్డు పక్కన ఏర్పాటు చేసే ట్యాంకుల్లోకి పంపుతుంది. రెండోది ఎలక్ట్రానిక్ లేయర్. పేరుకు తగ్గట్లే దీనిలో మినీ మైక్రోప్రాసెసర్ బోర్డు ఉంటుంది. సూర్యుడి నుంచి వచ్చే వేడిని ఇది నిరంతరం గమనిస్తుంటుంది. ఒక వేళ మంచు కురిస్తే రోడ్డు వేడిని పెంచి కరిగిస్తుంది. అంటే ఈ రోడ్లతో మంచు ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించొచ్చు. మూడోది అతి ముఖ్యమైన 'బేస్ ప్లేట్ లేయర్'. ఫొటో వోల్టాయిక్ సెల్స్‌పై పడిని కాంతిని కరెంటుగా మార్చుతుంది. దాన్ని తనకు కనెక్ట్ అయిన ఇళ్లు, వ్యాపార సంస్థలు, కార్లు తదితరాలకు సరఫరా చేస్తుంది.

కొత్త బ్యాటరీలు అవసరం

వాహనాలకు రోడ్ల ద్వారా చార్జింగ్ పెట్టాలంటే ఎలక్ట్రోమెకానికల్ బ్యాటరీలు అవసరం. వీటి తయారీకి భారీగా ఖర్చవుతుంది. సరైన టెక్నాలజీని కనిపెట్టగలితేనే కార్లకు చార్జింగ్ పెట్టుకోవడం వీలవుతుంది.



రోడ్ మార్కింగ్స్

సోలార్ ప్యానెల్స్‌ను రోడ్ మార్కింగ్స్‌గానూ వాడొచ్చు. పగలంతా చార్జ్ అయి రాత్రిళ్లు వెలుగుతూ వాహనదారులకు మార్గాన్ని చూపుతాయి. నెదర్లాండ్స్ ఈ టెక్నాలజీపై రీసెర్చ్ చేస్తోంది. దాదాపు పది గంటల పాటు మార్కింగ్ ప్యానెల్స్ పని చేస్తాయట.



దుమ్ము కొట్టుకుపోయింది

అక్కాడియన్ సామ్రాజ్యం పతనానికి కారణమైన ఎడారి దుమ్ము

5 వేల మీటర్ల ఎత్తయిన మౌంట్ 'దామవండ్'. ఇరాన్‌లో ఉంటుంది. ఈ భారీ పర్వతం నీడలో కనిపిస్తుంది గోల్-ఇ-జార్డ్ గుహ. కొంచెం లోపలికి వెళ్లి చూస్తే అందులో స్టాలగ్‌మైట్లు, స్టాలక్‌టైట్లు (ఖనిజాలతో కూడిన నీరు కారడం వల్ల గుహల్లో ఏర్పడిన పదునైన రాతి రూపాలు) కనిపిస్తాయి. కొన్ని వేల ఏళ్లుగా మెల్లగా వృద్ధి చెందుతున్నాయి. నాటి వాతావరణ పరిస్థితులు, మార్పుల గురించి తెలుసుకునేందుకు ఇప్పుడవే ఆధారాలుగా మారాయి. క్లైమేట్ చేంజ్ వల్ల నాలుగు వేల ఏళ్ల కిందట అక్కాడియన్ సామ్రాజ్యం పతనమవ్వడానికి, గుహలోని స్టాలగ్‌మైట్ కెమిస్ట్రీలో జరుగుతున్న మార్పులకు ఉన్న సంబంధాలు బయటపడుతున్నాయి.

ప్రపంచంలోనే తొలి ఎంపైర్!


ప్రపంచంలోని తొలి సామ్రాజ్యం అక్కాడియా. 4,300 ఏళ్ల కిందట మెసపటోమియాలో 'సర్గాన్ ఆఫ్ అక్కాడ్' ఏర్పాటు చేశాడు. స్వంతంత్ర రాజ్యాలను ఏకం చేసి అక్కాడియా సామ్రాజ్యాన్ని నిర్మించాడు. టైగ్రిస్, యూఫ్రటిస్ నదుల (ప్రస్తుత ఇరాక్, సిరియా, టర్కీ మీదుగా ఈ నదులు ప్రవహిస్తాయి) వరకు తన ప్రభావాన్ని కొనసాగించాడు. ఈయన సామ్రాజ్యంలో ఉత్తరం వైపున విభిన్న వాతావరణ పరిస్థితులు, వానాధారమైన భూములు ఉండగా, దక్షిణం వైపున నీటిపారుదల వెసులుబాటు ఉన్న ఒండ్రు మట్టి మైదానాలు ఉన్నాయి.

అసలేమైంది?

క్రమంగా ఉత్తర వైపున ఉన్న భూముల్లో ఉత్పత్తి అయ్యే ధాన్యంపై సామ్రాజ్యం ఆధారపడటం పెరిగింది. అక్కడ పండే ధాన్యాన్నే తన సైన్యానికి, కీలకమైన మద్దతుదారులకు అక్కాడ్ అందజేసేవాడు. ఇలా చాలా ఏళ్లు కొనసాగింది. దీంతో భారీగా వలసలు, సంఘర్షణల కారణంగా ఓ శతాబ్దం తర్వాత అక్కాడియన్ సామ్రాజ్యం పతనమైంది. నాటి అక్కాడియన్ సామ్రాజ్య పరిస్థితులను పురాతన 'కోర్స్ ఆఫ్ అక్కాడ్'లో పూర్తిగా పొందుపరిచారు. అప్పట్లో తీవ్ర నీటి, ఆహార సంక్షోభం తలెత్తిందని అందులో పేర్కొన్నారు. "సారవంతమైన వ్యవసాయ భూముల్లో ఒక్క గింజనూ పండించలేదు. ముంచెత్తిన నీటిలో ఒక్క చేపను పెంచలేదు. సాగునీటి తోటల నుంచి ఒక్కచుక్క కూడా వైన్ ఉత్పత్తి చేయలేదు. కమ్ముకున్న మేఘాల నుంచి ఒక్క చుక్క వర్షం కురవలేదు" అని వివరించారు.

పతనం ఎందుకు?

అక్కాడియన్ సామ్రాజ్య పతనానికి గల కారణాలపై చరిత్రకారులు, ఆర్కియాలజిస్టులు, సైంటిస్టులు ఇప్పటికీ వాదించుకుంటున్నారు. అకస్మాత్తుగా ఏర్పడిన కరువు వల్ల ఉత్తర ప్రాంతంలో పంట ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడిందని ఆర్కియాలజిస్ట్ హార్వే వీయిస్ విశ్లేషించారు. ఒకప్పటి సంపన్న ప్రాంతం, ఉన్నట్టుండి పాడుబడి పోవడానికి గల ఆధారాలను ఉత్తర సిరియాలో సేకరించారు. సారవంతంగా ఉన్న భూములు.. తర్వాతి కాలంలో గాలి దుమారాల కారణంగా వచ్చిన దుమ్ము, ఇసుకతో నిండిపోయినట్లుగా గుర్తించారు. ఇలా నేలలో సారవంతం తగ్గి క్రమంగా మెసపటోమియా అంతటా కరువు ఏర్పడినట్లు వెల్లడించారు. అయితే వీయిస్ విశ్లేషణను చాలా మంది రీసెర్చర్లు వ్యతిరేకించారు. ఆయన ఇచ్చిన ఆర్కియాలాజికల్ ఎవిడెన్సుల్లో కచ్చితత్వం లేదని అన్నారు.



- సారవంతమైన నేలలు పనికి రాకుండా పోయిన పరిస్థితి
- ఫలితంగా కరువులు, వలసలు, ఘర్షణలు
- వేల ఏళ్ల నాటి స్టాలగ్‌మైట్ల డేటా విశ్లేషణ ద్వారా వెలుగులోకి

300 ఏళ్లు కరువు

యురేనియం, థోరియం క్రోనాలజీ ద్వారా స్టాలగ్‌మైట్ల కాలాన్ని కచ్చితంగా లెక్కించవచ్చు. ఈ మెథడ్‌ను ఉపయోగించి మెసపటోమియా వాతావరణ చరిత్రను స్టడీ చేసి పూర్తి వివరాలతో వెల్లడించాం. నాడు రెండు తీవ్ర కరువులు సంభవించాయి. 4,510 ఏళ్లకిందట వచ్చిన కరువు 110 ఏళ్లపాటు కొనసాగింది. తర్వాత 4,260 ఏళ్ల కిందట వచ్చిన కరువు ఏకంగా 290 ఏళ్ల పాటు ప్రభావం చూపింది. దీంతో ఉత్తరం నుంచి దక్షిణం వైపునకు పెద్ద సంఖ్యలో ప్రజల వలసలు పోటెత్తడం, స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఘర్షణలు జరిగాయి. ఈ క్రమంలో వలసలను నిరోధించేందుకు టిగ్రిస్, యూఫ్రేట్స్ మధ్య 180 కిలోమీటర్ల పొడవైన గోడను కూడా నిర్మించారు.

-స్టేసీ కారోలిన్, ఆక్స్‌ఫర్డ్ పాలియోక్లైమటాలజిస్ట్

స్టాలగ్‌మైట్లు ఏం చెబుతున్నాయి?

తాజాగా గోల్-ఇ-జార్డ్ గుహలో సేకరించిన స్టాలగ్‌మైట్ల సమాచారం మెసపటోమియా సామ్రాజ్య పతనంపై ఉన్న వివాదాలను మరోసారి చర్చల్లోకి తీసుకొచ్చింది. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన పాలియోక్లైమటాలజిస్ట్ (పురాతన వాతవరణ శాస్త్రం) స్టేసీ కారోలిన్, ఆమె సహచరులు గుహలోని స్టాలగ్‌మైట్ల డేటాను విశ్లేషించారు. 5,200 నుంచి 3,700 ఏళ్ల కిందటి డస్ట్ యాక్టివిటీ రికార్డులను రూపొందించారు. గుహలోని దుమ్మును అనలైజ్ చేస్తే అక్కడి వాతావరణ చరిత్ర గురించి ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయని ఆమె చెప్పారు. "అక్కాడియన్ సామ్రాజ్యానికి గోల్-ఇ-జార్డ్ గుహ వందల మైళ్ల దూరంలో ఉంది. అయినప్పటికీ గాలులన్నీ కింద ఉన్న గుహ వైపు వీస్తాయి. సిరియా, ఇరాక్‌లోని ఎడార్లలో లేచే 90 శాతం దుమ్ము ఇక్కడి వరకు వచ్చింది. అక్కడి సున్నపురాయితో పోలిస్తే ఎడారి దుమ్ములో మెగ్నీషియం సాంద్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో గుహలో స్టాలగ్‌మైట్లు ఏర్పడ్డాయి. ఇంకా వృద్ధి చెందుతున్నాయి. అంటే ఎడారి దుమ్ము ఎక్కువగా వీచేదని, దీంతో పొడి వాతావరణ పరిస్థితులు ఎక్కువ కాలం కొనసాగాయని తెలుస్తోంది. దీంతో వరుస కరువులు, వలసలు, ఘర్షణలు కొనసాగాయి. అక్కాడియన్ సామ్రాజ్యం ఏర్పడిన శతాబ్దానికే పతనమైంది.

గులాబ్‌జామ్.. పాకిస్థాన్ జాతీయ స్వీటు

గులాబ్ జామూన్.. ఆ పేరు వినగానే నోరూరుతుంది కదా. చక్కెర పాకంలో మెత్తగా నానబెట్టి ఉన్న గులాబ్‌జామ్‌ను తింటుంటే! అందుకే పాకిస్థాన్ గులాబ్ జామ్‌ను జాతీయ స్వీట్‌గా ఎంపిక చేసింది. ఇందుకోసం ఓ సర్వే కూడా చేసింది. అసలు జాతీయ స్వీట్‌గా ఏది ఉంటే బాగుంటుందంటూ జిలేబీ, గులాబ్‌జామ్, బర్ఫీల పేర్లతో ట్విట్టర్‌లో పోలింగ్ పెట్టింది. 15,196 మంది ఈ ఓటింగ్‌లో పాల్గొనగా.. 47 శాతం మంది గులాబ్‌జామ్‌నే ఎంపిక చేశారు. దీనితో పోటాపోటీగా నిలిచిన జిలేబీకి 34 శాతం మంది ఓటేశారు. దాంతో గులాబ్‌జామ్‌ను 'ఖ్వామీ మిఠాయి (జాతీయ స్వీట్)'గా



ప్రకటించేశారు. అయితే గులాబ్ జామ్ ఎంపిక చేయడంపై పాక్‌లోనే విమర్శలు వస్తున్నాయి. ఒక్క ట్విట్టర్‌లోనే పోలింగ్ నిర్వహించడం ఏమిటని, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోనూ పెడితే బాగుండేదని అంటున్నారు. అంతేకాదు కరాచీకి చెందిన హల్వా కూడా చాలా ఫేమస్. ఓటింగ్‌లో ఇది లేదు.

ఎక్కడిదీ గులాబ్‌జామ్?

గులాబ్ జామ్ ఎక్కడిదన్న దానిపై భిన్న వాదనలున్నాయి. పర్షియన్లు గులాబ్‌జామ్‌ను ఉప ఖండానికి పరిచయం చేశారని, షాజహాన్ వ్యక్తిగత వంటవాడు గులాబ్ జామ్‌ను సృష్టించాడనేవి వాదనలు. పేరు కూడా గందరగోళానికి కారణం. గులాబ్ పర్షియన్ పదం. జామూన్ పదానికి అర్థం నేరేడు పండు. ఇవి ఉప ఖండానికి చెందినవి. సగం పర్షియన్ పేరు, సగం ఉప ఖండం పేరు ఉండటంతో గులాబ్‌జామ్ ఎవరిదనే వాదనలున్నాయ్. చిత్రమేమిటంటే పర్షియన్ ప్రాంతమైన టర్కీ, అరబిక్ దేశాల్లో గులాబ్‌జామ్‌ను 'లోఖ్మా' అని పిలుస్తారు.


షుగర్‌ను తగ్గించొచ్చట

మన శరీరంలోని వేరే కణాలు ఇన్సులిన్ ఉత్పత్తి చేస్తాయట

షుగర్ జబ్బు ఒక్కసారి వచ్చిందంటే ప్రాణం పోయే దాకా వదలదు. కిడ్నీలు మొదలు శరీరంలోని కీలక అవయవాలపై ప్రభావం చూపుతుంది. కళ్లు, ఒళ్లు ఇలా అన్నింటిని గుల్ల చేసి పారేస్తుంది. ఈ జబ్బును నయం చేయలేమని సైంటిస్టులు తేల్చేశారు. తిండిని అదుపులో పెట్టుకోవడం, టైంకు మందులు వేసుకోవడం తప్ప మరింకేం చేయలేమన్నారు. కానీ డయాబెటిస్‌కు మందు మానవ శరీరంలోనే దాగి ఉందన్న విషయాన్ని పసిగట్టలేకపోయారు. పాడైపోయిన ఇన్సులిన్ కణాల స్థానంలో వచ్చి చేరి, మళ్లీ ఇన్సులిన్ చేసే అరుదైన కణాలను నార్వేలోని బెర్గిన్ యూనివర్సిటీ సైంటిస్టులు గుర్తించారు. వీటి ద్వారా డయాబెటిస్‌ను నయం చేయొచ్చని అభిప్రాయపడుతున్నారు.

రక్తంలోని చక్కెర స్థాయిని అదుపు చేసేందుకు మన పాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి అవుతుంది. కొందరిలో ఈ కణాలు లేకపోవడం వల్ల లేదా పాడవడం వల్ల హార్మోన్ సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఇన్సులిన్ తయారు కాదు. దీంతో రక్తంలో చక్కెర పాళ్లు పెరిగి గ్లూకోజ్ మూత్రం రూపంలో బయటకుపోతుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా చాలా మంది పేషెంట్లు ఇన్సులిన్ ఇంజెక్షన్లను వాడుతుంటారు. ఇక ఈ బాధ అక్కర్లేదని బెర్గిన్ సైంటిస్టులు అంటున్నారు. పాంక్రియాస్‌లో ఇన్సులిన్ కణాలకు పక్కనే ఉండే గ్లూకాగాన్ కణాలు కూడా ఇన్సులిన్‌ను తయారు చేయగలవట.

డయాబెటిస్ పేషెంట్లలోని గ్లూకాగాన్ కణాలను యాక్టివేట్ చేయడం ద్వారా ఇన్సులిన్ పునరుత్పత్తి సాధ్యమవుతుందని సైంటిస్టులు అంటున్నారు. ప్రాక్టికల్‌గా దీన్ని చేసి చూపించారు కూడా. జంతువులపై దీన్ని టెస్ట్ చేసిన సైంటిస్టులు రెండే శాతం ఉన్న ఇన్సులిన్ కణాలను ఐదుకు పెంచగలిగారు. త్వరలోనే మనుషులపై టెస్టు చేసి, ప్రత్యేక ట్రీట్‌మెంట్‌ను రూపొందిస్తామని చెప్పారు.





సూర్యుడు చిన్నబోయాడు

విశ్వానికి వెలుగునిచ్చే సూర్యుడు దాగుడుమూతలు ఆడిన క్షణం అది. ఈ ఏడాది సంభవించిన తొలి గ్రహణమిది. పాక్షికంగా సూర్యుడి మీద కొచ్చింది. చైనాలోని ఇంచువాన్‌లో ఇలా కెమెరాకు చిక్కింది.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.